తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM శ్రీకాకుళం : fb.com/vaartha Digital
Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
5-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 64 పేజీలు: 16 వెల: 8.00





శనివారం కర్ణాటక సింధనూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్

# ఓటమే సక్సెస్‌కు సోపానం

>> చేశారని ఆయన గుర్తు చేశారు. వారి రుణం తీర్చుకునేందుకే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. "పెద్దాయనను జైలులో పెట్టగానే, మనకు ఈ రాజకీయాలు అవసరమా? అని నా భార్య బ్రాహ్మణి నన్ను అడిగింది అని లోకేశ్ చెప్పారు. 'అందుకు తాను ఒకటే సమాధానం చెప్పానన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగోళ్లంతా మనకు అండగా నిలబడ్డారని బదులిచ్చానని' ఆయన వివరించారు. తెలుగు ప్రజలు ఎక్కడున్నా, వారికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని లోకేశ్ భరోసా ఇచ్చారు.

## రాజధానిపై వైసీపీ వైఖరిలో మార్పులేదు: బొత్స



**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని విషయంలో వైసీపీ వైఖరిలో ఏలాంటి మార్పలేదని శాసనమండలిలో ఆ పార్టీ విపక్షనేత బొత్స సత్యనారాయణ మరోసారి స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపినప్పటికీ... వైసీపీ మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోదన్నారు. తాము అమరావతి రాజధానికి వ్యతిరేకంగా కాదని, తమ దృష్టిలో అమరావతి తమకు కేవలం శాసన రాజధాని మాత్రమేనని బొత్స స్పష్టం చేశారు. శాసన రాజధానే కీలకంగా గుర్తించబడుతుందన్నారు. శాసనరాజధాని అస్దిత్వాన్ని తాము దెబ్బతీయలేదన్నారు. ఈ విషయంలో టీడీపీ ప్రజలను పక్కదోవ పట్టిస్తుందన్నారు. అమరావతికి ప్రాధాన్యతను ఇస్తూ తద్వారా మూడు రాజధానుల విధానానికే తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. కేవలం అమరావతి కోసమే రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తాన్ని ఒకే చోట వెచ్చించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కేవలం రాజధాని అభివృద్ధి పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో తాము ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం వికేంద్రీకరణ పేరుతో అమరావతి, విశాఖపట్నం, కర్నూలులను మూడు రాజధానులుగా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేందుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత సాధిం చడంతో పాటు, పనులను వేగవంతం చేస్తోంది. అమరావతి రైతులకుక్రమంగా కౌలు చెల్లించిందెవ్వరో ఆలోచించాలన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదని మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అమరావతి మాకు శాసన రాజధాని మాత్రమేనని పదే.పదే అన్నారు. అమరావతి పనులను కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని మాజీమంత్రి బొత్స విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తామని బొత్స పేర్కొన్నారు. అమరావతికి మేం వ్యతిరేకం కాదు కానీ అమరావతి పేరిట జరిగే అవినీతికి మాత్రమే మేం వ్యతిరేకంమని మాజీమంత్రి బొత్స తెలియజేశారు.



## భగ్గుమన్న కంటైనర్: ఆహుతైన ఆటోలు రూ.32 లక్షల ఆస్తి నష్టం

**బంగారుపాళ్యం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** మధ్యాహ్నపు వేళ..భోజనం కోసం ఓ డాబాలో ఆపి వెళ్ళిన కంటైనర్ నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కంటైనర్ పూర్తిగా దగ్ధమైన సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా..బీహార్ రాష్ట్రానికి చెందిన సుమన్(29) అనే కంటైనర్ లారీ డ్రైవర్ బెంగళూరు నుండి ఆటోలను కంటైనర్ ద్వారా జార్ఖండ్‌కు ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి పక్కన కేజీ సత్రం వద్ద హర్యానా డాబాలో కంటైనర్‌ను ఆపి భోజనం కోసం వెళ్ళగా..కంటైనర్ నుండి ఆకస్మికంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతంతో కంటైనర్ పూర్తిగా దగ్ధం కావడంతో పాటు కంటైనర్‌లో రవాణా చేస్తున్న ఎనిమిది ఆటోలు కూడా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దగ్ధమైన వాహనాలు విలువ సుమారు రూ.32 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హోరా హోరీ

>> అమెరికా, ఇజ్రాయెల్‌లకు చవిచూపిస్తామని బదులిచ్చింది. ఇదిలా ఉంటే ఒకేరోజు రెండు అమెరికా ఫైటర్‌జెట్ విమానాలను కూల్చివేసిన ఇరాన్ చమురుక్షేత్రాలు, నీటి శుద్ధికేంద్రాలే లక్ష్యంగా శనివారం కూడా దాడులునిర్వహించింది. గల్ఫ్‌దేశాల్లోని గ్యాస్, చమురు కేంద్రాలు, అమెరికా స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో తెగబడుతోంది. అదేవిధంగా ఇరాన్‌పై దాడులకు నాయకత్వం వహిస్తున్న ఇజ్రాయెల్ ఆస్తులను కూడా లక్ష్యంగా చేసుకుంది ఇరాన్. ఇజ్రాయెల్‌కు చెందిన ఒక వాణిజ్యనౌకపై డ్రోన్‌తో దాడిచేసి ధ్వంసంచేసామని ఇరాన్ ఐఆర్‌జిసి వెల్లడించింది. ఎంఎస్ సీ ఇషికా అనే వాణిజ్యనౌకను మా డ్రోన్లతో ధ్వంసంచేసామని ఇరాన్ రేడియో ప్రకటించింది. ఇరాన్‌లోని ఖుజెస్థాన్‌ప్రావిన్స్‌లో ఉన్న పెట్రోకెమికల్ కంపెనీలపై అమెరికా ఇజ్రాయెల్‌లు దాడులుచేసి బాంబుల వర్షం కురిపించాయి. అలాగే ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్‌కేంద్రంపైనా ఇజ్రాయెల్ ఫైటర్‌జెట్‌లు దాడులుచేసాయి. 48 గంటలే మీకు గడువు త్వరగా ఒప్పందానికి రాకుంటే ఇరాన్‌లోని అణువిద్యుత్‌కేంద్రాలను ధ్వంసంచేస్తామని ఇరాన్‌ను సమూలంగా నాశనంచేసామని అమెరికా చేస్తున్న ప్రకటనలకు ధీటుగానే ఇరాన్‌కూడా స్పందిస్తోంది. అమెరికాకు చెందిన ఎంక్యూ-1 డ్రోన్ ను ఐఆర్‌జిసి దళాలు కూల్చివేసాయి. అంతేకాకుండా శాశ్వతపరిష్కారమే యుద్ధం ముగింపునకు పరిష్కారం అని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చి స్పష్టంచేసారు. ఇదిలా ఉంటే శతృదేశాలకు సంబంధించిన 160కిపైగా డ్రోన్లను కూల్చివేసామని ఇరాన్‌కమాండర్‌ప్రకటించారు. హర్ముజ్ జలసంధితోపాటు గల్ఫ్‌ఆఫ్ ఒమన్, రెడ్‌సీలనుకలిపే బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని కూడా మూసివేస్తామని ఇరాన్ ప్రకటించింది. హౌతీల సాయంతో ఆ జలసంధిని మూసివేస్తామని రాకపోకలు నిలిపివేయడంజరుగుతుందని అమెరికా అవమానకర రీతిలో దిగిరావాల్సిందేనని ఇరాన్ హెచ్చరించింది. కాగా యుద్ధం కారణంగా ఇరాన్‌లో 3500 మంది, ఇజ్రాయెల్‌లో 19మంది చనిపోయారని ఐక్యరాజ్యసమితి మానవతా విభాగం ప్రకటించింది. గల్ఫ్‌దేశాల్లో కీలకంగా ఉన్న యుఎఇపై 450కిపైగా క్షిపణులు, రెండువేలకుపైగా డ్రోన్లతో దాడులుచేసినట్లు ఇరాన్‌ప్రకటించింది. అలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు కీలకంగా ఉన్న టెక్‌రంగంపైనా దాడులుచేస్తామని హెచ్చరించిన ఇరాన్ బహ్రెయిన్‌లోని అమెజాన్ డేటా సెంటర్‌పైనా దాడులుచేసింది. మొత్తంగాచూస్తుంటే ఇరాన్‌కు మద్దతుగా ఇపుడు చెచెన్యా దళాలు కూడా సిద్ధంఅవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అమెరికా రష్యా ఇరాన్‌కు సహకరిస్తున్నదన్నఆరోపణలుచేస్తోంది. అదేవిధంగా రష్యాకు చెచెన్యా మిత్రదేశంగానే ఉంది. అందువల్ల ఇపుడు ఇరాన్‌కు మద్దతుగాకదనరంగంలోకి కూడా దిగుతున్నట్లు అంచనా. అమెరికా వేలాదిమంది సైనికులను ఇరాన్‌పై దాడికోసం పశ్చిమాసియాకు తరలించడంతో ఇపుడు ఇతర దేశాల్లో కూడా నిరసన పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులుచేస్తోంది. మొత్తంగాచూస్తే ట్రంప్ ఇచ్చిన 48 గంటల గడువును ఇరాన్ ఏమాత్రం లక్ష్యపెట్టకుండా తన దాడులతో ముందుకుపోతోంది.

# ఇక వడివడిగా అమరావతి

>> వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీదక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశం చిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే..ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించడంలో నిరక్ష్యమెందుకు?:** సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిరక్ష ్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు కానీ అధికారులు కానీ తగిన రీతిలో స్పందించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు, బురద జల్లేందుకు, కుట్రలు పన్నేందుకు కొందరు సిద్దంగా ఉన్నారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆయా నిర్మాణ సంస్థలు కూడా ప్రాజెక్టు మేనేజర్లుగా సమర్థులను నియమించుకోవాలని సూచించారు. సరైన వాళ్లని నియమించుకోకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను అనుమతించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లకు ఆదేశాలు:** రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టంచేశారు. కృష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని.. జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నా... ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నాకు చిన్న కుర్చీ చాలు

### పెద్దలపై గౌరవ భావాన్ని చాటుకున్న లోకేష్

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్త ప్రతినిధి:** పెద్దలపై తనకున్న గౌరవాన్ని ఏపీ మంత్రి నారా లోకేష్ మరోసారి చాటుకున్నారు. కర్ణాటకలో పర్యటిసు _న్న ఆయన సింధనూరులో ఎన్టీఆర్ విగ్రహ విష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ కోసం నిర్వాహకులు వేదికపై ప్రత్యేకంగా పెద్ద కుర్చీ వేశారు. పక్కనే కేంద్ర మంత్రి కుమారస్వామి సాధారణ కుర్చీలో ఆసీనులయ్యారు. ప్రత్యేక కుర్చీలో కూర్చోవాలని లోకేష్‌కు కేంద్ర మంత్రి సూచించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన లోకేష్ పెద్దవాళ్ళు మీరే ఆ కుర్చీలో కూర్చోవాలి' అని సవినయమంగా చెప్పారు. అయినా కుమారస్వామి వినకపోవడంతో లోకేష్ సాధారణ కుర్చీ వేయించుకున్నారు. పెద్దలపట్ల గౌరవప్రదంగా వ్యవహరించి లోకేష్ అభిమానుల మనసు చూరగొన్నారు.

## 28 జిల్లాలతో కొత్త మ్యాప్

>> తాజాగా ఈ సంఖ్య 28 కి చేరింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ, అధికారిక మ్యాప్‌లో అమరావతిని రాజధానిగా చేర్చడం ఈ ప్రకటనలో కీలక పరిణామం.

## సినీ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

>> జరుగుతున్నాయని, చిత్ర పరిశ్రమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సింగిల్ విండో విధానం ద్వారా షూటింగ్ అనుమతులను వేగంగా జారీ చేస్తు న్నామని తెలిపారు. కేవలం షూటింగ్‌లకే పరిమితం కాకుండా, ఏపీలో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన జరగాలని మంత్రి ఆకాంక్షి ంచారు. తిరుపతి, వైజాగ్, అమరావతి ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీనికి అవసరమైన భూములను కేటాయించేందుకు హామీ ఇచ్చారు. రికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్ల నిర్మాణానికి ముందుకొచ్చే వారికి ప్రభుత్వం నుంచి పూర్తి తోడ్పాటు ఉంటుందని భరోసా ఇచ్చారు. సినీ పరిశ్రమను ఆదుకునే క్రమంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే సానుకూల నిర్ణయాలు తీసుకుందని మంత్రి గుర్తు చేశారు. భారీ బడ్జెట్ చిత్రాలకు అవసరమైన మేరకు టికెట్ రేట్లు పెంచుకునే అవకాశం కల్పిస్తూ సహకరిస్తున్నామన్నారు. చిన్న చిత్రాలకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సినీ మరియురంగస్థల కళాకారులను గౌరవించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే నంది అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని, అలాగే నంది నాటకోత్సవాల నిర్వహణకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దీనిపై ఇప్పటికే లోతైన అధ్యయనం జరుగుతోందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా కళాకారుడు కావడంతో ఈ రంగంపై వారికి ప్రత్యేక అవగాహన, శ్రద్ధ ఉన్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. మన రాష్ట్రానికి సినీ పరిశ్రమ తరలివచ్చి, ఇక్కడ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా సినీ ప్రముఖులకు పిలుపునిచ్చారు.

## మండుతున్న ఎండలు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో శనివారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యాయి. మరో రెండు రోజులు ఎండల తీవ్రతతో పాటు అక్కడక్కడ వాతావరణం చల్లబడి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం నెల్లూరు(జి) గూడూరులో 41.2 డిగ్రీల తిరుపతి(జి) రేణిగుంటలో 41.1డిగ్రీల కృష్ణా(జి) పెద్దపారుపూడిలో 40.9 డిగ్రీల, చిత్తూరు(జి) నగరిలో 40.4 డిగ్రీల మన్యం(జి) వీరఘట్టంలో 40.3 డిగ్రీల, విజయనగరం(జి) గుర్లలో 40.1 డిగ్రీలపల్నాడు(జి) గురజాల39.8 డిగ్రీల నంద్యాల(జి) గుల్లదుర్తి, కర్నూలు(జి) తోవిలో 39.7డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాలులు వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్దులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# దర్శనమో తిరుమలేశా!

>> భక్తులకు పదిగంటల సమయం దర్శనాలకు పడుతోందంటే తిరుమలలో కొందరు అధికారుల పనితీరు ఏ పాటిదో తెలుస్తుంది. తిరుమల కొండపై ముగ్గురు అధికారుల పర్యవేక్షణలోనే పెత్తనం సాగుతుండటంతో ఎవరికివారే అన్న చందంగా తయారైందని టిటిడి ఉద్యోగుల వాదనలు. భక్తులు క్యూలైన్లలో ప్రవేశించినప్పటినుండి ఆలయంలోపలకు చేరుకునే వరకు ఎంత సమయం పడుతుందనే పర్యవేక్షణ కూడా లేకపోతోండటం దేనికి సంకేతమనేది భక్తులనుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతా బాగానే జరుగుతోంది. వైకుంఠమ్1 లో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నాలుగైదు గంటల్లోనే భక్తులకు దర్శనం చేయిస్తున్నామని కొందరు టిటిడి అధికారులు సిఎం చంద్రబాబునాయుడును మెప్పించి నమ్మించడంలో దిట్టగా మారారు. బుధవారం తమిళనాడుకు చెందిన నలుగురు భక్తులు 300 రూపాయలు దర్శనం ఆన్‌లైన్ టిక్కెట్‌లతో మధ్యాహ్నం 1గంటకు క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే ఆ రోజురాత్రి 8గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారంటే వారి కష్టాలు దేవుడెరుగు. ఇదే విషయాన్ని ఆ భక్తులు ఆలయం వెలుపల బహిరంగంగా అసహనం చెందడం విశేషం. అంతా గారడీలా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చుని విజిలెన్స్ విభాగం, ఐటి విభాగం ఉద్యోగులు మాటలు చెప్పడం తప్ప ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకునే పరిస్థితిలో లేరంటే ఆశ్చర్యంలేదు. రోజువారీగా ఎంతమందికి దర్శనం చేయించామని చెప్పుకోవడం తప్ప ఎంతవరకు భక్తులకు దర్శన కష్టాలు తప్పుతున్నాయనేది తెలుసుకోలేకపోవడం తిరుమలలో కొందరు అధికారుల అత్యుత్సాహంగా మారిందని ఉద్యోగుల ఆరోపణలు. మరీ నిజంగా ఎఐ విధానంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు ఏ లెక్కలు వేసుకుంటున్నారనేది మాత్రం వారికే ఎరుక. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు 90వేలమంది వరకు భక్తులు వస్తుండగా వారిలో విఐపి బ్రేక్ దర్శనాల భక్తులు, శ్రీవాణి బ్రేక్ దర్శనాల భక్తులకు తప్ప మిగిలిన వారందరికీ మహాలఘులోనే జయవిజయుల వరకే అనుమతించి ఎక్కడో దూరం నుండి దేవదేవుని దర్శనం చేయిస్తున్నారు. క్షణకాల దర్శనం కోసం ప్రతి భక్తుడు గంటలుతరబడి నిరీక్షణ తప్పడంలేదు. సంతృప్తికర దర్శనమ్ మాట ఎలా ఉన్నా ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తులు సంతోషంగా తిరిగి వెళ్ళాలనే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు మాత్రం టిటిడి అధికారులు మాటల్లోనే అమలుచేస్తున్నారు. రోజుకు సరాసరి 60వేలమంది భక్తులు దాటితేనే ఆలయం వెలుపల కిలోమీటర్ల దూరం క్యూలైన్లు బారులు తీరి భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుండటం పరిపాటిగా మారింది. ఈ నిరీక్షణకు చెక్‌పెట్టాలని ఎఐ అమలుతీరు కమాండ్ కంట్రోల్‌తో సరిపెట్టేస్తున్నారు. ఆలయానికి చేరుకునే క్యూలైన్లు చేరువచేయాలని గతంలో అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

**తప్పని నిరీక్షణ కష్టాలు:** సాధారణరోజుల్లోనే లక్షమంది భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేల మంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాలమీదుగా ఆక్టోపస్ భవనం, శిలాతోరణం, పాపవినాశనం మార్గంవరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి గంటలుగంటలు నిరీక్షించి చేరుకోవాల్సి ఉంది. 40వేలమంది భక్తులు దాటితేనే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. ఇక్కడ ఎండకు, వానకు సామాన్యభక్తుల కష్టాలు వర్ణనాతీతం. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతంరోజుల్లో ఏకంగా 16నుండి 20గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితులు వున్నాయి. ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు దివ్యదర్శనమ్ దర్శనాలు, సామాన్య భక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అనుమతిస్తున్నారు. టిటిడి అధికారులు తిరుమలలో ముగ్గురు అధికారులు తమదైన రీతిలో ఇవేమీ పట్టించుకోకుండా తమదారి తమదనే రీతిలో సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారనే వాదనలు ఉన్నాయి.

# మహిళా సాధికారతకు 10 సూత్రాలు

>> ఆకాంక్ష, హక్కు అని, అయితే రాష్ట్రంలో దాదాపు 12 లక్షల కుటుంబాలు సంతాన వైఫల్యంతో పలు సమస్యలకు గురవుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారంగా అట్టి కుటుంబాలకు సంతానోత్పత్తి సేవల్ని ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. సాలీనా 50,000కుటుంబాలకు ఈ సేవల్ని ఉచితంగా అందజేసే విధంగా ప్రభుత్వం తగు చర్యల్ని తసుకుంటుందన్నారు. దేశంలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ సేవలకు శ్రీకారం చుడతామని మంత్రి తెలిపారు. ఇందు నిమిత్తం దేశంలో తొలిసారిగా మాతృత్వ పథకం కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ రిప్రొడక్టివ్ హెల్త్‌ను ఏర్పాటు చేస్తామ న్నారు. దీంతో పాటు ఈ సేవలకు సంబంధించి 6 నెలల డిప్లొమా కోర్సు, సంవత్సరం పాటు సాగే అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో సాలీనా దాదాపు నాలుగు వేల మంది ప్రసూతి వైద్యులు పట్టాలు పుచ్చుకుంటున్నారని, వారికి సంతానోత్పత్తి సేవలందిం చడంలో నైపుణ్యాన్ని కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పిన్న వయసులో గర్భధారణ, పౌష్టికాహార లోపం, అధిక సంఖ్యలో సిజేరియన్ జననాలు, భారీ స్థాయిలో మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, తరచుగా ప్రసవాల కారణంగా మాతృ మూర్తులు అనారోగ్యానికి గురవడాన్ని గుర్తించిన ప్రభుత్వం పరిష్కార లక్ష్యాలను నిర్దేశించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం మహిళలకు 70శాతం వరకు జరుగుతున్న కుటుంబ నియంత్రణ ఆపరేష న్లను ఐదేళ్లలో 50 శాతానికి తగ్గించాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 68శాతం వరకు సిజేరియన్లు జరుగుతున్నాయని, వీటిని ఐదేళ్లలో 40 శాతానికి తగ్గించాల్సిన అవసరముందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నొక్కి వక్కాణించారు. రాష్ట్రంలో పిన్న వయసులో గర్భ ధారణ దాదాపు 9 శాతంగా నమోదవుతోందని, దీన్ని 3 శాతానికి తగ్గించడాన్ని లక్ష ్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు.

## మాచర్ల ఘటన నిందితుడిని అరెస్టు చేయండి: సీఎం ఆదేశం

>> నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షల కోసం గుంటూరు జీజీహెచ్ కు తరలించినట్టు సీఎం వివరించారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో నిందితుణ్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి కొందరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వివరించారు. పంచాయితీరాజ్ శాఖలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహిళ ఇంట్లోకి ఒక అగంతకుడు చొరబడి అత్యాచారానికి పాల్పడినట్లు సీఎంకు అధికారులు తెలిపారు. అయితే కేసుకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షలకోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్టు సీఎం వివరించారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో నిందితుణ్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి కొందరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వివరించారు.

## హైదరాబాద్-విజయవాడ ఒక్క గంటలోనే..

>> దించనున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణించే ఉద్యోగులు వ్యాపారవేత్తలకు ఈ ఫ్లైట్‌లు అనుకూలంగా ఉండనున్నాయి. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రయాణికుల సంఖ్య గత కొంతకాలంగా స్థిరంగా పెరుగుతున్నందున , విమానయాన సంస్థలు తమ సేవలను విస్తరించాయి. నూతన సర్వీసుల కోసం టికెట్ బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభించారు. విమానయాన సంస్థల అధికారిక వెబ్‌సైట్లు లేదా ట్రావెల్ పోర్టల్స్ ద్వారా ముందుకు టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. సెలవులు సీజన్‌లో చివరి నిమిషంలో టికెట్ ధరలు పెరగవచ్చునని పరిశీలిస్తే ముందస్తు బుకింగ్ చేయడం ప్రయాణికులకు మంచిది. విజయవాడ విమానాశ్రయ అభివృద్ధిలో రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినల్ పనులు వేగంగా సాగుతున్నాయి. దీని ద్వారా రాష్ట్ర రాజధాని ప్రాంతానికి మరిన్ని నగరాలను కనెక్ట్ చేయడం లక్ష్యంగా పెట్టబడింది. భవిష్యత్తులో దుబాయ్, సింగపూర్ వంటి అంతర్జాతీయ రూట్‌లకు కూడా కొత్త ఫ్లైట్‌లు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ కొత్త విమానా రాకతో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల ప్రజలకు హైదరాబాద్ ప్రయాణం మరింత సులభం అవుతుంది. కేవలం ఒక గంటలో నగరానికి చేరుకోవచ్చు. దీంతో సమయం కాపాడుకుంటారు. రైళ్లు, బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండే సందర్భాల్లో ఈ ఫ్లైట్‌లు ప్రయాణికులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.

## సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారా?

>> వివరణను పార్టీ అధిష్ఠానం సిఎం చంద్రబాబు ముందు పెట్టింది. ఈ క్రమంలో కొందరు నేతల ప్రవర్తనను ఉద్దేశించి చంద్రబాబు శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎవరినైనా సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని పణంగా పెట్టేందుకు సిద్ధంగా లేమని హెచ్చరించారు. "గీత దాటి ప్రవర్తించే వారిని ఇక భరించేది లేదు. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే పునరాలోచన లేకుండా సస్పెండ్ చేసేస్తా. క్రమశిక్షణతో సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండాలనుకోవాలి. ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటున్నారా.. మీరే తేల్చుకోవాలి " అని చంద్రబాబు గట్టి హెచ్చరికలిచ్చారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఇటీవల ఏకంగా పది గంటల పాటు ఎస్పీ ఛాంబర్లో బైఠాయించారు. పల్నాడు జిల్లా పోలీసు సెల్ న్యాయ సలహాదారుగా తాను సూచించిన పేరును ఎందుకు ఆమోదించలేదని, ఆర్డర్ కాపీ చేతిలో పెట్టేవరకూ బయటకు రానని ఎస్పీ బి.కఅష్ణారావుతో వాగ్వాదం పెట్టుకున్నారు. జిల్లా పోలీసు సెల్ న్యాయ సలహాదారుగా రామినేని ప్రసాద్ పేరును సిఫారసు చేస్తూ తాను ఒక లేఖను ఎస్పీ కార్యాలయానికి ఎనిమిది నెలల కిందట పంపానని, ఇంతవరకు దానిపై సంతకం ఎందుకు చేయలేదని ఎస్పీని ఎమ్మెల్యే నిలదీశారు.

విచారణ చేసి సంతకం చేస్తానని ఎస్పీ చెప్పినా వినిపించుకోలేదు. దాంతో ఎస్పీ అక్కడ నుంచి వెళ్లిపోయారు. పావుగంట తర్వాత తిరిగి వచ్చి, సిఫారసు లేఖపై సంతకం చేసి డీజీ కార్యాలయానికి పంపారు. అయినా ఎమ్మెల్యే కదల్లేదు. ప్రసాద్‌ను నియమించినట్లు ఉత్తర్వులు చేతిలో పెట్టేవరకూ కదిలేది లేదన్నారు. అది తన చేతిలో లేదని, ఉన్నతాధికారులు చేయాలని చెప్పినా వినిపించుకోలేదు. మంత్రులు లోకేష్, అనిత కార్యాలయాల నుంచి ఫోన్లు వచ్చినా పట్టించుకోలేదు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకుని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను తదుపరి చర్యలకు ఆదేశించారు.

## వారం - వర్జ్యం

05-04-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
తదియ మ.12.01
విశాఖ రా12.09
వర్జ్యం : తె.4.37 - ఉ.6.24
దు.సా.4.38-సా.5.27
శుభసమయం:ఉ.10.00-11.00
రాహుకాలం సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృషభం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. మాట మీద నిలబడే వ్యక్తిగా మంచిపేరు సంపాదిస్తారు.

**మిథునం:** సేవా కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. శుభకార్యల విషయాలలో మీ నిర్ణయాలు చర్చనీయాంశమౌతాయి.

**కర్కాటకం :** మీ వ్యక్తిగత రహస్యాలు కాపాడుకోవడానికి ప్రాధాన్యతనిస్తారు. విలువైన వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** స్థిర చరాస్తుల అమ్మకాలలో, కొనుగోలులో మెలుకువలు పాటించండి. వివాదాలకు దూరంగా వుండండి.

**కన్య :** శ్రమించని వాళ్లకు హోదాలు లభించడం మీకు ఆశ్చర్యం కలిగిస్తుంది. మీ శ్రమకు తగిన ఫలితం ఉండదు.

**తుల :** ఎంతో కొంత ధనలాభం మాత్రం ఊరట కలిగిస్తుంది. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** వ్యర్థమైన ఖర్చులు, ప్రయాణాలు, అర్థం లేని గొడవలు, పంచాయితీలు, విలువైన సమయాన్ని హరిస్తాయి.

**ధనుస్సు:** రహస్య పెట్టుబడి పెట్టిన వ్యవహారాలు న్యాయపరమైన చిక్కుల్లో పడతాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**మకరం:** జీవితభాగస్వామి సహకారాలు కీలక సమయంలో మీకు అండగా నిలుస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కుంభం:** ఏకపక్ష నిర్ణయాలు ఏకపక్ష వాదన ఆధారంగా నిర్ణయాలు చేయవద్దు. వ్యాపారాలు లభిస్తాయి. వాహన సౌలభ్యం.

**మీనం :** వృత్తి, ఉద్యోగాలలో బదిలీ సమస్యగా మారవచ్చు. ఆర్థికంగా కనీస అవసరాలకు లోటు ఉండదు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

5-4Pg3exHMNWJQE.qxd:5-4Pg3exHMNWJQE.qxd 1/1/02 7:17 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 64 పేజీలు: 16 వెల: 8.00


భగ్గుమన్న కంటైనర్ ఆహుతైన ఆటోలు రూ.32 లక్షల ఆస్తి నష్టం 2లో

వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముడి చక్రస్నానం 5లో

# ఇక వడివడిగా అమరావతి



శనివారం అమరావతి నిర్మాణ పనులపై కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

## అవి బిల్డింగ్‌లు కావు.. రాజధాని సౌధాలు

### గ్రీన్‌ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్

### ప్రభుత్వశాఖలు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

### నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి తీరాల్సిందేనని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్స వం చేస్తామని, ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాం ట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధి కారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశిం చారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావిం చాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టుసంస్థలతో ముఖ్యమంత్రి చంద్ర బాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలవైన పనులు ఉండగా వాటిల్లో రూ. 50, 943కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివ రించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదు పాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్‌పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికితెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యాచాలా మ్రందికార్మికులు వెళ్లారనినిర్మాణ సంస్థప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించు కోవాలని సీఎం సూచించారు.రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరు గుతున్న పనులను నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే >>2




# హోరా హోరీ

### అమెరికా ఎంక్యూడ్రోన్ కూల్చివేసిన ఇరాన్

### బుషెహార్ అణువిద్యుత్‌కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

### ఇరాన్ పెట్రో కెమికల్ కంపెనీలే అమెరికా, ఇజ్రాయెల్‌ల టార్గెట్

### 48 గంటల గడువు మాత్రమే మిగిలిందని హెచ్చరించిన ట్రంప్

**టెహ్రాన్,టెల్‌అవీవ్,వాషింగ్టన్, ఏప్రిల్ 4:** పశ్చిమాసియాలో నెలరోజులు దాటి ఇరాన్‌యుద్ధం మరింతగా ముదురుతోంది. ఇక 48 గంటలే మీకు గడువు ఉందని ఆపై హార్ముజ్ జలసంధిని ఎలా తెరిపించాలో మాకు తెలుసు అంటూ ట్రంప్ ఇచ్చిన వార్నింగ్‌లను ఇరాన్ బేఖాతరుచేస్తోంది. క్షేత్రస్థాయిలో భూతల దాడులకు దిగితే ఎ లా ఉంటుందో మేం కూడా >>2

## మాచర్ల ఘటన నిందితుడిని అరెస్టు చేయండి: సిఎం ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** మాచర్ల పట్టణంలో ఓ ప్రభుత్వ ఉద్యో గినిపై ఆగంతకుడు అత్యాచార ఘటనలో త్వరితగతిన నిందితుణ్ని అరెస్టు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు అధికా రులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మహిళలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితు ల్లోనూ ఉపేక్షి ంచేది లేదని చెప్పాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంచాయి తీరాజ్ శాఖలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహిళ ఇంట్లోకి ఒక అగం తకుడు చొరబడి అత్యాచారానికి పాల్పడి నట్లు సీఎంకు అధికారులు తెలిపారు. అయితే కేసుకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కేసు >>2

## హైదరాబాద్-విజయవాడ ఒక్క గంటలోనే..

**విజయవాడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్ నుంచి విజయవాడ, కృష్ణా, గుంటూరు జిల్లాలకు వెళ్లే ప్రయాణీకులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రయాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు మరిన్ని విమాన సీర్వసులను అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఈ దిశలో కేంద్రం నిర్ణయం తీసు కుంది. కొత్త విమానాలు ఏప్రిల్ 10 నుంచి ఏప్రిల్ 17 నుండి అందుబాటులోకి రాను న్నాయి.విజయవాడ నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణికుల సంఖ్యలో గణనీ యమైన వృద్ధిని దృష్టిలో ఉంచుకుని, విమా నయాన సంస్థలు కొత్త ఫ్లైట్ సర్వీసులను ప్రారంభించనున్నాయి. వేసవి సెలవులు, వ్యాపార అవసరాల కారణంగా ఈ మార్గంలో డిమాండ్ ఎక్కువగా ఉం డటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న ఫ్లైట్లు సరిపోక పోవ డంతో ఈ కొత్త సర్వీసులు ప్రయా ణికులకు మరింత సౌకర్యాన్ని అం >>2

## సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారా?

### ఆలోచించుకోండని ఎమ్మెల్యేలకు సూచన

### ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారంపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

**విజయవాడ, ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలను కుంటున్నారా..మీరే తేల్చుకోవాలి అని సిఎం చంద్రబాబు గట్టి హెచ్చరికలిచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నా డు ఎస్పీ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ నియామక ఘటనపై టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి అరవింద బాబు నిన్న వివరణ ఇచ్చారు. ఈ >>2

# ఓటమే సక్సెస్‌కు సోపానం

### ప్రపంచంలోని తెలుగువారంతా అండగా ఉన్నారు.. వారికి ధన్యవాదాలు

### కర్ణాటక సొంత తల్లిలాంటిది.. విశాఖ ఉక్కుపై కుమారస్వామి హామీ ఇచ్చారు

### సింధనూరులో ఎన్టీఆర్ విగ్రహం, సైనిక స్కూలు ఆవిష్కరించిన మంత్రి లోకేష్



శనివారం కర్ణాటక సింధనూరులో సైనిక్ స్కూల్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** అపజయం సహజమే,అది కుంగిపోవాల్సి న స్థితి కాదు, ఆలోచించాల్సి న సమయం,విజయానికి మార్గదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. జీవితంలో ఓటమి సహజం ఆత్మహత్యలు పరిష్కారం ఎన్నికలకు ముందు ఏ తప్పూ చేయని మా పెద్దాయన (చంద్రబాబు)ను అక్ర మంగా జైలులో పెట్టారు. ఏ తప్పూ చేయకుండా జైలులో పెట్టి నందుకు నేను తీవ్రంగా బాధపడ్డాను. కానీ, ఆ క్లిష్ట సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలంతా మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. నాడు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్వేగంగా అన్నారు. కర్ణాటక సొంత తల్లి లాంటిదన్నారు.ఆనాడు విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అని పోరాడామన్నాను.ఒక పదిసార్లు కలిసిన తర్వాత ఆయనే నాకు ఫోన్ చేసి బ్రదర్ ఎందుకు కంగారు పడుతున్నావ్. విశాఖ ఉక్కును కాపాడే బాధ్యత నేను తీసుకుంటా అని చెప్పిన గొప్ప వ్యక్తి కుమార స్వామి. దానికి మేం రుణపడి ఉన్నాం కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తన తండ్రి అరెస్టు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమాజంలో నైతిక విలువల ఆవశ్యకత గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి నారా లోకేశ్ ఉదయం కర్ణాటకలోని సింధనూరుకు చేరుకున్నారు. స్థానిక తెలుగు యువత ఆయనకు ఘన స్వాగతం పలికింది. భారీ గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. యువగళం జెండాలు చేతబూని జై లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. సింధనూరులోని ఎంజీ సర్కిల్ నుంచి గంగావతి రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు హెచ్.డీ కుమారస్వామి, సంజయ్ సేథ్ పాల్గొన్నారు. ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీలో ప్రజలందరికీ అభివాదం చేస్తూ లోకేశ్, కేంద్ర మంత్రులు ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం హోసళ్లీ క్యాంప్ గంగావతి రోడ్డులోని కమ్మవారి కల్యాణ మండపం వద్దకు చేరు కున్నారు. అక్కడ స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మం త్రులతో కలిసి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం హోసళ్లీ క్యాంప్ లో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను ప్రారంభించారు. సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని కూడా ప్రారం భించారు. స్థానిక తెలుగు వారి యాజమాన్యంలోని విద్యా సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఈ సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయడం విశేషం. సమాజంలో నైతిక విలువలు బాగా పడిపోతున్నాయని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువల కోసమే ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారునిగా నియమిం చుకున్నామని చెప్పారు. తెలుగు వాడుక భాషలో మహిళలను అవమానించేలా కొన్ని పదాలు వాడుతున్నామన్నారు. గాజులు తొడుక్కున్నావా?అమ్మాయిలా ఏడవొద్దుఖీ వంటి పదాలను ఇకపై ఎవరూ వాడొద్దన్నారు. ఇలాంటి కించపరిచే పదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.చంద్రబాబు అరెస్టు నాటి కష్టకాలాన్ని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్ణాటక తెలుగు ప్రజానీకం పెద్ద ఎత్తున ర్యాలీలు >>2

## సినీ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

### తిరుపతి, వైజాగ్, అమరావతిలో స్టూడియో నిర్మాణాలు: మంత్రి దుర్గేష్

**గుంటూరు,ఏప్రిల్ 4 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, జిల్లా ఇంచార్జి మంత్రి



కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సహజసిద్ధమైన లొకేషన్లకు నిలయమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోషూటింగ్‌లు విజయవంతంగా >>2

# 28 జిల్లాలతో కొత్త మ్యాప్

### విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల

### అమరావతి రాజధానిగా గుర్తింపు



**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28 కి పెరిగింది. ఈ మేరకు 28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఎపి విపత్తు నిర్వహణ సంస్థ అధికా రికంగా విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొంది. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లా సంఖ్యను 26 నుంచి 28కి ప్రభుత్వం పెంచింది. రాష్ట్ర పటంలో ఈ మార్పులను ప్రభుత్వం చేసింది. రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను వేరు చేస్తూ మార్కా పురం కేంద్రంగా ఒక జిల్లాను, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పోలవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివఅద్ధి, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, అభివృ ద్ధిని వికేంద్రీకరించే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఎపి, వైఎస్ జగన్ హయాంలో 26జిల్లాలుగా మారింది. >>2

# మహిళా సాధికారతకు 10 సూత్రాలు

### జనాభా నిర్వహణలో మహిళలపాత్ర కీలకం

### మాతాశిశు ఆరోగ్యసంరక్షణకు చర్యలు: మంత్రి సత్యకుమార్



**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** పలు సామాజిక, ఆర్థిక పరిమితులతో వివక్షకు గురవుతున్న మహిళలకు సాధికారిత(ఎంపవర్మెంట్) ద్వారా రాష్ట్ర ప్రగతిలో వారికి భాగస్వామ్యం కల్పించ డానికి కార్యచరణ ప్రణాళికను రూపొంది స్తుందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికను రూపొందించిందన్నారు.సుదీర్ఘ కాలంపాటు రాష్ట్ర సమగ్ర ప్రగతికి బాటల వేసే దిశగా ప్రభుత్వం రూపొందించిన నూతనజనాభా స్థిరికరణ విధానంలో భాగంగా మహిళా సాధికారత కోసం ఈ 10 సూత్రాల ప్రణా ళికను ప్రతిపాదించినట్లు శనివారం నాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రగతికి కీలకమైన నూతన జనాభా నిర్వహణలో మహిళల కీలక పాత్రను గుర్తించిన కూటమి ప్రభుత్వం పక్కా విధానాన్ని రూపొందించినట్లు మంత్రి వివరించారు. గర్భధారణ మరియు శిశు సంరక్షలను మహిళా హక్కుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారి జీవన అన్ని దశల్లోనూ అండగా ఉండి, అనుకూల వాతావరణాన్ని కల్పించి, లింగ వివక్షకు తెరదించివ సమాజా వికాసంలో మహిళా శక్తికి తమ పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహించేలా చూసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. మహిళల జీవనంలోని అన్ని దశల్లోనూ నాణ్యమైన సేవల్ని అందుబాటులో ఉంచి వారికి సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించడం, సంతాన ప్రాప్తి హక్కును సరైన విధానంలో సాకారం చేయడం, ఆర్థిక స్వావలంబనకు వారికి ఎదురవు తున్న ఆటంకాలను తొలగించడం, శిశు సంరక్షణలో పురుషుల్ని భాగస్వాములు చేయడం ఈ పది సూత్రాల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

ప్రస్తుతం శిశు పాలనా కేంద్రాల బాధ్యత ప్రధానంగా మహిళలపైనే ఉంటోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత సామాజిక విలువల్లో తగు చైతన్య కార్యక్రమాల ద్వారా మార్పు తెచ్చి శిశు పాలనలో సమాజ బాధ్యతఖీ అన్న నినాదం ద్వారా పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ మార్పు తేవాల్సి ఉంటుందని మంత్రి అన్నారు. ఈ దిశగా ప్రస్తుతం అమలులో ఉన్న 180 రోజుల ప్రసూతి సెలవులను(మెటర్నటీ లీవ్) 12 నెలల పేరెంట్ హుడ్ లీవ్ గా తల్లిదండ్రులిద్దరూ సమానంగా వాడుకునే వీలు కల్పిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**సంతాన ప్రాప్తి హక్కు గుర్తింపు:** సంతాన ప్రాప్తి హక్కు ప్రతి జంట >>2

# దర్శనమో తిరుమలేశా!



### క్యూలైన్లలో భక్తులకు తరగని కష్టాలు, అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే

### కమాండ్ కంట్రోల్ నుంచి అంతా మాటలగారడీయే, ఏఐతో నిర్వహణ ఆదేవునికే ఎరుక

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రోజుకు సరాసరి 70వేలమంది నుండి 80వేలమంది వరకు భక్తులకు మహాలఘు విధానంలో తిరు మల ఆలయంలో టిటిడి అధికారులు శ్రీవారి దర్శనం చేయి స్తున్నా, గంటలగంటలు క్యూలైన్లలో, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో నిరీక్షణ కష్టాలు తప్పడం లేదనేది అధికశాతం మంది భక్తుల ఆవేదన. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఎఐ అమలుచేస్తూ భక్తులకు త్వరగా దర్శనం చేయిస్తున్నామని టిటిడి అధికారులు మాయతో అబ్రకదబ్రగా చెప్పేస్తున్నారు. అయితే వాస్తవంగా దర్శ నాలు అమలులో మాత్రం భక్తుల కష్టాలు విని పించుకునే, పట్టిం చుకునే అధికారి లేదంటే అతిశయోక్తిలేదు. సాధారణ రోజు ల్లోనే 300రూపాయలు ఎస్ఇడి దర్శన టిక్కెట్ కలిగిన >>2

## హైస్పీడ్ బోట్లతో గస్తీ: ముఖ్యమంత్రి

**విజయవాడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్య కారుల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో మత్స్యకారుల సమస్య పరిష్కారానికి హైస్పీడ్ పెట్రోలింగ్ బోట్లతో చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తమిళ నాడు నుంచి బోట్ల అక్రమ చొరబాట్ల వల్ల నష్టం కలగొద్దని సీఎం పేర్కొ న్నారు. బాపట్ల నుంచి సుళ్లూరుపేట వరకూ ఏపీ సముద్రజలాల్లో గస్తీ పెంచాల న్నారు. 4 హైస్పీడ్ పెట్రోలింగ్ బోట్లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

5-4Pg8.qxd:5-4Pg8.qxd 1/1/02 6:33 AM Page 1



ఆట

# ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా బంగ్లాదేశ్



భారత్ జట్టు ఓటమి

**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 20 ఛాంపియన్‌షిప్-2026 ఫైనల్లో భారత్‌ను ఓడించి బాంగ్లాదేశ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో పెనాల్టీ షూటౌట్‌లో 4-3 తేడాతో భారత ఓటమిపాలయింది. మాల్దీవుల్లో జరిగిన ఫైనల్స్ పోటీ షూటౌట్‌లో ఇరు జట్ల మధ్య హోరాహోరీగా పోరు సాగినా, బంగ్లాదేశ్ ట్రోఫీని కైవసం చేసుకుంది. భారత్ తరఫున మహ్మద్ అర్బాష్, సామ్సన్ అహోంగ్‌షాంగ్‌బామ్, విశాల్ యాదవ్ పెనాల్టీలను గోల్స్‌గా మలచగా, రిషి సింగ్ నింగ్‌థౌఖోంగ్‌జామ్ కొట్టిన పెనాల్టీని గోల్ కీపర్ అడ్డుకోగా, ఒమాంగ్ డోడుమ్ కొట్టిన పెనాల్టీ క్రాస్‌బార్ పైనుంచి వెళ్లిపోయింది. మహమ్మద్ ముర్సెద్ అలీ, చందన్ రాయ్ మరియు మహమ్మద్ యూసుఫ్ అలీ ద్వారా బంగ్లాదేశ్ గోల్స్ సాధించగా, శామ్యూల్ రాక్సామ్ కొట్టిన షాట్‌తో భారత్‌కు ఒక ఆశాకిరణం కనిపించింది. అయితే, స్ట్రైకర్ రోనన్ సుల్లివన్ నిర్ణయాత్మక కిక్‌ను గోల్‌గా మలిచి బంగ్లాకు టైటిల్‌ను అందించాడు. భారత్, బంగ్లా జట్లుకు తొలి అర్ధభాగంలో అవకాశాలు పరిమితంగా లభించాయి. బంగ్లాదేశ్‌కు కేవలం ఒక్క గోల్ మాత్రమే ఇచ్చి ఆకట్టుకున్న భారత్ జట్టు అరకొర అవకాశాలకే పరిమితం చేసింది. అయితే భారత్ పట్టు సాధించడానికి ఇబ్బంది పడింది. ఆరంభంలో ప్రభావం చూపిన ఒమాంగ్ డోడుమ్, విశాల్ యాదవ్ వంటి ఆటగాళ్లకు బంతి పరిమితంగానే అందింది. తొలి అర్ధభాగంలో భారత్‌కు లభించిన ఏకైక అవకాశం 32వ నిమిషంలో వచ్చింది. ఎడమవైపు నుంచి వచ్చిన క్రాస్‌ను బంగ్లాదేశ్ గోల్ కీపర్ మహ్మద్ ఇస్మాయిల్ హుస్సేన్ మహీన్ అందుకోవడంలో విఫలమయ్యాడు. బంతిని మైఫరెంబా చింగాఖం నేరుగా డిఫెండర్ వైపు షాట్ కొట్టడంతో, బంగ్లా ఆ ప్రమాదాన్ని తప్పించుకుంది. రెండవ అర్ధ భాగంలో కూడా ఇరు జట్లు కూడా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వడానికి ఇష్టపడలేదు. దీంతో మ్యాచ్ చాలా వరకు మిడ్‌ఫీల్డ్‌లోనే కొనసాగింది.

# బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో వరల్డ్ నం.1పై విశ్వనాథ్ విజయం



**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో భారత్‌కు చెందిన బాక్సర్ విశ్వనాథ్ సురేష్ ప్రపంచ ఛాంపియన్ సంజరును మట్టి కరిపించాడు. శనివారం జరిగిన బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో విశ్వనాథ్ కజకిస్తాన్‌కు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, ప్రపంచ నంబర్ 1 సంజార్ తాష్కెన్‌బేను ఓడించాడు. 21 ఏళ్ల ఈ యువకుడు, తన ఆధిపత్య యువ కెరీర్ నుండి ఉన్నత సీనియర్ స్థాయికి సునాయాసంగా మారి, భారతదేశపు అత్యంత ఉత్తేజకరమైన బాక్సింగ్ యువ ప్రతిభావంతులలో ఒకరిగా వేగంగా తనను తాను నిలబెట్టుకున్నాడు. అలాగే అంకుషిత బోరో (మహిళల 65 కేజీలు), సచిన్ సివాచ్ (పురుషుల 60 కేజీలు), నరేందర్ బెర్వాల్ (పురుషుల 90+ కేజీలు) కూడా సెమీఫైనల్స్‌కు చేరుకోవడంతో భారత్ మరో మూడు పతకాలను ఖరారు చేసుకుంది. అంకుషిత కజఖ్ బాక్సర్ లారా యెస్సెన్‌కెల్డిని స్ప్లిట్ డెసిషన్ 4-1 తో ఓడించగా, సచిన్, నరేందర్ వరుసగా చైనీస్ తైపీ, యూఏఈ బాక్సర్లపై విజయం సాధించారు. మరోవైపు, ఆదిత్య ప్రతాప్ యాదవ్ (పురుషుల 65 కేజీల విభాగం) తన క్వార్టర్ ఫైనల్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అబ్దుల్లో మదామినోవ్ చేతిలో 0-5 తేడాతో ఓడిపోవడంతో పతకాన్ని కోల్పోయాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్ జోరు

## ఐపిఎల్‌లో 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ జోరు కొనసాగిస్తోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ముంబై ఇండియన్స్‌తో శనివారం న్యూఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఢిల్లీ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరోసారి ఇంపాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ అసాధారణమైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(36 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా, రోహిత్ శర్మ(26 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 35) విలువైన పరుగులు చేశాడు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ 2 వికెట్లు తీయగా, లుంగి ఎంగిడి, అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్, నటరాజన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 164 పరుగులు చేసి గెలుపొందింది. 163 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీకి ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్(1) మరోసారి నిరాశపర్చగా, నితీష్ రాణా(0) రనౌటయ్యాడు. 7 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును పాతుమ్ నిస్సంకతో కలిసి సమీర్ రిజ్వీ ఆదుకున్నాడు. సమీర్ రిజ్వీ(51 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 90) భారీ హాఫ్ సెంచరీతో చెలరేగగా, పాతుమ్ నిస్సంక(30 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 44) విలువైన పరుగులు చేశాడు. స్లోగా ఉన్న వికెట్‌పై ఆచితూచి ఆడిన ఈ జోడీ ఆ తర్వాత ఎదురుదాడికి దిగింది. ముఖ్యంగా సమీర్ రిజ్వీ భారీ సిక్సర్లతో ముంబై బ్యాటర్లపై విరుచుకుపడ్డాడు. పాతుమ్ నిస్సంక ఔటైనా, డేవిడ్ మిల్లర్ సాయంతో సెంచరీ దిశగా సాగాడు. తనదైన విధ్వంసంతో మ్యాచ్‌ను ముంబై నుంచి లాగేసుకున్నాడు. విజయం ముంగిట బోష్ బౌలింగ్‌లో రిజ్వీ ఔటైనా, స్టబ్స్‌తో కలిసి మిల్లర్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో దీపక్ చాహర్, మిచెల్ సాంట్నర్, కార్బిన్ బోష్ తలో వికెట్ తీసారు.







# హార్స్ షో చాంపియన్‌లో.. స్టాస్యాకు రెండు పతకాలు

**న్యూఢిల్లీ:** అగ్రశ్రేణి అశ్వ క్రీడా పోటీలలో ఒకటిగా పరిగణించబడుతున్న ఢిల్లీ హార్స్ షో-2026లో భారత్ వర్ధమాన అశ్వదళ ప్రతిభావంతురాలు స్టాస్యా పాండ్యా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ప్రతిష్టాత్మక యంగ్ ఛాంపియన్ విభాగంలో రెండు టీమ్ పతకాలను కైవసం చేసుకుంది. వివిధ విభాగాలలో 200 మందికి పైగా అశ్వశిక్షకులతో పోటీపడిన స్టాస్యా, అన్ని విభాగాలలోనూ అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. డ్రెస్సేజ్‌లో ఆమె కాన్సుల్ అనే గుర్రంపై స్వారీ చేసి టీమ్ సిల్వర్ పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం స్ఫూర్తితో, ఆమె కౌగర్ డి ఫీస్ అనే గుర్రంపై షో జంపింగ్‌లో టీమ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. 1.10 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేసిన 12 జంప్‌లతో కూడిన సవాలుతో కూడిన కోర్సును అధిగమిస్తూ, స్టాస్యా కచ్చితత్వం, నియంత్రణ, పోటీ పటిమను ప్రదర్శించింది. స్టాస్యా రెండుసార్లు పోడియంపై నిలవడం ఆమె అశ్వక్రీడా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోంది.

# ఐపిఎల్‌లో ఆల్‌టైమ్ రికార్డ్



## ఎవరికీ అందని హీరోస్

**న్యూఢిల్లీ:** పరుగుల వరద, సిక్సర్ల మోత, బౌండరీల వర్షం ఇలా ఎన్నింటికి వేదిక అయిన ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన క్రికెట్ లీగ్ ప్రస్తుత సీజన్ ఉత్కంఠతగా సాగుతోంది. ప్రతి ఏడాది కొత్త రికార్డులకు వేదికగా నిలుస్తున్న ఐపీఎల్‌లో ఈ సీజన్‌లో ఎటువంటి నమోదవుతాయనేది ఆసక్తికరమైంది. అయితే ఐపీఎల్‌లో కొన్ని రికార్డులు మాత్రం ఏళ్ల తరబడి చెక్కుచెదరకుండా నిలిచి ఇప్పటికీ ఎవరికీ అందని ఆల్టైమ్ రికార్డులు నమోదు చేశాయి. స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో నెలకొల్పిన రికార్డు 10 సంవత్సరాలుగా చెక్కుచెదరకుండా ఉంది. దీన్ని అందుకోవడం కూడా అసాధ్యంగా అనిపిస్తోంది. 2016లో సీజన్లో 973 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కోహ్లీ పేరిట ఉంది. ఆ సమయంలో 4 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు సాధించాడు. అలాగే ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక భాగస్వామ్య రికార్డును విరాట్ కోహ్లీ, ఏబీ డి విలియర్స్ నెలకొల్పారు. 2016 సీజన్లో గుజరాత్ లయన్స్‌పై వీరు 229 పరుగులు జోడించారు. ఆ మ్యాచ్లో కోహ్లీ, డి విలియర్స్ ఇద్దరూ సూపర్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. కోహ్లీ 55 బంతుల్లో 109 పరుగులు చేస్తే. విలియర్స్ 52 బంతుల్లో 129 పరుగులు చేసి సత్తా చాటాడు. 2013లో క్రిస్ గేల్ ఆర్సీబీ తరఫున పూణే వారియర్స్‌పై కేవలం 30 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన శతకంగా నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకం రికార్డు నెలకొల్పాడు. 2023న ఈడెన్ గార్డెన్స్‌లో కోల్కతా నైట్ రైడర్స్ జట్టుపై 13 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. ఐపీఎల్‌లో ఒక ఓవర్లో అత్యధిక పరుగుల రికార్డు క్రిస్ గేల్, రవీంద్ర జడేజాల పేరిట ఉంది. 2011 సీజన్‌లో ఆర్సీబీకి చెందిన క్రిస్ గేల్, కొచ్చి టస్కర్స్ బౌలర్ పరాస్నాథ్ పరమేశ్వరన్ వేసిన ఒక ఓవర్లో 37 పరుగులు (6 నోబాల్, 6, 4, 4, 6, 6, 4) చేశాడు. గేల్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టాడు.. ఇక, 2021 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన రవీంద్ర జడేజా ఆర్సీబీ బౌలర్ హర్షల్ పటేల్ వేసిన ఒక ఓవర్లో 37 పరుగులు (6, 6 నోబాల్, 6, 6, 2, 6, 4) చేశాడు. వెస్టిండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ తన ఐపీఎల్ అరంగేట్రంలోనే విధ్వంసం సృష్టించాడు. అతను ఏప్రిల్ 6, 2019న ముంబై ఇండియన్స్ తరఫున అరంగేట్రం చేశాడు. తన తొలి మ్యాచ్లోనే, సన్‌రైజర్స్ హైదరాబాద్పై 3.4 ఓవర్లలో 12 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. ఈ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.

# తమిళ పగ్గాలు మళ్లీ స్టాలిన్‌కే!

## రెండోస్థానంలో అన్నా డిఎంకె కూటమి టివికె విజయ్‌కి మూడోస్థానం

**చెన్నై, ఏప్రిల్ 4:** తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకే కూటమి మరోసారి ఘన విజయం సాధించనుందని రెండు వేర్వేరు సంస్థలు నిర్వహించిన ప్రీపోల్ సర్వేలు స్పష్టం చేశాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విపక్షాల ఓట్ల చీలిక డీఎంకేకు భారీగా లాభం చేకూర్చనున్నాయని ఈ సర్వేలు అంచనా వేశాయి. లోక్ పోల్ సంస్థ మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 మధ్య 1.17లక్షల మందితో నిర్వహించిన సర్వే ప్రకారం మొత్తం 234 స్థానాలకుగాను డీఎంకే కూటమి 181 నుంచి 189 సీట్లు గెలుచుకుంటుందని వెల్లడైంది. డీఎంకే కూటమికి 40.1 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 29 శాతం ఓట్లతో 38 నుంచి 42 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగమ్ (టీవీకే) 23.9



శాతం ఓట్లతో 8 నుంచి 10 స్థానాలు దక్కించుకోవచ్చని తెలిపింది. మరోవైపు పోల్ ట్రాకర్ నిర్వహించిన సర్వే కూడా డీఎంకే కూటమికే పట్టం కట్టింది. ఈ సర్వే ప్రకారం డీఎంకే కూటమి 42.7 శాతం ఓట్లతో 172 నుంచి 178 స్థానాల్లో గెలుపొందనుంది. అన్నాడీఎంకే 46 నుంచి 52 సీట్లతో సరిపెట్టుకుంటుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ టీవీకే 19.2 శాతం ఓట్లతో 6 నుంచి 12 సీట్లు గెలుచుకోవచ్చని తెలిపింది. నాయకత్వం విషయంలోనూ ఎడప్పాడి పళనిస్వామి, విజయ్‌లతో పోలిస్తే అనుభవజ్ఞుడైన నేతగా స్టాలిన్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని ఈ సర్వే పేర్కొంది. మొత్తంగా రెండు సర్వేలు కూడా తమిళనాడులో డీఎంకే హవా కొనసాగుతుందని స్పష్టం చేశాయి.

## డిఎంకెలో చిచ్చురేపిన వారసత్వం

తమిళనాడు అధికార పార్టీ డీఎంకేలో వారసత్వ పోరు బహిర్గతమైంది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన తనయుడు ఉదయనిధిని రాజకీయ వారసుడిగా నిలబెట్టాలని చూస్తుండగా, ఆయన సోదరి, ఎంపీ కనిమొళి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఇది పార్టీలో కొత్త చర్చకు దారితీసింది. తిరునెల్వేలి జిల్లా పాళయంగోట్టయ్‌లో జరిగిన ప్రచార సభలో ఈ పరిణామం స్పష్టంగా కనిపించింది. డీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రసంగించేందుకు కనిమొళి వేదిక వద్దకు రాగానే, ఆమె మద్దతుదారులు కాబోయే సీఎం కనిమొళి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ఊహించని స్పందనకు ఆమె ఆశ్చర్యపోయినా, మౌనంగానే ఉండిపోయారు. మరోవైపు క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న సోదరి, ఈ ఇద్దరి మధ్య సమతుల్యత పాటించడం ఇప్పుడు స్టాలిన్‌కు రాజకీయంగా పెద్ద సవాల్‌గా మారింది. ఈ వారసత్వ పోరు భవిష్యత్తులో ఎలాంటి మలుపులు తీసుకుంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# మేం ఇజ్రాయెల్ పాలకుల్లా క్రూరులం కాదు

## మిస్సింగ్ పైలట్ తల్లి ఆవేదనపై ఇరాన్ స్పందన

**టెహ్రాన్, ఏప్రిల్ 4:** అమెరికాఇరాన్ యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. మరోవైపు, ఇరాన్ అమెరికాకు చెందిన అత్యాధునిక ఎఫ్15 యుద్ధ విమానాన్ని కూల్చడం సంచలనంగా మారింది. ఎఫ్ 15 కూలిపోతున్న సమయంలో ఇద్దరు పైలట్లు విమానం నుంచి బయటపడ్డారు. వీరిలో ఒకరిని అమెరికన్ బలగాలు రెస్క్యూ చేశాయి. గల్లంతైన పైలట్ తల్లి సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టింది. తప్పిపోయిన పైలట్ తమ



కుమారుడే అని, అతడి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని, తన కుమారుడి కోసం అలాగే ఇతర పైలట్లందరి కోసం ప్రార్థించమని ఆమె అందరినీ కోరారు. ఆమె పోస్ట్‌పై పాకిస్తాన్, దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయాలు స్పందించాయి. ఇరాన్ చెరలో సురక్షితంగా ఉండటం కన్నా డొనాల్డ్ ట్రంప్‌తోనే మీ కుమారుడికి ఎక్కువ ప్రమాదం. అమెరికన్ రెస్క్యూ బృందాల అతడిని కనుగొనే వరకు అతను ఇరాన్ చెరలోనే ఉండేలా ప్రార్థించండి అంటూ పాకిస్తాన్‌లోని ఇరాన్ ఎంబసీ ట్వీట్ చేసింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ తర్వాతి లక్ష్యం'బాబ్ అల్ మాండెబ్'



**టెహ్రాన్, ఏప్రిల్ 4:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు ఎప్పుడో తెలియని అని శ్చితి ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే హార్మూజ్ దిగ్బంధంతో చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం నెలకొంది. ఇలాంటి నేపథ్యంలో యుద్ధాన్ని విస్త రించేలా ఇరాన్ నుంచి హెచ్చరికలు వచ్చాయి. తమ తర్వాతి లక్ష్యం 'బాబ్ అల్ మాం డెబ్' జలసంధి అని అర్థం వచ్చేలా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'అంతర్జాతీయంగా చమురు, ఎల్ఎన్‌జి, గోధుమలు, బియ్యం, ఎరువుల రవాణాలో ఎంత వాటా బాబ్ అల్ మాండెబ్ మీదుగా వెళ్తోంది. ఏయే దేశాలు, కంపెనీలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయి?' అని అర్థం వచ్చేలా ఇరాన్ స్పీకర్ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. ఈ జలమార్గం కూడా మూసుకుపోతే ప్రపంచం మరింతగా కష్టాల్లో కూరుకుపోనుంది. మాండెబ్ జలసంధి.. యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు దాదాపు 30 కి.మీ. మాత్రమే.

## హార్మూజ్ జలసంధిని దాటిన గ్యాస్ నౌక గ్రీన్ శాన్వి

**అహ్మదాబాద్, ఏప్రిల్ 4:** భారతదేశ జెండా కలిగిన గ్యాస్ కంటైనర్ గ్రీన్ శాన్వి, సుమారు 46,650 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఇంతకుముందు, గతనెల 28న 47వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియం గ్యాస్‌తో కూడిన నౌక గుజరాత్, జామ్‌నగర్‌లోని కాండ్లాలో గల వాడినార్ టెర్మినల్‌కు చేరుకుంది. ఇప్పుడు ఎల్పీజీతో కూడిన గ్రీన్ శాన్వి మరికొద్ది రోజుల్లో భారత్‌కు చేరుకోనుంది. ఈ మేరకు గుజరాత్ మంత్రి హర్ష్ సింఘ్వీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఎల్పీజీ నౌక గ్రీన్ శాన్వి విజయవంతంగా హార్మూజ్ జలసంధిని దాటింది. భారత దౌత్యానికి ఇది మరో విజయమని పేర్కొన్నారు. మంత్రి ట్వీట్‌పై ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందించింది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. శతాబ్దాల క్రితం మా ప్రాంతం నుంచి వచ్చిన వారికి భారత్, ముఖ్యంగా గుజరాత్ సాదరంగా



స్వాగతం పలికాయని, కాబట్టి మా చరిత్రలో వీటికి విశిష్ఠ స్థానం ఉందని పేర్కొంది. ఈ సుదీర్ఘ నాగరికత అనుబంధాన్ని పునాదిగా చేసుకుని, స్నేహం, సహకార సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. భారత్ జెండాతో కూడిన ఎనిమిది నౌకలు ఇప్పటి వరకు హార్మూజ్ జలసంధిని దాటాయి. మరో 15 నౌకలు అక్కడే ఉండిపోయాయి. ఆ నౌకలను సురక్షితంగా భారత్ తీసుకురావడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బుషెహార్ అణువిద్యుత్‌కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

**టెహ్రాన్, ఏప్రిల్ 4:** ఇరాన్‌లోని బుషెహార్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో క్షిపణి దాడి జరిగింది. ఈ దాడిలో ఒక వ్యక్తి మరణించినట్లు తెలుస్తోంది. బుషెహార్ అణు విద్యుత్ కేంద్రం లక్ష్యంగా ఈ క్షిపణి దాడి జరిగిందని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. క్షిపణి శకలం తగిలి సిబ్బందిలో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. ఆ ప్రాంతంలోని భవనం కూడా దెబ్బతిన్నదని తెలిపింది. అయితే ఈ క్షిపణి దాడి అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి రేడియేషన్‌కు దారి తీయలేదని తెలిపింది. ఇరాన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంట్ ఇదే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ కేంద్రంపై దాడి జరగడం ఇది నాలుగోసారి. ఈ దాడి ఘటనపై ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మరియానో గ్రాస్సీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా భవనాల్లో కీలకమైన పరికరాలు ఉండే అవకాశం ఉందని



అన్నారు. అణు కేంద్రాల సమీప ప్రాంతాలపై ఎన్నడూ దాడి చేయకూడదని అన్నారు. అణు ప్రమాదం ముప్పును నివారించేందుకు సంయమనం పాటించాలని కోరారు.

# సైన్యంలోకి మీ ఉద్యోగులను నామినేట్ చేయండి



**మాస్కో, ఏప్రిల్ 4:** ఉక్రెయిన్‌తో నాలుగేళ్లుగా యుద్ధం కారణంగా దాదాపు 3.25లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మళ్లీ తన సైన్యాన్ని బలోపేతం చేసేందుకు అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో భారీగా సైన్యాన్ని సమీకరిస్తున్నారు. ఇందుకోసం రహస్య నియామకాలు జరుగుతున్నాయని సైనిక శిక్షణ తీసుకున్నవారే కాకుండా వివిధ వర్గాల పౌరులు కూడా రష్యన్ ఆర్మీలో చేరాలని అధికారులు ప్రజలను కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సైనిక సేవల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలలోని ఉద్యోగులను నామినేట్ చేయాల్సిందిగా పలు పెద్ద కంపెనీలు, వ్యాపార సంస్థలకు ర్యాజాన్ నగర గవర్నర్ రహస్య నోటీసులు పంపినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ వెల్లడించింది.

కంపెనీల్లో పని చేసే ఉద్యోగులను సైనిక అభ్యర్థులుగా షార్ట్‌లిస్ట్ చేసి, ఆ జాబితాను సెప్టెంబరు 20లోగా తమకు పంపాల్సిందిగా ఆయన కోరినట్లు తెలిపింది. నోటీసు ప్రకారం.. సైన్యంలోని ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్య కంపెనీ పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. 150-300 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం రెండు పేర్లను, 300-500 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు మూడు పేర్లను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. 500 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు ఐదుగురిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలు పాటించని కంపెనీలకు పెద్ద మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సైనిక సమీకరణ ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేసి, ఎంపిక చేసిన వారిని పోరాటానికి సిద్ధం చేయడానికి రష్యా మిలిటరీ, నేవీ కమాండర్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శిక్షణ పూర్తయిన వెంటనే వారిని యుద్ధంలో భాగం చేసే అవకాశం ఉంది.

# నేను బెంగాలీనే: లియాండర్ పేస్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:** టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ ఇటీవల బిజెపిలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బెంగాలీ వ్యక్తిని కాదంటూ వస్తోన్న విమర్శలపై స్పందించారు. బహిరంగ కార్యక్రమాలకు వెళ్లినప్పుడు తాను బెంగాలీనేనా అని ప్రజలు అడిగితే బాధ కలుగుతుందన్నారు. తన పేరు గంగూలీ కాకపోవచ్చు కానీ తాను మాత్రం బెంగాలీనేనని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ కుటుంబానికి పోర్చుగీస్ మూలాలు ఉన్నప్పటికీ తాము మాత్రం భారతీయులమేనని పేర్కొన్నారు. తాను కోల్‌కతాలో పుట్టానని తన టెన్నిస్ ప్రయాణం సౌత్ క్లబ్‌లో ప్రారంభమైందని లియాండర్ పేస్ తెలిపారు. లా మార్టినియర్ స్కూల్‌లో చదువుకొన్నానని కోల్‌కతాలోని మైదానాల్లోనే ఆడుకొన్నానని అన్నారు. ప్రస్తుత బెంగాల్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించట్లేదని విమర్శించారు. గతేడాది అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ పర్యటన వేళ కోల్‌కతా సాల్ట్ లేక్ స్టేడియంలో చోటుచేసుకున్న గందరగోళం, నిర్వహణ లోపాలను లియాండర్ పేస్ ఎత్తిచూపారు. కోల్‌కతాలో పుట్టిన పేస్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్ వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచారు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. రాకెట్ వదిలి 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికలకు ముందు ఇటీవల బిజెపిలో చేరారు. బెంగాల్‌కు రెండు దఫాలుగా ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# మేం యుద్ధంలో ఉన్నాం..చర్చలపై ఎఫెక్ట్ ఉండదు: ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 4:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా యుద్ధ విమానం కూలిపోవడం, ఇరాన్‌తో జరగబోయే చర్చలపై ఎలాంటి ప్రభావం చూపబోదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఘటనలపై తొలిసారిగా స్పందించిన ఆయన, దౌత్యపరమైన ప్రయత్నాలకు ఈ పరిణామాలతో ఎలాంటి ఆటంకం కలగదని పేర్కొన్నారు. విమానం కూలిపోవడం చర్చలను ప్రభావితం చేస్తుందాన్న ప్రశ్నకు, "లేదు, అస్సలు చేయదు. మేం యుద్ధంలో ఉన్నాం" అని ఆయన బదులిచ్చారు. మధ్యప్రాచ్యంలో శుక్రవారం ఒకేరోజు రెండు అమెరికా సైనిక విమానాలు ప్రమాదాలకు గురవడం తీవ్ర కలకలం సృష్టించింది. తొలుత, ఇరాన్ గగనతలంలో అమెరికాకు చెందిన ఎఫ్ 15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ విమానంలో ఇద్దరు సిబ్బంది ఉండగా, ఒక పైలట్‌ను సహాయక బృందాలు సురక్షితంగా రక్షించాయి. రెండో పైలట్ ఆచూకీపై గందరగోళం నెలకొంది. అతను ఇరాన్ అదుపులో ఉన్నట్లు కొన్ని కథనాలు పేర్కొంటుండగా, అతని కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతు న్నాయని మరికొన్ని వర్గాలు తెలిపాయి.

5-4Pg5exHMNWJQE.qxd:5-4Pg5exHMNWJQE.qxd 1/1/02 6:22 AM Page 1



# సత్తెనపల్లిలో రోడ్డు ప్రమాదం

## వృద్ధ దంపతులు మృతి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** మనవడి పెళ్లి చూపులకు వెళుతున్న ఓ వృద్ధ దంపతులను శనివారం ఓ లారీ మృత్యు రూపంలో కభలించి పెండ్లి చూపులు కాస్తా విషాదంతో నింపిన ఘటన పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల వద్ద శనివారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన మృతులు ఆలకుంట అంజయ్య, ఆలకుంట కోటేశ్వరమ్మ తన మనవడు విష్ణువర్ధన్ పెండ్లి చూపుల నిమిత్తం వేమవరం గ్రామం నుండి కుమారుడు పాల్ రాజు, కోడలు వెంకటరమదేవి, మనవడు విష్ణు వర్ధన్‌లు కలిసి రెండు మోటర్ బైకులపై సత్తెనపల్లి మండలం బృగుబండ్ల గ్రామానికి బయలుదేరారు. మధ్యాహ్నం పట్టణానికి చేరుకున్నారు . అక్కడ కుమారుడు కోడలు, మనవడు ప్రయాణిస్తున్న మోటర్ బైక్ చైన్ లూజ్ కావటంతో వారు బస్టాండ్ వద్ద బైక్ ను రిపేరు చేసేందుకు ఆపారు. ఈ నేపథ్యంలో ఇది గమనించని వృద్ధదంపతులు ద్విచక్ర వాహనంపై పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్దకు వచ్చారు. ఇంతలో వారి వెనుకనే ఉన్న టిప్పర్ లారీ ఒక్కసారిగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న అంజయ్య, కోటేశ్వరమ్మ కింద పడటంతో లారీ ఒక్కసారిగా వారిపై ఎక్కటంతో దంపతులు ఇద్దరూ అక్కడి కక్కడే మృతిచెందారు. కొద్ది క్షణాల్లో ఇద్దరి మృత దేహాలు రకపు ముద్దాలుగా మారాయి. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



## మానవత్వం చాటుకున్న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి..

### రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయక చర్యలు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:**మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు.. విజయవాడ సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ కాలేజ్ దగ్గర, ఫ్లై ఓవర్ వద్ద బైక్ పై వెళ్తున్న వృద్ధ దంపతులను లారీ ఢీకొంది. అదే సమయంలో ఆ దారిలో వెళ్తున్న క్రమంలో.. ఆ సంఘటన చూసి తక్షణమే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పందించారు. వెనువెంటనే తన కాన్వాయ్ ఆపి, ప్రమాద బాధితులను దగ్గరుండి అంబులెన్స్ లో హాస్పిటల్‌కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంపించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని మంత్రి ఆదేశించారు.

## ఆహార విశ్లేషణ పాఠ్యగ్రంథం ఆవిష్కరణ



**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఆచార్యంాలు ఆచార్య జి. రజిత రచించిన "ఆహార విశ్లేషణ పాఠ్యగ్రంథం శాస్త్రీయ గ్రంథం ఆవిష్కరణ జరిగింది. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ శనివారం ఆవిష్కరించారు. ఈ 250 పేజీల గ్రంథాన్ని ఫార్మామెడ్ ప్రెస్ హైదరాబాద్ ప్రచురించింది. 250 పేజీల ఈ గ్రంథం, ప్రధాన్ మంత్రి ఉన్నత విద్య అభియాన్ పథకం కింద, మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ కార్యక్రమంలో భాగంగా లభించిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో రూపొందించబడింది. ఈ గ్రంథం ఆహార శాస్త్రం, విశ్లేషణ రంగాలలో అభ్యసిస్తున్న విద్యార్థులు, పరిశోధకులు,అధ్యాపకులకు సమగ్ర మార్గదర్శకంగా రూపొందించబడింది. ఇందులో ఆహారంలోని ప్రధాన ఘటకాలు అయిన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, లిపిడ్లు ,విటమిన్ల వర్గీకరణ, భౌతికరసాయన లక్షణాలు, సాధారణ విశ్లేషణ పద్ధతులు, అలాగే వాటి జీర్ణక్రియ, శోషణ మరియు మెటాబాలిజం వంటి అంశాలు సవివరంగా వివరించబడ్డాయి. అనుమతించబడిన ,అనుమతించని రంగుల గుర్తింపు విధానాలు కూడా ఇందులో సమగ్రంగా చర్చించబడ్డాయి. పాలు మరియు పాల ఉత్పత్తులు (పాలు, వెన్న, మార్జరిన్, చీజ్, ఐస్ క్రీమ్) పై విశ్లేషణ పద్ధతులు, వాటిలో కల్తీ పదార్థాలు , కాలుష్యాల గుర్తింపు, అలాగే ఫర్మెంటేషన్ ఉత్పత్తులు అయిన వైన్, బీర్, స్పిరిట్స్ మరియు వెనిగర్‌ల విశ్లేషణ అంశాలు ఉన్నాయి.

# వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముడి చక్రస్నానం



కనుల పండువగా జరుగుతున్న చక్రస్నానం

**ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీరామ బ్రహ్మోత్సవాలు - నేడు పుష్పయాగం**

**రాజంపేట, ఏప్రిల్4 ప్రభాతవార్త** దక్షిణ అయోధ్య కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు.ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు.స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేడుకగా స్నపనతిరు మంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో టిటిడి డెప్యూటీ ఈవో ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీకోదండ రామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు టిటిడి అన్ని ఏర్పాట్లు చేసింది.

# శ్రీకాకుళంలో కలకలం.. బాదం పాలు తాగి 80 మందికి అస్వస్థత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. గ్రామీణ మండలం సింగుపురంలో బాదం పాలు వికటించి సుమారు 80 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలతో బాధపడుతుండటంతో వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సింగుపురంలో ఈ నెల 1, 2 తేదీల్లో కొండమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ జాతర సందర్భంగా ఓ వ్యక్తి వ్యాన్‌లో బాదం పాలు విక్రయించాడు. ఎండ తీవ్రంగా ఉండటంతో ఉత్సవాలకు వచ్చిన పలువురు ఈ పాలను కొనుగోలు చేసి తాగారు. అయితే, గురువారం అర్ధరాత్రి నుంచి పాలు తాగిన వారికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో బాధితులను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం బాధితులంతా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. జాతరలో నాణ్యత లేని పానీయం అమ్మడం వల్లే ఈ ఘటన జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు.



**సింగుపురం ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే గొండు శంకర్ :** మండలం సింగపురం గ్రామంలో కొండమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా బాదం మిల్క్ వంటి శీతల పానీయాలు సేవించిన కొందరు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సింగపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)ను సందర్శించారు. అస్వస్థతకు గురైన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గొండు శంకర్, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసు కున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ప్రస్తుతం సింగుపురం పరిసర ప్రాంతాల నుంచి అస్వస్థతకు గురైన వారికి పీహెచ్సీలో చికిత్స అందిస్తున్నారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి బాధితులకు అవసరమైన చికిత్స అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి నియంత్రణలో ఉందని భరోసా ఇచ్చారు. శీతల పానీయాలు సేవించిన వారిలో అస్వస్థతకు కారణాలపై కూడా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదో తరగతి విద్యార్థి కరెంట్ షాక్‌తో దుర్మరణం!

## పట్టించుకోని ప్రిన్సిపాల్, టీచర్లు



**సాలూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్లో నైన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కోదుకరకవలసలో నివాసం ఉంటున్న కొర్ర ఆదినారాయణ, సన్యాసమ్మ దంపతుల కుమారుడు కొర్ర దిలీప్ మామిడిపల్లి హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం స్కూల్ కి వెళ్లిన దిలీప్ క్లాస్ బ్రేక్ సమయంలో స్నేహితులతో పక్కన ఉన్న అరటి తోటలోకి వెళ్లే ప్రయత్నం చేసాడు. అలాగే స్కూల్ ప్రహారీగోడ మీదకు ఎక్కి దాటే సమయంలో అక్కడ ఉన్న కరెంట్ పోల్ వైర్ పట్టుకోవడంతో వెంటనే కరెంట్ షాక్‌కు గురైయ్యాడు. తన స్నేహితులు స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్స్‌కి ఈ విషయం తెలియపరచగా మామిడిపల్లి సీహెచ్సీకి దిలీప్‌ను తరలించి చేతులు దులుపుకున్నట్టుగా సమాచారం. అక్కడ వైద్య సిబ్బంది దిలీప్ మృతి చెందినట్టుగా ధ్రువీకరించడంతో సాలూరు ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తరలించారు. అనంతరం రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్ళగా స్కూల్ ప్రిన్సిపల్ అప్పటికే ఫిర్యాదు చేసినట్టు దిలీప్ కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే శవపంచనామా కోసం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆవేదనతో ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా సాలూరు ఏరియా ఆసుపత్రికి మామిడిపల్లి స్కూల్ ప్రిన్సిపల్, టీచర్స్ గాని రాకుండా ఏమాత్రం రెస్పాన్స్ లేకండా వ్యవహరిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# టిటిడి చైర్మన్‌ని తొలగించాలి - వైఎస్సార్సీ నిరసన

**వడమాలపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కళాంకితుడైన టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుని వెంటనే తొలగించాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకులు రోజా, కరుణాకర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో వారు నిరసన, ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ క్యారెక్టర్ లేని వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించడమే పెద్ద తప్పు అని అతని గురించి వీడియోలు బయటపడ్డ తరువాత కూడా ఇంకా కొనసాగించడం అనేది మహా పాపం, అపచారమని ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న ఈ అపచారానికి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బి.ఆర్.నాయుడుని ఆ పదవి నుంచి తొలగించమని డిమాండ్ చేస్తున్నా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ ధర్మాన్ని నమ్ముకున్న వాళ్లు వెంకటేశ్వర స్వామిని పూజించేవాళ్లు అందరూకూడా బాధపడుతున్నారన్నారు. వీడియోలు పబ్లిక్ అయిన తరువాతకూడా దించకపోవడం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చేస్తున్న తప్పు కాదా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు గౌరవిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మౌనంగా ఉన్నారంటే వీళ్ళ జుట్టు బి.ఆర్.నాయుడు చేతిలో ఉందా అని ప్రశ్నించారు. ఒక అమ్మాయిని 30 సంవత్సరాలుగా ఏ విధంగా టార్చర్‌పెట్టాడు ఏ విధంగా తన అధికార బలంతో అహంకారంతో ఎంత పని చేశాడో అన్ని చూసిన తరువాతకూడా ఎందుకు అతని చేత రాజీనామాచేయించలేదని చంద్రబాబును అడుగుతున్నామన్నారు. ఇప్పటికైనా చైర్మన్ తొలగించి చంద్రబాబు కొండమీద నించోని వెంకటేశ్వర స్వామి భక్తులకు సాష్టాంగ నమస్కారం చేసిక్షమాపణలు కోరాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అప్పలాయగుంటలో వైసిపి నాయకులు నిరసన, ప్రదర్శన

# నేటి నుంచి ఎస్పీడిసిఎల్ 'సూర్యఘర్ ఉత్సవ్'

## -14లోగా లక్ష్యాన్ని చేరుకోవాలి - సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాల్లో నేటి నుండి "సూర్యఘర్ ఉత్సవ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం రూఫ్ టాప్ సోలార్ అంశంపై సంస్థ అధికారులు, సోలార్ ఏజెన్సీల ప్రతినిధులతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు (బాబూ జగ్జీవన్ రామ్ జయంతి రోజు) నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు రూఫ్ టాప్ సోలార్ ను ప్రోత్సహించేందుకు వీలుగా సూర్యఘర్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీలోగా సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో 25 వేల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీలు పనిచేయాలని ఆదేశించారు. ఈ పనుల నిర్వహణకు సంబంధించిన పరికరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, ఆయా ఏజెన్సీలు సరిపడా సిబ్బందిని నియమించుకుని, పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. రూఫ్ టాప్ సోలార్ పనుల్లో సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీల నిర్లక్ష్యాన్ని సహించబోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయుబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, యం. ఉమాపతి, కె. ఆదిశేషయ్య, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, విజయన్, పిఆర్ఓ తోట మధుసూదన రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ఇన్స్టాలేషన్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 'మా గ్యాస్, మా హక్కు' నినాదంతో ఉద్యమిస్తాం

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** మా గ్యాస్, మా హక్కు" నినాదంతో ఉద్యమిస్తాం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వెల్లడించారు. దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని ఆయన పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిందని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జీవనోపాధి కోల్పోయిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శించారు. కృష్ణా- గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ, ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణాగోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్‌ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు."మా గ్యాస్‌మా హక్కు" నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు విరాళం



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం అనంతపురానికి చెందిన వి.ఎస్.రవి కుమార్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు 10.10 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిని అందజేశారు.

## నెదర్లాండ్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి 33.5 ఎకరాలు కేటాయింపు



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో టిటిడి మరో కీలక నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌లోనూ హిందూ భక్తులకు చేరువ చేయడానికి శ్రీవారి ఆలయ నిర్మాణానికి విశ్వ హిందూ పరిషత్ తో కలిసి పనిచేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ఆలయ నిర్మాణం కోసం నెదర్లాండ్స్ ప్రభుత్వం 33.5 ఎకరాల భూమిని వీహెచ్‌పీకి కేటాయించింది. ఈ స్థలంలో సుమారు 250 కోట్ల రూపాయలు వ్యయంతో స్వామివారి ఆలయాన్ని నిర్మించాలని వీహెచ్‌పీ నిర్ణయించింది. ఈ బృహత్కార్యానికి టిటిడి సహకారం కోరుతూ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ కుమార్ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలిశారు. ఈ విషయంపై చైర్మన్ బీఆర్ నాయుడు తన సామాజికి మాధ్యమంలో స్పందిస్తూ, "గోపురాలు, ప్రాకారాలతోపాటు శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించనున్న నేపథ్యంలో టిటిడి నుంచి స్థపతి సహకారం అందించాలని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ కుమార్ కోరారని తెలిపారు. ఆయన విజ్ఞప్తితో సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు వివరించారు. ఈ నిర్ణయంతో విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

## స్మార్ట్‌స్టిక్స్ శబ్దాలతో చిరుతల పరార్!



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** గోవిందనామస్మరణలతో నిత్యం భక్తులతో రద్దీగా ఉండే అలిపిరి కాలినడక మార్గంలో ఇటీవల చిరుతలు సంచారంతో భక్తులు భయపడు తున్నారు. భక్తుల రక్షణకు టిటిడి అధికారులు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల రక్షణకు స్మార్ట్‌స్టిక్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇవి శబ్ధం చేయడం, కాంతులతో విరజిమ్మడం చేస్తుంది. ఈ కాంతి,శబ్ధానికి చిరుతలు,ఏనుగులు దూరంగా పరుగులుతీస్తాయి. అత్యవసరానికి విద్యుత్ షాక్ వ్యవస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం కాలినడక దారిలో 20 స్టిక్స్ ఉండగా మరో 30వరకు రానున్నాయి. కాలినడక మార్గంలో ఏడోమైలు వద్ద చిరుతల సంచారం. శ్రీవారిమెట్టుమార్గంలో చిరుత ఉండటంతో భక్తుల రక్షణ అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. గాలిగోపురంనుండి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిసరాల్లో మరింత భద్రత కల్పిస్తున్నారు.

## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు.ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆర్సీబి కెప్టెన్ రజత్ పటిదర్.ప్లేయర్ జితేష్ శర్మ వైకాపా ఎమ్మెల్సీ కళ్యాణి ,ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గోవిందునికి దేశవ్యాప్తంగా వేలకోట్ల విలువైన ఆస్తులు

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు విరాళాల రూపంలో దానమిచ్చిన ఆస్తులతోబాటు టిటిడి పరిధిలో ఉన్న దేవుని ఆస్తుల రక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ చర్యలు తీసుకునే దిశగా అడుగులేస్తోంది.ఇప్పటికే ఆ స్వామికి దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తుల వివరాలను క్రోడీకరించి డిజిటలైజేషన్ చేసింది. ఈ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి టిటిడి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి ,ఎంత మేరకు విలువ చేస్తాయి అనే వివరాలు ఆరా తీస్తున్నారు.దేవుని ఆస్తులు అన్యాక్రాంతంగాకుండా చేపట్టాల్సిన చర్యలపై ముందుకెళ్ళే విధానం ఆలోచన చేస్తున్నారు. దేశంలోనేగాక తిరుమలకొండ క్రింద తిరుపతి నగరం పరిసరాల్లోనూ టిటిడి ఆస్తులు ఉన్నాయి. ఈ ఆస్తుల్లో కరకంబాడి మార్గంలోని ఉపాధ్యాయనగర్, గ్రాండ్‌వరల్డ్ పరిసరాల్లో, రేణిగుంట మార్గంలో కొరమేనుగుంట, ఆటోనగర్ పరిసరాల్లో 322 ఎకరాల వరకు స్థలాలు, టిటిడి పేరు చెబితేనే గుర్తుకు వచ్చే తిరుపతిలోని కేశవాయనగుంట, బైరాగిపట్టెడ,రైల్వేకాలనీ, అలిపిరి మార్గం , ఎంఆర్‌పల్లి, ఉల్లిపట్టెడ వంటి చోట్ల ఇలా ఉన్న స్థలాలు టిటిడివన్నట్లు సర్వే నంబర్లతో సహా టిటిడి ఎస్టేట్ విభాగం జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల అధికారులకు గతంలోనే నివేదికలు ఇచ్చారు. ఈ స్థలాలు అధికశాతం టిటిడివి కావడంతో వాటిని నిషేధిత జాబితాలో పొందుపర్చాలని రిజిస్ట్రేషన్ శాఖకు జాబితా అందించారు. అప్పటికే ఆయా ప్రాంతాల్లో చాలావరకు పలువురు ఇళ్ళు, అపార్టుమెంట్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. ఈ స్థలాలపై గతంలోనే రిజిస్ట్రేషన్లు చేసే దిశగా పూర్వపాలకమండలి నిర్ణయం తీసుకుని ఆమోదించింది. దేశవ్యాప్తంగా 85వేలకోట్ల రూపాయలు విలువ చేసే 960 ఆస్తులు ఉన్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం గుర్తించి, ఈ ఆస్తులకు సంబంధించి పూర్తిగా పరిరక్షించే విషయంలో జియోఫెన్సింగ్ కూడా చేస్తున్నారు. 1974వ సంవత్సరం నుంచి 2014 సంవత్సరం మధ్య కాలంలో పలు రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో టిటిడి దేశవ్యాప్తంగా 113 ఆస్తులను వదులుకున్నట్లు అప్పట్లోనే గుర్తించారు. పలురకాలుగా దాతలు, భక్తులు తమ మొక్కుల్లో భాగంగా కానుకలుగా ఇచ్చిన ఆస్తులు రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి. వెంకన్న ఆస్తులకు సంబంధించి దేశవ్యాప్తంగా 7,123 ఎకరాల్లో ఆస్తులు విస్తరించివున్నాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకలుగా శ్రీవారికి ఆస్తులను రాసిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక,కేరళ,మహారాష్ట్ర,ఒరిస్సా ప్రాంతాల్లో ఆస్తులు కలిగివున్నాడు.

# అమరావతిలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందా ?: వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:**అమరావతిలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందా ? అని అనుమానించే దిశలో టీడీపీ, ఆ పార్టీ అనుకూల శక్తుల మాటలు ఉంటున్నాయని వైకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.అమరావతి రాజధాని విషయంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇన్నిరోజులు అమరావతికి చట్టబద్ధత లేదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న వికేంద్రీకరణ అంశాన్ని మూడు ముక్కలాట అంటూ వెటకారం చేశారని మండిపడ్డారు. గతంలోనే రాజధానికి చట్టబద్ధత ఉందని, ఇప్పుడు కొత్తగా చెబుతున్నవన్నీ అబద్ధాలని ఆయన మండిపడ్డారు. రాజధాని నిర్మాణం వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడకూడదన్నదే జగన్ ఆలోచన అని సజ్జల తెలిపారు. అందుకోసమే 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న చోట రాజధాని ఉండాలని జగన్ ప్రతిపాదించారని గుర్తుచేశారు. చంద్రబాబు రాజధానిని ఒక ఖిగ్రోత్ ఇంజిన్‌ఖిలా కాకుండా, ప్రజాధనాన్ని తోడేసే ఖిమోటారుఖిలా వాడు కుంటు న్నారని ఆరోపిం చారు. అనవసరమైన విధం గా రేట్లు పెంచి, కాంట్రాక్టుల పేరుతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో రేణుకా చౌదరి అమరావతిని కమ్మరావతి అని సంబో ధించినప్పుడు టీడీపీ ఎంపీలు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. లోకేశ్ ఆ వ్యాఖ్యలకు చప్పట్లు కొట్టడ ఏమిటన్నారు.



5-4Pg6exHMNWJQE.qxd:5-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:24 AM Page 1



# తిరుపతి నగరపాలికలో ఎన్నికల వార్డుల విభజన ప్రక్రియ

## - 10 నుండి 16 వరకు ప్రజల అభిప్రాయాలు



**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి నగరంలో పెరగనున్న ఎన్నికల వార్డుల విభజన, పెంపు ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డుల విభజన, పెంపుపై నగరపాలక సంస్థ రెవిన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్వర్ణ వార్డు కార్యదర్శులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్ లలో జనాభాకు అనుగుణంగా ఎన్నికల వార్డుల సంఖ్య పెంచేందుకు ఏప్రిల్ 1న జిఒ విడుదల చేసిందని తెలిపారు. ఆ మేరకు తిరుపతి నగరపాలక సంస్థలోని 50 వార్డులను 66 వార్డులకు పెంచేలా నిర్ణయించారని తెలిపారు. ఈ వార్డుల విభజన, పెంపు ప్రక్రియ లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లు, జనాభా, తదితర వాటిని ప్రామానికంగా జాగ్రత్తగా పరిశీలించి విభజన చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ లోపు వార్డుల విభజన ప్రక్రియ ముసాయిదా సిద్ధం చేయాలని తెలిపారు. వార్డులను విభజించే ప్రతిపాదనను ఫారం 1 ద్వారా 10 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు నగరపాలక సంస్థ నోటీసు బోర్డు, ఇతర ప్రకటనల ద్వారా ప్రజల అభ్యంతరాల కొరకు ఉంచాలని తెలిపారు. 25 వ తేదీ లోపు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఎన్నికల వార్డుల విభజన ప్రతిపాదనలను ఖరారు చేసి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మే రెండవ తేదీ లోపు ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్ చేత మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వార్డు విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం జరుగుతుందని తెలిపారు. మే 5వ తేదీ లోపు కమిషనర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ఫారం 6 లో తుది నోటిఫికేషన్ ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపీలు ఖాన్, దేవి కుమారి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీలు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## 55 కిలోల గంజాయిని పట్టుకున్న ఎల్ కోట పోలీసులు

**విజయనగరం లక్కవరపుకోట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** మండలంలోని రంగరాయపురం గ్రామ సరిహద్దు వద్ద విశాఖపట్నం అరకు ప్రధాన రహదారిపై శనివారం ఎల్ కోట ఎస్ ఐ నవీన్ పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఒడిస్సా నుండి తమిళ నాడుకు గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారంతో కారులో తరలిస్తున్న 55 కేజీలు గంజాయితో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ముగ్గురు వ్యక్తులు ఒడిశాకు చెందిన సంజయ్, సంజీవ్ కుమార్, పింకూ గా గుర్తించామని వీరిపై పి.డి యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి దామోదర్ మాట్లాడుతూ గంజాయి సరఫరా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరిక జారీ చేశారు. గంజాయి నిర్వహణకు 5 చెక్ పోస్టులు పెట్టామని పట్టుకున్న గంజాయి భద్రత కోసం 1200 అడుగులతో ఒక రూమ్ నిర్మిస్తున్నా మన్నారు. పెద్ద మొత్తం అయిన తర్వాత ఆ గంజాయిని తగలబెడతామన్నారు. గంజాయిని పట్టుకున్న లక్కవరపుకోట పోలీసులను అభినందిస్తున్నామని ఎస్ పి తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నట్టు ఎస్ పి విజయనగరంలోని ప్రెస్ మీట్‌లో తెలిపారు. పట్టుకున్న గంజాయిని ఎల్ కోట తహసీల్దార్ టీ.రమేష్ సమక్షంలో తూకం వేసి సీజ్ చేశారు.

## కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి శనివారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన,వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచలస్వామి, హరిష్ ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి,పెంచల పెంచలయ్య స్వామి,ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి,అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరా స్వామి, సాయి స్వామి నిర్వహించారు.

### మాజీ సీఎం జగన్ మరో సారి ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారు : మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం జగన్ మరో సారి ఏపీ ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు.ఆయన ప్రతి మాట అసత్యమన్నారు.విశ్వసనీయత అనే పదం వాడే హక్కు జగన్‌కు లేదన్నారు.. రాజధానిపై తొమ్మిది సార్లు మాట మార్చిన జగన్‌కు విశ్వసనీయత ఉందా?

అని ప్రశ్నించారు. మూడు రాజధానులని ఏం ఉద్ధరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళగి రిలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. '2019లో కూడా చంద్రబాబు ప్రభుత్వమే వచ్చి ఉంటే ఈ బాధలు ఉండేవి కావన్నారు.

# రాజధానిపై జగన్‌కు ఎందుకు కక్ష?

## - ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**పెద్దపంజాణి(చిత్తూరు జిల్లా), ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** అమరావతి రాజధాని నగరంపై వైకాపా అధినేత వైఎస్ జగన్‌కు ఎందుకంత కక్ష అని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రశ్నించారు.శనివారం పెద్దపంజాణిలో సర్పంచుల సన్మాన కార్యక్రమంతో పాటు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఈ ఆటోలపంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ఐదేళ్ళపాటు జగన్ మూడు రాజధానులని పేర్కొన్నారని నేడు మావిగన్ పాట అందుకున్నారని పేర్కొన్నారు. ఆంద్రరాష్ట్రానికి అభినవ తుగ్లక్‌గా ఆయన మారారని పేర్కొన్నారు.పూటకోసాకు గంటకోమాటతో మాట్లాడే జగన్‌లాంటి నాయకులు అవసరమాఅని ప్రజలు ఆలోచించాలని కోరారు.రాజధాని అమరావతి నగరాన్ని మార్చడం ఇకఎవరితరమూ కాదని ఆయన పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రఅభివృద్ధి ప్రజలకు క్షేమం సాధ్యమౌతుందన్నారు.రాష్ట్రానికి రాజధానిగా 2014లోనే ప్రకటించి నిర్మాణపనులుసైతం మెదలుపెట్టారన్నారు.అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌కూడా రాజధానికి మద్దతు పలికారన్నారు.అయితే ఆయనఅధికారంలో వచ్చాక రాజధానినగరాన్ని పట్టించుకోక అటవీప్రాంతలా మార్చేశారని పేర్కొన్నారు.మరలా సిఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి నగరం నిర్మాణంపై దృష్టిపెట్టి ఒకచరిత్రలో నిలిచిపోయే రీతిలో రాజధాని నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు.వచ్చే ఐదేళ్ళలో పూర్తిస్థాయిలో రాజధానిగా అమరావతి ఉంటుందన్నారు.సిఎం చంద్రబాబు నాయుడు పోలవరంతోపాటు రాయలసీమలోని త్రాగునీటి ప్రాజెక్టులని సైతం త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టారన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగించేందుకు పార్టీలు చూడమని వారికిఉన్న పేదరికమే కొలబద్దఅని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రప్రజలు అన్నీగమనిస్తున్నారని వచ్చేఎన్నికల్లో వైకాపాకు గట్టిగా బుద్ధిచెప్పడం ఖాయమన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ రామమూర్తి,ఎంపిడిఓ బాలాజీ,డిప్యూటి ఎంపిడీఓలు సుధాకర్ రావ్,శారదాదేవి,ఏపిఎం మురగేష్,ఏపిఓ నీరజ,ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ,ఏఎంసి చైర్మన్ రాజనన్న,ఎంపిపి రెడెడ్డప్ప,కూటమి నేతలు రెడ్డివారి విజయ్ భాస్కర్ రెడ్డి,మురహరిరెడ్డి,సుధాకర్ రెడ్డి,రోజారెడ్డి, శ్రీరాములు, రుద్రమూర్తి నాయుడు, నాగిరెడ్డి, జయరామి రెడ్డి, కృష్ణారెడ్డి, ముబారక్ తాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకప్ప, జనసేన మండల అధ్యక్షులు రంపాల శివకుమార్, సోమశేఖర్, రాజేష్, సుబ్రమణ్యం, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డా. గజల్ శ్రీనివాస్‌కు 'గజల్ కళాభారతి' పురస్కారం



**విశాఖపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కళాభారతిలో మొట్టమొదటిసారిగా ప్రముఖ ప్రపంచ విఖ్యాత గజల్ గాత్ర విద్వాంసులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ను గజల్ కళాభారతి" బిరుదుతో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా శనివారం కళాభారతిలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ను సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా అతిథులు అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్ తోపాటు ముందుగా ఆయనను వేదికపైకి పిలిచి విశిష్ట అతిథి స్పిరిట్యుయల్ గురు మోలానా అమిర్ ఉద్దీన్ మలక్ సాహెబ్ , సభ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి శ్రీరామదాస డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, స్థానిక వస్త్ర వ్యాపార అధిపతి మల్లిక్,దుస్సాలువుతో పూలదండలతో, ఘనంగా సత్కరించి "గజల్ కళాభారతి" బిరుదు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాభారతిలో ముమ్మారు గిన్నెస్ బుక్ ఆఫ్ ప్రపంచ రికార్డు అందుకుని, 150 భాషల్లో గజల్స్ పాడు తూ, అనేక దేశాలలో గజల్ కార్యక్రమాలు ఇస్తూ, ఎక్కడ ఏ దేశానికి వెళితే ఆ దేశంలో ఆ భాషలోనే గజల్స్ పాడి అందరి మన్ననలు పొందిన తెలుగు తేజం డాక్టర్ గజల్ శ్రీనివాస్ అని కొనియాడారు. ముఖ్యముఖ్య అతిథి డైరెక్టర్ జనరల్ నేవల్ ప్రాజెక్ట్స్ వైస్ అడ్మిరల్ కె. శ్రీనివాస్ తో పాటు అధ్యక్ష కార్యదర్శులు రూ 20,000 / నగదు బహుమతి అందజేసేరు. ఈ సంద ర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఇలాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారుడికి జరిగిన సత్కార సభలో పాల్గొని వారిని సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ కళాభారతిలో సంగీ తం, సాహిత్యం, నృత్యం,నాటకం ఇలాంటి ప్రముఖ కలలే కాకుండా హరికథ,బుర్రకథ, తోలు బొమ్మలాట, తదితరు కళాకారులను కూ డా ఆహ్వానించి ఈ వేదిక మీద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు.సన్మాన గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని వందల బిరుదు సత్కారాలు జరిగాయని కానీ ప్రధమంగా ఒక కలలకు నిలయమైన కళాభారతి పేరుతో గజల్ కళాభారతి అనే భృతి సత్కారం అందుకోవడం ప్రధమణి చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం జరిగిన గజల్ గాత్ర కచేరీలో పలు గజల్స్ పాడి శ్రోతలను మరో ప్రపంచానికి తీసుకెళ్లారు.

# జగ్గయ్యపేటలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఈతల పోటీలు

## -19 జిల్లాల నుండి తరలి వస్తున్న స్విమ్మర్లు



తెలుగు రాష్ట్రాలస్థాయి ఈతల పోటీలకు సిద్ధమైన జగ్గయ్యపేట స్విమ్మింగ్ పూల్

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఈనెల 5వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఈతల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శనివారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణా స్టేట్స్ డిఎస్ఏ మాష్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలను జగ్గయ్యపేట చరిత్రలో మొదటిసారిగా స్థానిక స్విమ్మింగ్‌పూల్‌లో ఈపోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈటోర్నమెంట్స్‌కు ముఖ్య అతిధులుగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రభుత్వవిప్-నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఏపి కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ పి తేజస్వి, శాప్ వైస్‌చైర్మన్, ఎండి భరణి, శాప్ చైర్‌పర్సన్ అనిమిని రవి నాయుడు విచ్చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, డ్రీమర్స్ సిమ్మర్స్ అసోసియేషన్ (డిఎస్ఏ) వ్యవస్థాపకులు, కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు, ఈవెంట్ కన్వీనర్ అన్నంనీడి కళ్యాన్, అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలాలి నరేష్, కోశాధికారి పి రమాదేవి, స్విమ్మర్స్ కో-కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ యలదండి శ్రీనివాసరావు, యువకోచ్ పి సందీప్ మాట్లాడుతూ 25 నుండి 80 ఏండ్ల వయసుపైబడిన వారందరికి వయసుల వారీగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం గం.9లకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జగ్గయ్యపేట పట్టణం నుండి 28 మహిళలు, 21 మంది పురుషులు మొత్తం 49 మంది పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.

రెండు రాష్ట్రాలలోని 19 జిల్లాల నుండి 210 మంది తలపడుతు న్నారన్నారు.

# వెనక్కి వెళ్లిన సాఫ్ట్‌వేర్ సంస్థల్ని మళ్లీ తీసుకొస్తున్నాం : మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్త ప్రతినిధి:రాష్ట్రంలో సాంకేతిక అభివృద్ధికి 27 పాలసీలు తీసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో వెనక్కి వెళ్ళిపోయిన సాఫ్ట్‌వేర్ సంస్థలను మళ్ళీ తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఏఐ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఐ సమ్మిట్‌ను కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచాన్ని టెక్నాలజీ నడిపిస్తోందని 25 ఏళ్ళ క్రితమే చంద్రబాబు చెప్పారన్నారు. '2014 లోనే చంద్రబాబు డేటా సెంటర్లు,ఏఐ అంటుంటే మాకు అర్థం కాలేదు.ఇప్పుడు అనేక డేటా సెంటర్లు వస్తున్నాయి.రాష్ట్రంలో పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. మత్స్యకారుల జీవితాలు బాగుపడకుండా వైకాపా కుట్రలు చేస్తోంది. వాటిని ఛేదిస్తూ అన్ని ఫిషింగ్ హార్బర్లు పూర్తి చేసి తీరుతాం. పరిశ్రమలు వచ్చి తీరప్రాంత ప్రజలు బాగుపడటం వైకాపాకి నచ్చట్లేదు. పొరుగు రాష్ట్రాల బోట్లను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైకాపా కుట్రపూరితంగా మత్స్యకారులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.



అమరావతి చట్టబద్ధతపై కేకు కట్‌చేస్తున్న బొప్పరాజు తదితరులు

# అమరావతి రాజధాని చట్టబద్ధతపై ఏపి జెఏసి హర్షం

**విజయవాడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్లో అమరావతి రాజధాని నిర్మించాలని ఎంతో పట్టుదలతో అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని, గత ప్రభుత్వం మూడు రాజధాను ల పేరుతో అమరావతి రాజధానిని మరుగును పెట్టాలని చూసినప్పటికీ పట్టు వదలని విక్రమార్కునిలా అమరావతిలోనే రాజధాని నిర్మిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు గా ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ నేడు పార్లమెంటులో ప్రధానమంత్రిని కూడా ఒప్పించి చట్టం అయ్యేలా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి. వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు శనివారం విజయవాడ రెవెన్యూ భవన్లో జరిపిన ప్రెస్ మీట్ ద్వారా హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరావతి విషయంలో ప్రజలకు ఉద్యోగులకు నమ్మకం కలిగించే లాగా పార్లమెంట్ ఉభయ సభల్లో ద్వారా చట్టం చేసి తన సత్తా నిరూపించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తూ, ముందుగా కేక్ కట్ చేసి జయహో అమరావతి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకుంటూ రాష్ట్రం విడిపోగానే దశాబ్దం క్రితం పేరులో, లోగోలో అమరావతి చిహ్నంతో ఏర్పాటైన తొలి ఉద్యోగుల జేఏసీ - "ఏపీ జేఏసీ అమరావతి" అని చెప్పారు. అయితే అమరావతి రాజధానిని ఇంకా పటిష్ట పరిచేందుకు ఉమ్మడి రాజధాని హైద రాబా దులో ఉద్యో గులకు ఇల్లు స్థలాలు కేటా యించిన విధంగానే రాజధాని అమరావతిలో కూడా రాష్ట్ర సచివాలయం మరియు శాఖాపరమైన (హెచ్వోడి) కార్యాలయాల ఉద్యోగులకు వెంటనే స్థలాలు కేటాయించి ఉద్యోగుల్లో కూడా మనోధైర్యం నింపాలని బొప్పరాజు విజ్ఞప్తి చేశారు. పేరులో, లోగోలో అమరావతి చిహ్నం తో దశాబ్ద కాలం క్రితం ఏర్పడి, నేటికి అనేక శాఖాపరమైన సంఘాలతో బలంగా ఉండి, లక్షలాది మంది ఉద్యోగులకు అండగా నిలుస్తున్న తొలి ఉద్యోగుల జేఏసీ - ఏపీ జేఏసీ అమరావతి అని, ఇప్పుడు దానికి చట్టబద్ధత రావడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నామని చెప్పారు.ఐ.ఆర్ మరియు 12 వ పిఆర్సి కమిషనర్ నియామకం అలాగే రాష్ట్రంలో పనిచేస్తున్న 16 లక్షల మంది ఉద్యోగులు నాలుగు లక్షల పైబడి ఉన్న పెన్షనర్లకు గతంలో 43 ఫిట్మెంట్ ఇచ్చిన చంద్రబాబునాయుడుపై ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉద్యోగుల ఆశలకు అనుకూలంగా ఐ.ఆర్ తక్షణమే ప్రకటించి, ఒక్క రూపాయి కూడా ఖర్చులేని పీఆర్సీ కమిషనర్ ను తక్షణమే నియమించి వీలైనంత త్వరగా 90 రోజుల్లో నివేదిక తెప్పించుకుని 12వ పిఆర్సి ప్రకటించాలని కోరారు.

గత ప్రభుత్వ హయాంలో ఉన్న బకాయిలతో పాటు ఈ ప్రభుత్వం వచ్చాక చెల్లించాల్సిన బకాయిలు కలిపి మొత్తం సుమారు 40 వేల కోట్ల పైబడి చేరిందని ఈ బకాయిల్లో మెజార్టీ బకాయిలు రిటైర్డ్

మరియు చనిపోయిన ఉద్యోగుల సెటిల్మెంట్లు డబ్బులే ఉన్నాయని ఇప్పటికే రిటైర్డ్ ఎంప్లాయిస్ కు చెల్లించాల్సిన బకాయిల డబ్బులు తీసుకోకుండానే చనిపోతుండడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికే అనేక సమావేశాల్లో మరియు లిఖిత పూర్వకంగా ఈ అంశాన్ని ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన తెలిపామన్నారు.

# 15పాల నమూనాల్లో కల్తీ నిర్ధారణ పాలపై కట్టుదిట్టమైన చర్యలు

**రాజమహేంద్రవరం,ఏప్రిల్4,ప్రభాతవార్త** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. తూర్పుగోదావరి జిల్లాలో కల్తీ పాల ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ మరియు ఫుడ్ సేఫ్టీ విభాగాలు సంయుక్తంగా విస్తృత చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె. సుప్రియ శనివారం ఒక సంయుక్తంగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 705 పాల నమూనాలను పరీక్షి ంచగా, అందులో 15 నమూనాల్లో కల్తీ ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో 1 యూరియా, 8 డిటర్జెంట్, 2 మాల్టోడెక్స్ట్రిన్, 5 నాణ్యత ప్రమాణాలకు తగ్గని నమూనాలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై ఆహార భద్రతా చట్టం ను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 నుండి జిల్లాలో ర్యాండమ్‌గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తూ కల్తీ పాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ర్యాండమ్ గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాలు ఉత్పత్తి, సరఫరా, మార్కెటింగ్, ఇంటింటికి విక్రయాలు చేసే వారందరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. ఇందుకోసం స్థానిక పశు సంవర్ధక శాఖ లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించి తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాలు మరియు అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఇంటి వద్దనే లేదా విడిగా పాలు కొనుగోలు చేస్తున్న ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలో కల్తీ పాల వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు.





## తిరుమల ఘాట్‌లో ప్రమాదం

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్ రోడ్ లో రెండు వాహనాలు శనివారం సాయంత్రం ప్రమాదానికి గురయ్యాయి. మొదటి ఘాట్ రోడ్డు చివరన వినాయక గుడి సమీపంలో తమిళనాడుకు చెందిన కారు టైరు పంచరై డివైడర్ ని ఢీ కొంది.అదే సమయంలో తిరుపతి లోకల్ టాక్సీ జీప్ వినాయక గుడి దాటిన మలుపు వద్ద వేగంగా వెళ్లి డివైడర్ పైకి ఎక్కింది.. రెండు వాహనాల్లో వెళ్తున్న భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.. మొదటి ఘాట్ రోడ్లో రెండు వాహనాలు ప్రమాదానికి గురవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ సిబ్బందితో చేరుకుని వాహనాలను తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్దరించారు.

# దుర్గమ్మవారి సేవలో కేరళ డిజిపి



కేరళ డిజిపి దంపతులకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారిని కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) రవాడ ఆజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా కేరళ డీజీపీ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, భక్తుల కోసం ఆలయ యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కొనియాడారు. లోకకళ్యాణం కోసం, అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు మోతినగర్ హైదరాబాద్ వాస్తవ్యులు పి రజినికాంత్ శర్మ, వేలంమ్రి సాంబశివశర్మ పద్మావతి దంపతులు పేరు మీద రూ.1,00,000లు విరాళమును మరియు రైలుపేట, రేపల్లెకు చెందిన ద్రోణ వజ్జల బ్రహ్మ అవధాని మరియు ధర్మపత్ని రూ.1,00,000లు విరాళమును మరియు విజయవాడకు చెందిన ఒకే కుటుంబము వారు బమిడిపాటి శ్రీమన్నారాయణ రూ.1,00,000లు విరాళమును మరియు బమిడిపాటి శారద రూ.1,00,000లు విరాళమును ఆలయ అధికారి కలిసి అన్నదానమునకు వినియోగించవలసిందిగా తెలిపి ఉన్నారు.

# విమానాశ్రయం భూసేకరణ త్వరలోనే పూర్తి చేస్తాం

## -1070 ఎకరాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయ అభివృద్ధి సంస్థకు అప్పగింత

**దగదర్తి (నెల్లూరు), ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** దగదర్తి మండలం దామవరం కేకే గుంట గ్రామాలలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంనిర్మాణం సంబంధించి భూసేకరణపనులు త్వరలోనేపూర్తి చేయనున్నట్లు కావలి ఆర్డీవో ఎలీషా పేర్కొన్నారు. ఇప్పటికే 1070 ఎకరాల భూమిని రాష్ట్ర విమానాశ్రయ అభివృద్ధి సంస్థకుఅప్పగించినట్లు తెలిపిన ఆయన 711 ఎకరాలు భూసేకరణ ఇంకా మిగిలి ఉన్నట్లుపేర్కొన్నారు. 1371.75 ఎకరాలలో నిర్మిస్తున్న విమానాశ్రయ నిర్మాణం కొరకు ఇప్పటికే 660 ఎకరాల భూమికినష్టపరిహారం చెల్లించినట్లుపేర్కొన్నారు. సర్వే నంబర్ వన్ బైవన్ దామవరం సంబంధించి ఇటీవల వరకు పరిహారం పంపిణీకి సంబంధించి న్యాయస్థానంలో కేసునడుస్తుండేదని ప్రస్తుతం అది కూడా కొలిక్కి వచ్చినట్లు పేర్కొన్నారు. సర్వే నెంబర్ 238 నుంచి 259 వరకు దామవరం గ్రామానికి సంబంధించి భూమిపై హక్కుల గురించి గ్రామస్తులకు, పట్టాదారులకు మధ్య వివాదం నడుస్తుండేదని అది కూడా ఇటీవల పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. తహసీల్దార్‌కార్యాలయంలో పెండింగ్లో ఉన్నజెన్యూన్ సర్టిఫికేట్లను వీలైనంత త్వరగా పరిష్కరించేలా సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఒకేభూమికి పలువురు నష్టపరిహారం కోరుతూఉండడం కుటుంబంలో నలుగురు వారసులు ఉండగా ఒకరు మాత్రమే తనకొక్కరికే కావాలంటూ వివాదాల సృష్టిస్తుండడంతో భూసేకరణ సమస్య క్లిష్టంగా మారిందన్నారు. వీలైనంత వరకుపరిహారం అందించేటట్లు చూసిలేని పక్షంలోపరిహారాన్ని న్యాయ స్థానంలో జమ చేసి భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. 2009 సంవత్సరం నుండి నేటి వరకు కొనసాగుతున్నభూసేకరణ పక్రియత్వరలో నేపూర్తిచేసి విమానాశ్రయనిర్మాణాన్ని ప్రారంభించేందుకుగల అడ్డంకులనుతొలగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాజరస్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి,సీనియర్ అసిస్టెంట్ శివ,మండల సర్వే రాబియాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి అధికారినంటూ బెదిరించి రూ.50లక్షలు వసూలు

## - సిఐ శివరాముడు కృషితో కటకటాల్లోకి నిందితుడు

**అనంతపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు 2021 సంవత్సరంలో తనను ఏసీబీ అధికారిగా ఫోన్లో పరిచయం చేసుకుని, ముదిగుబ్బలో తసిల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను ఫోన్ ద్వారా బెదిరించాడు. అవినీతి కేసులు పెట్టిస్తానని భయపెట్టి రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైనా, నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును సవాలుగా తీసుకున్న సిఐ శివరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, గోప్య సమాచారంతో నిందితుడి కదలికలను గమనించారు. దీంతో ఏప్రిల్ 4, 2026న నిందితుడు ఎరుకల హనుమంతును పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సిఐ శివరాముడు, వారి బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
ఆదివారం 5, ఏప్రిల్ 2026




# అయ్యన్నకు మద్దతుగా నిలిచిన దళిత సంఘాలు

## జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేష్ క్షమాపణ చెప్పాలి

నర్సీపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడికి దళిత సంఘ నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా గురువారం నర్సీపట్నంలో వున్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ సుధాకర్ మృతికి ముందు మాజీ ఎమ్మెల్యే గణేష్ ఇంటికి పిలిపించి హింసించి లెటర్ రాయించుకున్న సంచలన వీడియోను దళిత సంఘాలు విడుదల చేసాయి. సుధాకర్ ఉదంతాన్ని 8వ పేజీలో

# 13న గంధం అరగదీత..
# 17న గంధం అమావాస్య

## ఏర్పాట్లపై సింహాచలం ఈవో అధికారులకు దిశానిర్దేశం


8లో

సింహాచలం, ప్రభాతవార్త

దక్షిణ భారతావనిలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయ శ్రీ వైష్ణవ దేవాలయాలలో అత్యంత విలక్షణమైన శ్రీ వరాహలక్ష్మి నృసింహస్వామి వారి చందనోత్సవం సమీపిస్తోంది. వరాహ నరసింహుడి దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉంది. ఈ నేపథ్యం లోనే చందన యాత్ర సందర్భంగా స్వామివారికి సమర్పించనున్న శ్రీ గంధం అరగదీత ప్రక్రియను చైత్ర బహుళ ఏకాదశి సందర్భంగా ఈనెల 13వ తేదీన ప్రారంభించను న్నారు. ఇందుకోసం శ్రీ గంధపు చెక్కలను ఆలయ వైదిక, అధికార వర్గాలు సిద్ధం చేస్తున్నాయి. బేడా మండపంలో ప్రారంభం కానున్న ఈ వేడుకకు సానలను (రాళ్లు) ఏర్పాటు చేసేందుకు సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. అలాగే ఈనెల 17వ తేదీన గంధం అమావాస్య వేడుక జరగనుంది. చందనోత్సవానికి ముందు వచ్చే అమావాస్య కనుక దీనిని గంధం అమావాస్యగా పూజించుకోవడం ఉత్తరాంధ్ర భక్తులకు సంప్రదా యంగా వస్తోంది. ఆనాడు సముద్ర తీర ప్రాంత భక్తులు, ప్రధానంగా గంగపుత్రులైన జాలర్లు కుటుంబాల సమేతంగా సింహాచలం వచ్చి వేడుకను జరుపుకుంటారు. కొండ దిగువ వరాహ పుష్కరిణి ప్రధాన వేదికగా జరిగే ఈ ఉత్సవం కోసం ఏర్పాట్లు పరిశీలించేందుకు ఈవో వెంకట్రావు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పుష్కరిణి ప్రాంగణాన్ని పరిశీలిం చారు. భక్తులకు అనువుగా స్నాన ఘట్టాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటిలో లోతైన ప్రదేశాలకు భక్తులు వెళ్లకుండా బార్కెట్లుతోపాటు హెచ్చ రిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ దీపాలు గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఈవో తో పాటు కార్యనిర్వహక ఇంజనీర్లు సి హెచ్. వెంకటరమణ, బి.రాంబాబు, డి.ఇ. సన్యాసరావు సిబ్బంది ఉన్నారు.

# అల్లూరి జిల్లాలో కంపించిన భూమి

## అరకువేలి, పాడేరు, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల్లో అర్ధరాత్రి పరుగులు పెట్టిన జనం






(ప్రభాతవార్త -పాడేరు)

అల్లూరి జిల్లా అరకువేలి, పాడేరు, పెదబయలు, ముంచింగిపుట్టు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. సుమారు 30 సెకెన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో తెలియక నిద్రిస్తున్నవారు కూడా భయంతో భయటకు పరుగులు తీశారు. అయితే.. ఆ తరువాత అంతా సద్దుమగడంతో చాలా సేపు గిరిజనులంతా బయటే ఉండిపోయారు. ఎన్నడూలేనివిధంగా ఒక్కసారిగా భూమి కంపించడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. కొంది ఇళ్లల్లో సామాన్లు కూడా క్రింద పడిపోయాయి. ఏం జరుగుతుందోనని తెలుసుకునే లోపే అంతా అయిపోయింది. అయితే ఈ ప్రకంపనలపై అధికారులు జిల్లా కలెక్టరేట్ కి సమాచారం అందించారు. రెండు రోజులుగా దేశంలో పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపిస్తుండటంతో.. ఎప్పుడు ఏ ప్రాంతంలో భూమి కంపిస్తుందోనని అంతా భయపడుతున్నారు. అయితే శనివారం రాత్రి ఈ ప్రకంపనలు రావడంతో అక్కడే బసచేసి ఉన్న కొందరు పర్యాటకులు 8వ పేజీలో

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



విశాఖపట్నం -ప్రభాతవార్త

నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం లో ఏదొక రూపంలో లబ్ధి చేకూరే విధంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలుకు, వారి అభివృద్ధికి లబ్ది చేకూరే నిరంతరం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దక్షిణ నియోజకవర్గంలో వివిధ వార్డులకు చెందిన 200 మంది మహిళలకు వైజాగ్ సి పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందజేసిన కుట్టు మిషన్‌లను నియోజకవర్గ మహిళలకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందినప్పుడు ఆ కుటుంబం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నప్పుడు సమాజం అభివృద్ధి మరింత జరుగుతుందని తెలియజేశారు. నియోజవర్గ పరిధిలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరే విధంగా నిరంతర కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించినటువంటి వైజాగ్ సి పోర్టు ప్రతినిధులు రాంబాబు, గణేష్ కి శాలువా వేసి, బొకే అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మహిళలతో పాటు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిపై స్పీకర్ అయ్యన్న సూచనలు


8లో

# అమరావతికి చట్టబద్ధత.. చారిత్రక విజయం

## -గాజువాకలో కూటమి శ్రేణుల భారీ బైక్ ర్యాలీ -పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


8లో

# 6, 7 తేదీల్లో విశాఖ జిల్లాలో కేంద్ర సమాచార కమిషనర్ పర్యటన


8లో

# సాగర్ నగర్ డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం


8లో

# విశాఖ స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై ఆర్థిక భారం అన్యాయం

విశాఖపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

విశాఖ స్టీల్ ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగుల మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంచుతూ స్టీల్ యాజమాన్యం వారిపై భారాలు వేయడాన్ని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు రామస్వామి, జె అయోధ్య రామ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధిలో భాగస్వామ్యమైన స్టీల్ విశ్రాంతి ఉద్యోగులపై నేడు స్టీల్ యాజ మాన్యం మెడికల్ ఇన్సూరెన్స్ పై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోడాన్ని వారు తీవ్రంగా విమర్శిం చారు. ఈ సమస్యను పరిష్కరించమని గడచిన 20 రోజులుగా విశ్రాంతి స్టీల్ 8వ పేజీలో

# అమరావతికి మేము వ్యతిరేకం కాదు

## శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ


8లో

# మౌనిక హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన


8లో

# డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు కళాభారతి గౌరవం

## "కళాభారతి" బిరుదుతో సత్కారం -గజల్‌తో మంత్రముగ్ధులైన ప్రేక్షకులు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

కళాభారతిలో మొట్టమొదటిసారిగా ప్రముఖ ప్రపంచ విఖ్యాత గజల్ గాత్ర విద్వాంసులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ను గజల్ కళాభారతి" బిరుదుతో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా శనివారం కళాభారతిలో డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అతిథులు అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్ తోపాటు ముందుగా ఆయనను 8వ పేజీలో



## ప్రతి వార్డులోనూ పార్టీ జెండా ఎగురవేయాలి..



గాజువాక,ఏప్రిల్ 4,ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ 47వ స్థాపక దినోత్సవాన్ని (ఏప్రిల్ 6) పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రతి వార్డులో 'మన ఊరు-మన జెండా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నేత పి.వి.ఎన్. మాధవ్ పిలుపునిచ్చారు. శనివారం విశాఖ విమానాశ్రయంలో ఆయనను కలిసిన పార్టీ శ్రేణులు.. ఆదివారం గాజువాకలో జరగనున్న శిక్షణ కార్యశాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) మాట్లాడుతూ ఆదివారం కొత్తగాజువాక, చినగంట్యాడ, నాతయ్యపాలెం కేంద్రాల్లో 'పండిత్ దీనదయాళ్ ప్రశిక్షణ మహా అభియాన్-2026' శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏప్రిల్ 6న ప్రతి వార్డులో పార్టీ జెండాలు ఎగురవేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాధవ్ సూచించారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పరశు రామరాజు, ప్రధాన కార్యదర్శి సిరసపల్లి నూకరాజు పాల్గొన్నారు.

## అయ్యన్నకు మద్దతుగా నిలిచిన దళిత సంఘాలు

7వ పేజీ తరువాయి ..

గౌరవ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేశారని వివరించారు. సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి, కోటి రూపాయల ఆర్థిక సాయంతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రభుత్వ ఉద్యోగంను అందించారని వివరించారు.సుధాకర్ మృతికి కారణమైన వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల డిమాండ్ చేసాయి.

## ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిపై ..

7వ పేజీ తరువాయి ..

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రంథాలయాల స్థితిగతులపై వాటి అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొన్ని ముఖ్యమైన సలహాలు సూచనలు ఇచ్చారు. మున్సిపాలిటీలోనూ పంచాయతీలోనూ సెస్ బకాయలు త్వరితగతిన వసూలు చేసే విధానం తీసుకురావాలని అన్నారు. గ్రామ గ్రామాన గ్రంథాలయాలు అభివృద్ధి చేసే దిశగా ప్రతి ఒక్క పౌరులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ గ్రంథాలయ సంస్థకు సంబంధించి సేవా విస్తరణ పోస్టర్ శాసనసభ్యులు స్పీకర్ అయ్యన్నపాత్రుడు , తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆధ్వర్యంలో విడుదల చేశారు. విశాఖ తూర్పు నియోజకవర్గం లో పుస్తక నిక్షిప్త కేంద్రాలు ఏర్పాటు చేయడానికి మౌలిక వసతులు కల్పించాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వారిని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సతీష్ కుమార్ కోరారు. వెంటనే నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఖాళీ భవనాలను రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకున్నారు.

## అమరావతికి మేము వ్యతిరేకం కాదు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్య నారాయణ తెలిపారు. శనివారం బీచ్ రోడ్లో ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం తాము అమరావతిని వ్యతిరేకించడం లేదని రాష్ట్రానికి ఇబ్బంది లేకుండా అక్కడ అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. కేవలం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు.. డైవర్షన్ పాలిటిక్స్లో భాగంగానే అమరావతి చట్టం పేరుతో ప్రజలను మభ్యపెడుతూ కూటమి ప్రభుత్వం భారీ దోపిడీకి తెరలేపిందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం - శాంతిభద్రతల క్షీణత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయి అని ఆరోపించారు. అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి అని చివరకి రైతులకు మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం కూడా కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అందక విద్యార్థులు, ఉపాధి హామీ పనులు లేక గ్రామాల్లో పేదలు అల్లాడుతుంటే.. ప్రభుత్వం మాత్రం కేవలం అమరావతి జపం చేస్తూ కాలక్షేపం చేస్తోంది అని ఆరోగ్యశ్రీని అటకెక్కించి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు అని దుయ్యబట్టారు. 8 వాయిదాలు బకాయిలు ఉంటే 2 వాయిదాలు ఫీజు రీయింబర్స్ మెంట్ కి బీఆర్ (బడ్జెట్ రిలీజ్ )మాత్రమే ఇచ్చారు అని ఇంకా ఆ చెల్లింపులు కూడా పూర్తిగా చేయలేదు అని చెప్పారు. ప్రత్యేక హోదాపై మౌనమెందుకు అని ప్రశ్నించారు. అమరావతిపై చట్టం చేశామని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు, విభజన హామీ అయిన ప్రత్యేక హోదాపై ఎందుకు తీర్మానం చేయలేదు అని "ప్రత్యేక హోదా వస్తే ఇలాంటి అమరావతిలు పది వస్తాయి అని తెలియజేశారు. విశాఖ, ముంబై వంటి నగరాలు అభివృద్ధి చెందుతాయి". హోదా ముగిసిన అధ్యాయమని చెప్పడం బాధ్యతారాహిత్యం అని చెప్పారు. ఈ నెల 15-16 తేదీల్లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతితో పాటు ప్రత్యేక హోదా బిల్లును కూడా ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలి అని సూచించారు. నిర్మాణ వ్యయంలో అవినీతి- స్క్వేర్ ఫీట్ రూ.14వేలా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల్లో భారీ దోపిడీ జరుగుతోంది అని అనుమానం వ్యక్తం చేశారు. సాధారణంగా చదరపు అడుగుకు రూ. 4-5 వేలు ఖర్చయ్యే చోట, రూ. 14 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారు. గత ఐదేళ్లలో చంద్రబాబు కేవలం 5 శాతం పనులే చేశారు, ఇప్పుడు కూడా రెండేళ్లు పూర్తయినా ఎమ్మెల్యే క్వార్టర్లు, మంత్రులు, నివాసన సముదాయాలు, న్యాయమూర్తులు నివాసాలు, చివరకి కరకట్ట రోడ్డు కూడా పూర్తి చేయలేకపోయారు. అమరావతి ఎప్పటికి పూర్తవుతుందనే దానికి ప్రభుత్వానికి కనీసం 'టైమ్ బాండ్' కూడా లేదు అని ప్రశ్నించారు. వైయస్.జగన్ 'మావిగన్' ప్రతిపాదన - రైతుల సంక్షేమం కోసమేనని వైయస్ జగన్, వైయస్సార్సీపీ అమరావతికి వ్యతిరేకం కాదు, మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు (మావిగన్) ప్రాంతం కలిపి రాజధానిగా అభివృద్ధి చెందాలనేది ఆయన ఆకాంక్ష. మీడియా కేవలం రాజధాని అంశాన్ని మాత్రమే హైలైట్ చేస్తూ రైతుల, విద్యార్థులతో సహా ప్రజల సమస్యలను విస్మరించడం దురదృష్టకరం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ , మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్, మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పాల్గొన్నారం

## డాక్టర్ గజల్ శ్రీనివాస్కు కళాభారతి గౌరవం

7వ పేజీ తరువాయి ..

వేదికపైకి పిలిచి విశిష్ట అతిథి స్పిరిట్యుయల్ గురు మౌలానా అమిర్ ఉద్దీన్ మలక్ సాహెబ్ , సభ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి శ్రీరామదాస డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, స్థానిక వస్త్ర వ్యాపార అధిపతి మల్లిక్,దుస్సాలువుతో పూలదండలతో, ఘనంగా సత్కరించి "గజల్ కళాభారతి" బిరుదు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాభారతిలో ముమ్మారు గిన్నెస్ బుక్ ఆఫ్ ప్రపంచ రికార్డు అందుకుని, 150 భాషల్లో గజల్స్ పాడుతూ, అనేక దేశాలలో గజల్ కార్యక్రమాలు ఇస్తూ, ఎక్కడ ఏ దేశానికి వెళితే ఆ దేశంలో ఆ భాషలోనే గజల్స్ పాడి అందరి మన్ననలు పొందిన తెలుగు తేజం డాక్టర్ గజల్ శ్రీనివాస్ అని కొనియాడారు. ముఖ్యముఖ్య అతిథి డైరెక్టర్ జనరల్ నేవల్ ప్రాజెక్ట్స్ వైస్ అడ్మిరల్ కె. శ్రీనివాస్ తో పాటు అధ్యక్ష కార్యదర్శులు రూ 20,000 /- నగదు బహుమతి అందజేసేరు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఇలాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారుడికి జరిగిన సత్కార సభలో పాల్గొని వారిని సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. కళాభారతి వారు కళలకు చేస్తున్న ప్రోత్సహిస్తున్న సేవ చాలా ప్రశంసనీయమని కొనియాడారు. విశిష్ట అతిథి మాట్లాడుతూ కళాకారుల్ని సత్కరించడం మన భారతీయ సంస్కృతి, సంస్కారమని ఈ సత్కార సభలో పాల్గొనడం గొప్ప అదృష్టమని అధికంగా వచ్చిన రసజ్ఞులైన ప్రేక్షకులకు అభినందనలు తెలియజేశారు. అధ్యక్షులు మాట్లాడుతూ కళాభారతిలో సంగీతం, సాహిత్యం, నృత్యం,నాటకం ఇలాంటి ప్రముఖ కలలే కాకుండా హరికథ,బుర్రకథ, తోలుబొమ్మలాట, తదితరు కళాకారులను కూడా ఆహ్వానించి ఈ వేదిక మీద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. కార్యదర్శి డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కార్యక్రమాల నిర్వహణే కాకుండా సంగీతం నృత్యం శిక్షణ కూడా ఇస్తూ మన సాంప్రదాయాల్ని సంస్కృతిని కలలని కాపాడుతున్నామని అన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని వందల బిరుదు సత్కారాలు జరిగాయని కానీ ప్రథమంగా ఒక కలలకు నిలయమైన కళాభారతి పేరుతో గజల్ కళాభారతి అనే భృతి సత్కారం అందుకోవడం ప్రథమణి చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రభా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం జరిగిన గజల్ గాత్ర కచేరీలో పలు గజల్స్ పాడి శ్రోతలను మరో ప్రపంచానికి తీసుకెళ్లారు. అందులో భాగంగా భారతం, భాగవతం,రామాయణం, ఇలాంటి పుణ్య గ్రంథాల నుంచి క్లుప్తంగా గానం చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు డాక్టర్ గజల్ శ్రీనివాస్. అందమైన బాల్యాయానికి గాయమయ్యిందా అంటూ ప్రస్తుత పరిస్తులను తెలియజేస్తూ తల్లిదండ్రులకు సమయమే ఉండదు పిల్లలతో గడపడానికి అంటూ జీవితసత్యాన్ని గజల్ రూపంలో గానం చేశారు దీంతో చెప్పట్లతో హాలు మారు మ్రాగిపోయింది.

### 6, 7 తేదీల్లో విశాఖ జిల్లాలో

## కేంద్ర సమాచార కమిషనర్ పర్యటన

విశాఖపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

కేంద్ర సమాచార కమిషనర్(సీఐసీ) సుధారాణి రేలంగి 6, 7వ తేదీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆరో తేదీన ఢిల్లీ నుంచి విశాఖ చేరుకుంటారు. 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో జరిగే దక్షిణ ప్రాంత లా రివ్యూ కన్సల్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్, భద్రత, రవాణా తదితర ఏర్పాట్లపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# సాగర్ నగర్ డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం





సాగర్ నగర్, ప్రభాతవార్త

సాగర్ నగర్ వద్ద సముద్రంలోకి పారుతున్న మురుగు నీటి సమస్యకు అడ్డుకట్ట వేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శనివారం సాగర్ నగర్ డ్రైనేజీని సందర్శించిన ఆయన శుద్ధి చేసిన తర్వాతే మురుగునీటిని వదిలిపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడున్న సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్.టి.పి.) చాలాకాలం క్రితం నిర్మించారు. నివాసాలు బాగా పెరిగిపోవడంతో ప్రస్తుతం దాని సామర్థ్యం సరిపోక మురుగునీరు నేరుగా సముద్రంలో కలిసిపోతోంది. ఎస్.టి.పి. సామర్థ్యాన్ని పెంచాలని గంటా ఇప్పటికే అధికారులకు చెప్పడంతో రూ. 3.5 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేశారు. ఈ నిధులతో జోడుగుళ్లపాలెం పంప్ హౌస్ వరకు పైప్ లైన్ కెపాసిటీ పెంచి అప్పుఘర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు మురుగునీరు మళ్లిస్తారు. మూడు, నాలుగు నెలల్లో పరిష్కారమయ్యేలా పనులు వేగవంతం చేయాలని గంటా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ ఇంజనీర్లు సుధాకర్, శాంతిరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, శఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, సారిపల్లి శ్రీనివాస్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధత.. చారిత్రక విజయం

గాజువాక,ఏప్రిల్ 4,ప్రభాతవార్త

అమరావతి రాజధానికి లోక్సభలో చట్టబద్ధత లభించడం ఆంధ్రుల ఆత్మగౌరవ విజయమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం గాజువాక నియోజకవర్గంలో కూటమి నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అని కొనియాడారు. రాజధాని కోసం రైతులు చేసిన త్యాగాలు వృధా పోలేదని, చట్టబద్ధతతో వారికి అసలైన న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తుంటే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికీ గందరగోళ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం వైకాపా నేతలకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జనసేన నాయకులు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు, నరసింహ పాత్రుడు, వార్డు అధ్యక్షులు సింగూరి అనంత్, నల్లూరి సూర్యనారాయణ,కర్రీ దసేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## మౌనిక హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

అత్యంత కిరాతకంగా హత్యకు గురైన పోలిపల్లి మౌనిక ఘటనకు నిరసనగా మహిళా, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. నగరంలోని తాటిచెట్లపాలెం జంక్షన్ సంజీవయ్య కాలనీ-1 అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో మౌనికకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం . లక్ష్మి మాట్లాడుతూ అత్యంత దుర్మార్గంగా హత్యకు పాల్పడిన నేవీ ఉద్యోగి సి.హెచ్. రవీంద్రను త్వరితగతిన విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక అనుమానాలకు తావిస్తున్న ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరారు. ఈ కేసుపై లోతైన విచారణ జరపకుండా హంతకుడు చెప్పిన విషయాలనే నిజాలుగా పోలీసులు మాట్లాడటం అభ్యంతరకరంగా ఉందన్నారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు డి.లలిత మాట్లాడుతూ మౌనిక మృతికి మౌనికే కారణం అంటూ పోలీసులు తీరుగా ఉందన్నారు. కేవలం డబ్బు కోసం రవీంద్రనను ఆమె వేదించినట్టుగా , ఆ కోపంతోనే అతను హతమార్చినట్టుగా పోలీసులు చెప్పటం దారుణమన్నారు. పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ పురుషాధిక్య సమాజం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని స్త్రీలను బానిసల మాదిరిగా వారిని ఏమైనా చేయవచ్చు ..అది మగవాడి హక్కుగా చూస్తున్నారన్నారు. నవయాన బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ హతురాలు మౌనిక దళిత మహిళ కావటం వల్లే ఆమెకి పూర్తి న్యాయం జరగటం లేదన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. భీమ్ సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు మాట్లాడుతూ డేటింగ్ యాప్ ల వల్ల యువతరం పక్కదారి పడుతుందని, అనేక రకాల హింసలకు కారణమవుతున్నాయని వాటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత్ సమాజ్ డెవలప్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతాడ సూర్యం, న్యాయవాది సయ్యద్, పలు సంఘాల నాయకులు , సారయ్య, గుడివాడ అప్పారావు, విజ్ఞానంద్, రామకృష్ణ, నిర్మల, రోహిణి దేవి, బాలనాగమ్మ , జయవర్ధన్, అనిల్, సునీల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

## విశాఖ స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై ఆర్థిక భారం అన్యాయం

7వ పేజీ తరువాయి ..

ఉద్యోగులు అనేక ఆందోళనలను మరియు స్థానిక శాసనసభ మరియు పార్లమెంటు సభ్యుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ యాజమాన్య వైఖరిలో ఎటువంటి మార్పు లేకపోవడం శోచనీయమని వారు అన్నారు. అతి తక్కువ పెన్షన్తో బ్రతుకు ఈడుస్తున్న వీరిపై దయ లేకుండా యాజమాన్యం భారాలు మోపడం ఆవేదన కలిగిస్తుందని వారు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యం పై అనేక రాయితీలను ఇస్తున్నారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కనుక ఇప్పటికైనా స్టీల్ యాజమాన్య ఏకపక్ష నిర్ణయాన్ని స్థానిక పార్లమెంటు శాసనసభ్యులు ఒత్తిడి చేసి సర్క్యులర్ ఉపసంహరించుకునే విధంగా చేసి పాత పద్ధతిని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

## అల్లూరి జిల్లాలో కంపించిన భూమి

7వ పేజీ తరువాయి ..

కూడా భయాందోళనకు గురయ్యారు. అరకులోయలో కూడా భూమి కంపించింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా, అరకలోయలో శనివారం రాత్రి 11 గంటల 35 నిమిషాల సమయంలో ఐదు సెకండ్ల పాటు భూమి కనిపించింది. కొన్ని ఇళ్లల్లో ఉన్న వస్తువులు కిందపడగా , మరికొందరి ఇళ్లల్లో సోఫా సెట్లు గోడకు కొట్టుకోవడం స్పష్టంగా కనిపించింది. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు తమ ఇళ్లను వదిలి భయంతో బయటికి పరుగులు తీశారు . కాగా ఇటువంటి సంఘటన అరకులోయ లో గతంలో ఎన్నడూ చూడలేదని, ఒక్కసారిగా భూమి షేక్ అవడంతో భయాందోళనలు చెందామని, ఆ భయంతోనే ఎల్లను వదిలి బయటకు వచ్చామని అరకులోయ వాసులు పేర్కొన్నారు.

## నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

విశాఖపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

విశాఖ బీచ్ రోడ్, పాండురంగా పురం సమీపంలోని వున్న ఏయూ యోగా విలేజ్ లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఏప్రిల్ 5 వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటలు వరకు జరుగుతుందని తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు ఈ శిబిరంలో వైద్యం చేస్తారని తెలిపారు. కేజీహెచ్ పూర్వ సీనియర్ వైద్యాధికారి కే.ఈశ్వర రావు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తారు అని తెలిపారు. శిబిరానికి పాత డాక్టర్ చీటీలు తీసుకు రావాలని సూచించారు. నగర ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలు కోసం 9440191673 ఆయన కోరారు.

## రాష్ట్ర బడ్జెట్తోనే సమగ్ర అభివృద్ధి: ఎమ్మెల్యే గణబాబు



గాజువాక,ఏప్రిల్ 4,ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది అని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. శనివారం మల్కాపురం మరడిమాంబ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన బడ్జెట్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధిని సమతూకం చేస్తూ ఈ బడ్జెట్ను రూపొందించారని కొనియాడారు. గత ప్రభుత్వం హయాంలో ఉన్న 12.3 శాతం వడ్డీ రేట్లను ప్రస్తుత ప్రభుత్వం 9 శాతానికి తగ్గించిందని, భవిష్యత్తులో దీనిని 7 శాతానికి తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల రాకతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. నీతి ఆయోగ్ సహకారంతో విశాఖ ఎకనామిక్ రీజియన్ను అభివృద్ధి చేస్తున్నామని, దీనివల్ల ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఓ జె. మాధవి, జోనల్ కమిషనర్ హేమావతి, తహసీల్దార్ రమేష్, మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్ విశాఖ పర్యటన

విశాఖపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్ ఈ నెల 5 తేదీన విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో 4వ తేదీ సాయంత్రం న్యూఢిల్లీ నుంచి విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస స్థలానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. పర్యటనలో భాగంగా ఏప్రిల్ 5న ఆసియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మెడియేషన్ (ఆకాఆకామీ) ఆధ్వర్యంలో జరగనున్న ఎం.ఎస్.ఎం.ఈ. కాన్ఫరెన్స్-2026లో పాల్గొంటారు. అనంతరం అదే రోజు సాయంత్రం 4.45 గంటలకు విశాఖపట్నం నుంచి వాయుమార్గం ద్వారా ఢిల్లీకి తిరుగు పయనమవుతారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఉగాది పురస్కారం లభించిన అనంతుని ఆలయ ప్రధాన అర్చకులకు ఘన సన్మానం



పద్మనాభం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

ఇటీవల విశాఖపట్నంలో అప్పటి జిల్లా కలెక్టర్ హరీంద్రపాసాదు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అవార్డు అందుకున్న అనంతపద్మనాభస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పి సీతారామాంజనేయస్వామి ఆచార్యలను శనివారం కుంతీమాధవస్వామి ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.సుమారు నలభై సంవత్సరాల క్రితం ఆలయానికి ఎటువంటి భక్తులు రాకపోవడం,అదాయం రాని సమయంలో స్వామికి సేవలు చేయడం గొప్పవిషయమని ఎంపీపీ రాంబాబు కొనియాడారు. అనంతరం అర్చకుల దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగు, బి. సత్యనారాయణ, నాగు, సన్నిబాబు,వేదుల నగేష్, కె.నారాయణరావు, అవనాపు రమణ, పైడినాయుడు, ఎస్ నారాయణరావు, పద్మనాభం, సిబ్బంది అచ్చుంనాయుడు, ఎం అప్పలరాజు పాల్గొన్నారు.

# పూర్ణా మార్కెట్లో అగ్ని ప్రమాదానికి గురైన 16 షాపుల యజమానులకు చెక్కులు అందజేత

### -కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ సౌత్ ఇన్చార్జ్, రాష్ట్ర చైర్మన్ సుధాకర్

విశాఖపట్నం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :

కొన్ని నెలల క్రితం పూర్ణా మార్కెట్లో 16 షాపులు అగ్ని ప్రమాదానికి గురైన నేపథ్యంలో శనివారం దక్షిణ నియోజకవర్గం సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, టిడిపి సౌత్ ఇన్చార్జ్ సీతంరాజు సుధాకర్ చేతుల మీదుగా 16 షాపుల యజమానులకు పదివేల రూపాయలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని సందర్శించి వారికి ధైర్యాన్ని కల్పించడంతో పాటు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పూర్ణా మార్కెట్ అభివృద్ధి తో పాటు, నిరంతరం సీసీ కెమెరా ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని గుర్తు చేశారు. వ్యాపారస్తులకు, చిరు వ్యాపారస్తులకు తాను అండగా ఎల్లప్పుడూ ఉంటానని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదేవిధంగా మార్కెట్లో స్థానిక దుకాణదారులను తో స్వయంగా మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటన చేపట్టి స్థానిక లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్ సి ఐ లతో మాట్లాడారు. చిరు వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్వో పాత్రుడు, స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు , యూనియన్ నేతలు పాల్గొన్నారు.



## పెందుర్తి పోలీసుల చలివేంద్రం

### - దాహార్తులకు మజ్జిగ పంపిణీ



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ కెవి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.వేసవి కాలమంతా ప్రతిరోజు ఒక్కో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా బాధ్యతలు స్వీకరించి దాహార్తులకు మజ్జిగ అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సమీపంలోని రైతు బజారుకు వచ్చే ప్రజలు, ప్రయాణికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తున్నారు.ఈ సేవా కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించడంతో పాటు, పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## ఆనందపురంలో ఈస్టర్ శుభ ర్యాలీ

ఆనందపురం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త



ఈస్టర్ పండుగ సందర్భంగా శని వారం ఆనందపురంలో రన్ ఫర్ జీసస్ శుభ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.ఆర్.సింగ్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలందరూ శాంతి, సమాధానములతో జీవించవలెనని సందేశమిచ్చారు. ప్రభువైన యేసు క్రీస్తు ఈ భూమిపై జన్మించి, సమస్త ప్రజల కొరకు మరణించి తిరిగి లేచిన మహిమను ప్రకటించారు. రెవరెండ్ డాక్టర్ పాల్ విక్టర్ ప్రార్థన చేసి, రన్ ఫర్ జీసస్ జెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శుభ ర్యాలీలో ఆనందపురం మండలంలోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రను రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలి..

పద్మనాభం, ఏప్రిల్ 4,ప్రభాతవార్త




ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికంగా విరాజిల్లుతున్న తిరుమల తిరుపతి దేవ స్థానం పవిత్రతను కాపాడాల్సిన భాధ్యత కూటమి ప్రభుత్వంపైన ఉందని భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇనచార్జి మజ్జి చిన్నశ్రీను అన్నారు. రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు జగన్ ఆదేశాలు మేరకు తిరుపతి దేవ స్థానం పవిత్రతను కాపాడదే దిశగా అనైక్యత కార్యక్రమాలకు, అనుచిత వ్యాఖ్యలు చేసిన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడును పదవి నుండి తొలగించాలని శనివారం పద్మనాభం గ్రామంలో నియోజకవర్గ వైసీపీ శ్రేణులు ఆందోళన చేసారు. ఈ సందర్భంగా కుంతీమాధవస్వామి ఆలయంలో పూజలు చేసారు. అనంతరం ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ నాయుడును తొలగించకుండా నిర్లక్ష్యం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని ఆరోపించారు. అలాగే పలు దేవాలయాలకి బి ఆర్ నాయుడును వెంటబెట్టుకొని సి ఎం చంద్రబాబు తిరగడం ఆలయాలను అపవిత్రత చేయడమేనని అన్నారు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు రాంబాబు, వెంకట్రావు, వాసురాజు,పార్టీ అధ్యక్షులు లక్ష్మణరావు, గాదు శ్రీను, బంక సత్యం, నాయకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక నిధి అనంతపద్మనాభస్వామి సన్నిధి రచయితకు ఘనంగా పౌర సన్మానం

పద్మనాభం, ఏప్రిల్ 4,ప్రభాతవార్త



పద్మనాభం పుణ్యక్షేత్రంలో ద్వాపర యుగంలో సూదిమొన లాంటి ఎత్తైన పర్వ తంపై వేంచేసిన అనంతపద్మనాభ స్వామి దివ్యక్షేత్రంపై అనంతుని సన్నిధి ఆధ్యాత్మిక నిధి అనే పుస్తకం రాసిన ప్రముఖ జర్నలిస్టు చెన్నా మృత్యుంజయరావును శనివారం కుంతీమాధవస్వామి ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా పౌర సన్మానం చెసారు. ఆయన మాట్లాడుతూ స్వామి కృపతో స్వామి చరిత్రను, ఆలయ ప్రాశస్త్యంను స్థానికులు వేదుల కుటుంబ సభ్యులు చెప్పిన ఆధారాలు ప్రకారం ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగిందని, అలాగే పూర్వం నలభై సంవత్సరాల క్రితం స్వామి ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన కొన్ని వంశ పారంపర్య కుటుంబాల వివరాలను వచ్చే సంచికలో రాయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ఎంపీపీ రాంబాబు,నాయకులు నాగు, తాలాడ పద్మనాభం, సన్నిబాబు, సుంకర పైడినాయుడు, బి.సత్యనారాయణ, నారాయణరావు,కె.నారాయణరావు, సీనియర్ జర్నలిస్టులు వర్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేసుకోవాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 4,ప్రభాతవార్త



వ్యాధుల నియంత్రణకు పెద్దలు పిల్లలు అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేసుకోవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చీ అన్నారు.విశాఖపట్నం పోర్టు ట్రస్టు సహకారంతో 9నుండి 14 ఏళ్లలోపు ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల బాలికలకు శని ఆదివారాల్లో సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న హెచ్.పి.వి క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు హెచ్.పి.వి వ్యాక్సిన్ వేసుకోవడం ఎంతైనా అవసరమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తునాయని చెప్పారు.లయన్స్ ఇంటర్నెషనల్, లయన్స్ క్లబ్ అఫ్. వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ఇప్పటికే ఆడపిల్లల్లో క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం ఎంతైనా అవసరమని తెలియజేశారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షీరీన్ రహమాన్ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు హెచ్పివి వాక్సినేషన్ కార్యక్రమాన్ని గత రెండేళ్లుగా చేపడుతున్నామని పోర్టు సహకారంతో ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలకు చెందిన ఆడపిల్లలకు రెండు రోజుల పాటు వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు తెలియజేశారు శని ఆదివారాల్లో సుమారు 800 మందికి పైగా ఆడపిల్లలకు వ్యాక్సినేషన్ వేస్తామని శనివారం 400మందికి పైగా ఆడపిల్లలు రెండో డోస్ వ్యాక్సిన్ వేసుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు మెడికల్ డైరెక్టర్ మోహన్ పాత్రో సూపరింటెండెంట్ కళ్యాణ్ ప్రసాద్, లయన్స్ క్లబ్ అఫ్ విశాఖపట్నం సెక్రటరీ రవిచంద్ర, చైతన్య స్రవంతి ప్రతినిధులు విజయ,లక్ష్మీ, ఉమా తదితరులు.పాల్గొన్నారు.

## గాజువాకలో 'జై అమరావతి' బైక్ ర్యాలీ

గాజువాక,ఏప్రిల్ 4,ప్రభాతవార్త



రాజధాని అమరావతికి మద్దతుగా గాజువాకలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 66వ వార్డు ఇన్చార్జి, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. సుమారు వందలాది మంది కార్యకర్తలు 'జై అమరావతి' అంటూ నినాదాలు చేస్తూ కనితి రోడ్డు నుంచి 60 ఫీట్ల రోడ్డు మీదుగా పాత గాజువాకలోని ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రామ్ భాయ్, మాజీ అధ్యక్షులు స్వర్ణపుడి సత్యనారాయణ, యూనిట్ ఇన్చార్జులు మౌలాలి, షేక్ ఇమామ్, పార్టీ సీనియర్ నాయకులు నెల్లి సాదు రావు, మిశ్రా రెడ్డి, అన్వర్, జావేద్, నాగేశ్వరావు, నగేష్, మధు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మీ భూమి-మీ హక్కు ద్వారా రైతులకు శాశ్వత రక్షణ

ఆనందపురం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:



రైతుల భూములకు శాశ్వత రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆనందపురం తహశీల్దార్ శీనుబాబు చెప్పారు. మండలంలోని తర్లువాడ గ్రామంలో శనివారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రీ సర్వే అనంతరం మంజూరైన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. తహశీల్దార్ శీనుబాబు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించిన రీసర్వే వలన భూ వివాదాలు తగ్గుతాయని, ప్రతి రైతుకూ తమ భూమిపై పూర్తి హక్కులు లభిస్తాయని వివరించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, మాజీ సర్పంచ్ లు బాలి అయ్యప్ప, మజ్జి వెంకటరావు, మజ్జి రమేష్ నాయుడు, బంకు రాజు, బాలి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్పందనతో... క్రమశిక్షణతో... సేవతో విశాఖ

### పోలీసింగ్‌పై శంఖబ్రత బాగ్చి ముద్ర - ప్రజలకు అందుబాటు నుంచి అంతర్గత వ్యవస్థ మార్పు దాకా బహుముఖ పరిపాలనా శైలి - స్పష్టంగా ప్రతిఫలిస్తున్న కమిషనరేట్ పని తీరు - విశాఖలో ప్రజల నమ్మకాన్ని బలపరుస్తున్న స్పందించే పరిపాలన

*ఫిర్యాదు వస్తే వెంటనే స్పందన, స్టేషన్‌లో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్య, పని చేసిన సిబ్బందికి బహిరంగ గుర్తింపు, బాధితుడికి ఆస్తి తిరిగి అందే రికవరీ మేళాలు, ప్రమాద బాధిత కుటుంబాలకు సహాయం, సమాజంలో వెనుకబడిన వర్గాలకు సేవా కార్యక్రమాలు- ఈ విభిన్న అంశాలన్నింటినీ ఒకే పరిపాలనా దిశలో అమలు చేస్తూ విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.*

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగర పోలీసింగ్‌లో కనిపిస్తున్న మార్పులను చెప్పాలంటే.. “ఫిర్యాదు చేస్తే స్పందన, పని చేస్తే గుర్తింపు, నిర్లక్ష్యం చేస్తే చర్య, అవసరమైతే పోలీస్ నుంచి ప్రత్యక్ష సహాయం” అనే పరిపాలనా ధోరణి స్థిరపడింది. నగర పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రకటించిన “ప్రజలకు చేరువైన పోలీసింగ్, సిబ్బందిలో క్రమశిక్షణ, సాంకేతికత ఆధారిత అమలు, బాధితునికి తక్షణ న్యాయం, సామాజిక బాధ్యత” అనే అంశాలు ఇప్పుడు నగర కమిషనరేట్ పనితీరులో స్పష్టంగా కనిపిస్తున్నాయి.సీపీ బాగ్చి 2024 జూలై 1న బాధ్యతలు చేపట్టిన వెంటనే కమిషనరేట్ పరిధిలోని దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరుపై నేరుగా దృష్టి సారించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల నమోదు విధానం, సీజ్ చేసిన వస్తువుల భద్రత, ముద్దాయిల రికార్డులు, సిబ్బంది హాజరు, స్టేషన్ పరిశుభ్రత వంటి అంశాలపై ఆకస్మిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఒకసారి మాత్రమే కాదు, అనేక స్టేషన్లను మూడు నుంచి నాలుగు సార్లకు పైగా సందర్శించి నేరుగా ఫిర్యాదు దారులతో మాట్లాడి కేసుల పురోగతిని తెలుసుకోవడం ఆయన తనిఖీల్లో భాగమైంది. స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండకూడదని, ఫిర్యాదు స్వీకరణలో ఆలస్యం జరగకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో స్టేషన్ స్థాయిలో పని తీరు మారిందని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.అంతర్గత క్రమశిక్షణపై అదే తీవ్రత కొనసాగింది . విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, ప్రజలతో అనుచిత ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలపై వెంటనే విచారణ చేసి పలువురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ విభాగానికి చెందిన సిబ్బందిపై సస్పెన్షన్ చర్యలు, అక్రమ తనిఖీలపై చర్యలు, బెట్టింగ్ సంబంధిత ఆరోపణలపై విచారణలు -- ఇవన్నీ “జీరో టాలరెన్స్” విధానానికి సంకేతాలుగా నిలిచాయి.ఇదే సమయంలో ప్రజలకు నేరుగా చేరువయ్యే పోలీసింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు . ఒక ప్రత్యేక ఫోన్ నంబర్(79950 95799)ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా ఆ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆ నంబర్‌కు వచ్చిన కాల్స్‌పై సమయం తేడా లేకుండా స్పందిస్తూ, సంబంధిత డీసీపీ, ఏసీపీ, ఎస్‌హెచ్‌వోలకు వెంటనే ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం పరిపాలనా విధానంగా మారింది. రాత్రి వేళల్లోనూ, సెలవు దినాల్లోనూ కాల్స్ స్వీకరించి స్పందించిన సందర్భాలు ప్రజల్లో విశ్వాసం పెంచాయి. చాలాసార్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లకముందే ప్రజలు నేరుగా సీపీ నంబర్‌కే కాల్ చేయడం విశాఖలో సాధారణంగా మారింది.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కమిషనరేట్ పరిపాలనలో ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది . కమిషనరేట్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎన్ని మంది వచ్చినా ఒక్కరినీ తిరస్కరించకుండా వ్యక్తిగతంగా ఫిర్యాదులు స్వీకరించడం ప్రత్యేకతగా మారింది. చాలాసార్లు కార్యక్రమం అర్ధరాత్రి దాటి, కొన్ని సందర్భాల్లో రాత్రి 1 గంట వరకూ సాగినా చివరి వ్యక్తి సమస్య వినకుండానే ముగించరని ప్రజలు చెబుతున్నారు. భూవివాదాలు, కుటుంబ సమస్యలు, ఉద్యోగ మోసాలు, సైబర్ ఫిర్యాదులు, పెండింగ్ కేసులు --- ఇలా విభిన్న అంశాలతో వచ్చిన వారందరి ఫిర్యాదులను విని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం వల్ల ఈ వేదికపై విశ్వాసం పెరిగింది. ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతిక మార్పులు కూడా కార్యరూపం దాల్చాయి . అతివేగ నియంత్రణకు లేజర్ ఆధారిత పరికరాలు, ఏఐ ఆధారిత నంబర్ ప్లేట్ గుర్తింపు, ఆటోమేటిక్ చలాన్లు, ప్రమాదకర కూడళ్ల వద్ద పర్యవేక్షణ పెంపు, రాత్రి తనిఖీల విస్తరణ వంటి చర్యలు అమలులోకి వచ్చాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను క్రమబద్ధీకరించడమే కాకుండా, అమలులో అక్రమతలు కనిపించిన సిబ్బందిపైనా చర్యలు తీసుకోవడం అమలు పట్ల స్పష్టతను చూపించింది. సైబర్ నేరాల్లో నగర పోలీస్ ప్రత్యేక ఫలితాలు సాధించింది . ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు కోట్ల రూపాయల మేర నగదు రికవరీ చేసి తిరిగి అందించడం, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయి సైబర్ నేరాలకు బలవంతం చేయబడిన యువతలో 85 మందిని రక్షించడం వంటి చర్యలు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఆస్తి నేరాల ఛేదనలో ప్రత్యేక బృందాల పనితీరు వేగవంతమైంది. దొంగతనాలు, గృహచోరీలు, మొబైల్ మిస్సింగ్ కేసులపై నెలనెలా సమీక్షలు నిర్వహించి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించే విధానాన్ని బలోపేతం చేశారు. అనేక కేసుల్లో బంగారం, వెండి, నగదు, మొబైళ్లు, వాహనాలు రికవరీ అయ్యాయి.ప్రజల్లో విశేష స్పందన తెచ్చిన కార్యక్రమాల్లో రికవరీ మేళాలు ముందువరుసలో నిలిచాయి . చోరీకి గురైన బంగారం, వెండి, నగదు, మొబైళ్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులను యజమానులకు నేరుగా అప్పగించే విధంగా పలు విడతల్లో మేళాలు నిర్వహించారు. కోటి రూపాయలకుపైగా విలువైన ఆస్తులు యజమానుల చేతికి చేరడంతో ఫిర్యాదు చేసిన కేసు ఫలితం ఇస్తుందనే నమ్మకం బలపడింది.ఇదే దిశలో వాహన రిటర్న్ మేళాలు కూడా నిర్వహించి కోర్టు ప్రక్రియ పూర్తయిన సీజ్ వాహనాలను యజమానులకు త్వరగా అందజేశారు .సంవత్సరాలుగా పోలీస్ యార్డుల్లో నిలిచిపోయిన వాహనాలు తిరిగి యజమానుల చేతికి చేరాయి.రోడ్డు ప్రమాదాలు, ముఖ్యంగా హిట్ అండ్ రన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన రోడ్ ట్రాఫిక్ యాక్సిడెంట్ విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్ వినూత్న కార్యక్రమంగా నిలిచింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం త్వరగా అందేలా కేసులను ట్రాక్ చేసి సహాయం చేస్తున్నారు. ఇప్పటివరకు అనేక కుటుంబాలకు లక్షల రూపాయల పరిహారం అందింది.సామాజిక సేవా దృక్పథంతో పోలీసింగ్‌కు మరో మానవీయ కోణం జోడించబడింది . భిక్షాటనలో ఉన్నవారు, నిరాశ్రయ జీవితం గడుపుతున్నవారు, జైలు శిక్ష అనంతరం తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి ఇబ్బంది పడుతున్న వ్యక్తులు, ట్రాన్స్‌జెండర్ వర్గాల పునరావాసం వంటి అంశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సామాజికంగా వెనుకబడిన వర్గాలను తిరిగి గౌరవప్రద జీవనంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పోలీస్ వ్యవస్థ ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం విశాఖ పోలీసింగ్‌కు ప్రత్యేకతగా నిలిచింది.విద్యార్థులతో నేరుగా మమేకమవుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా మరో ముఖ్య కోణం . స్వీయ క్రమశిక్షణ, లక్ష్యసాధన, సమాజ బాధ్యత, చట్టపరమైన అవగాహన వంటి అంశాలపై యువతతో నేరుగా మాట్లాడిన కార్యక్రమాలు పలు వేదికల్లో జరిగాయి.పోలీస్ సిబ్బంది పనితీరును గుర్తించే విధానంలో కూడా మార్పు తీసుకొచ్చారు. ప్రతి నెల కమిషనరేట్ నేర సమీక్ష సమావేశాన్ని ప్రోత్సాహక వేదికగా మార్చి కీలక కేసులు ఛేదించిన వారు, రికవరీలు సాధించిన వారు, ప్రజా సేవలో ముందున్న సిబ్బందికి ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డులు అందజేస్తున్నారు. పదోన్నతి పొందిన సిబ్బందికి కొత్త ర్యాంక్ బ్యాడ్జ్‌లు స్వయంగా ధరింపజేసి పోస్టింగ్ ఆర్డర్లు అందజేయడం ద్వారా సాధారణ పరిపాలనా ప్రక్రియకు గౌరవప్రద రూపం ఇచ్చారు. దీనివల్ల దిగువ స్థాయి సిబ్బందిలో కూడా బాధ్యతాభావం, ప్రేరణ పెరిగిందని అధికారులు చెబుతున్నారు.మొత్తం మీద ..పోలీసింగ్‌ను కేవలం చట్ట అమలు వ్యవస్థగా కాకుండా, ఫోన్ ఎత్తి స్పందించే పరిపాలనగా, ఫిర్యాదు విని పరిష్కారం చూపే యంత్రాంగంగా, పని చేసినవారిని గుర్తించే సంస్థగా, అవసరమైతే సమాజంలో వెనుకబడిన వర్గాలకు తోడుగా నిలిచే సేవా వ్యవస్థగా మలచే ప్రయత్నం విశాఖలో స్పష్టంగా కనిపిస్తోంది. “సమస్య వస్తే ముందుగా స్పందన వస్తుంది” అనే భావన ప్రజల్లో బలపడటం అదే మార్పుకు సూచికగా విశాఖపట్నం ప్రజలు భావిస్తున్నారు

## టీటీడీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి

### -గాజువాకలో వైకాపా నిరసన.. రాజీనామాకు డిమాండ్




గాజువాక, ఏప్రిల్ 4,ప్రభాతవార్త

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పవిత్రతకు భంగం కలిగిం చేలా వ్యవహరిస్తున్న చైర్మన్ బి.ఆర్. నాయుడును పదవి నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ శని వారం గాజువాకలో వైకాపా శ్రేణులు నిరసన చేపట్టాయి. నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో వడ్లపూడి లక్ష్మీపురం కాలనీలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్టను కాపాడాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం పార్టీ పీఏసీ సభ్యులు తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ.. వివాదాస్పద వ్యక్తులను పవిత్రమైన టీటీడీ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ మాట్లాడుతూ.. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని పదవిలో కొనసాగించడం సరికాదని, ముఖ్యమంత్రి స్పందించి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై నిరంతర నిఘా

### శుక్రవారం 2,046 ఈ-చలానాలు -హెల్మెట్ లేకపోతేనే వెయ్యికి పైగా కేసులు -మద్యం మత్తులో డ్రైవింగ్‌పై 32 కేసులు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగరంలో ట్రాఫిక్ నియమాల ఉల్లం ఘనలపై ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవ హరిస్తున్నారు. నగరంలో రోజురోజుకు వాహ నాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఒక్కరోజులోనే 2,046 ఈ-చలానాలు విధించారు. ఈ నెల 3వ తేదీన నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద నిర్వహించిన తనిఖీల్లో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 1,008 మందిపై కేసులు నమోదు చేశారు. వెనుక కూర్చున్న పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించని 188 మందిపై కూడా చలానాలు విధించారు. ట్రిబుల్ రైడింగ్ చేసిన 73 మందిపై కేసులు నమోదు చేశారు.అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై ఇంటర్‌సెప్టర్ వాహనాల ద్వారా 222 కేసులు నమోదు కాగా, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించిన 16 మందిపై చర్యలు తీసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 10 మందిపై, మైనర్లు వాహనాలు నడిపిన రెండు కేసులు నమోదు చేశారు.రాంగ్ పార్కింగ్‌పై కూడా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించి పార్కింగ్ చేసిన 119 వాహనాలపై కేసులు నమోదు చేయగా, 43 వాహనాలను టోయింగ్ చేసి కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 32 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, మొత్తం 16 వాహనాలను సీజ్ చేశారు. ఇతర మోటారు వాహనాల చట్ట ఉల్లంఘనల కింద మరో 365 కేసులు నమోదు చేశారు.ఇక ఆర్టీవో శాఖతో కలిసి సంయుక్త తనిఖీల్లో ఒక ఆర్టీసీ బస్సును పరిశీలించారు. నగరంలో బైక్ రేసింగ్, రాష్ డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్ల వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరి భద్రత కోసం అన్న అవగాహనతో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రాణాపాయం కలిగిస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ధూమపాన నిబంధనల అమలుకు ఈ-చలాన్ సిద్ధం

### కాట్పా అమలులో డిజిటల్ విధానానికి శ్రీకారం -పొగాకు చట్టంపై అవగాహన -పెందుర్తిలో ఈ-చలాన్ విధానంపై పోలీసుల ప్రచారం



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (కాట్పా) అమలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-చలాన్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు, దుకాణదారు లకు చట్టంలోని ముఖ్య నిబంధనలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు కాట్పా ఉల్లంఘనలను సమర్థవంతంగా నియంత్రించేందుకు ఎన్ఐసి ఈ-చలాన్ వ్యవస్థను పోలీస్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. దీని ద్వారా నగదు రహిత జరిమానా చెల్లింపులు, పారదర్శకత, రియల్‌టైమ్ పర్యవేక్షణ సులభమవుతుందని వివరించారు.ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేయడం నిషేధమని, 18 ఏళ్ల లోపు వారికి పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని, విద్యాసంస్థల నుంచి 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయం చేయరాదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్టంగా రూ.200 వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.ఇక పోలీస్ సిబ్బందికి ఈ-చలాన్ వ్యవస్థ వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రజలు పొగాకు నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా పాటించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ కోరారు.

## పోలీసుల వార్షిక క్రీడలు ప్రారంభం

### కైలాసగిరిలో జెండా ఆవిష్కరించిన అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా






(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలు శనివారం కైలాసగిరి పోలీస్ పెరేడ్ మైదానంలో ఉత్సా హంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, పావురాలు, బెలూన్లు ఎగరవేసి పోటీలను ప్రారంభించారు. అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం సబ్‌డివిజన్లతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది మార్చ్‌పాస్ట్ నిర్వహించగా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధులు ఒత్తిడితో కూడుకున్నవని, మానసిక-శారీరక దృఢత్వం కోసం ప్రతి పోలీస్ అధికారి ప్రతిరోజూ కనీసం 30 నుంచి 40 నిమిషాలు శారీరక వ్యాయామం లేదా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ క్రీడలు ఐపీఎస్ అధికారుల నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సమన్వయాన్ని పెంచుతాయని తెలిపారు. రాబోయే ఏడాదిలో అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్, జిల్లా పోలీస్ కార్యాలయం, ఇండోర్ క్రీడా సముదాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.సిబ్బందిలో ఉత్సాహం నింపేందుకు ఎస్పీ స్వయంగా 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 800 మీటర్ల పరుగు పోటీలో టి.సి.హెచ్. కుమార్ తొలి స్థానం సాధించగా, ఏ. నారం నాయుడు రెండో, వై. నాగరాజు మూడో స్థానాల్లో నిలిచారు. 400 మీటర్ల పోటీలో ఎస్సై వై. తారకేశ్వరరావు మొదటి స్థానం, ఆర్.ఐ. బి. రామకృష్ణారావు రెండో స్థానం, ఆర్.ఐ. ఎల్. మన్మధరావు మూడో స్థానం దక్కించుకున్నారు. విజేతలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవ ప్రసాద్, ఎల్. మోహన్ రావు, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదవుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు సహించం

గాజువాక, ఏప్రిల్ 4,ప్రభాతవార్త



శ్రీకృష్ణుడి రూపంలో సీనియర్ ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేయడాన్ని శ్రీకృష్ణ యాదవ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం గాజువాకలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోటి యాదవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకృష్ణుడి రూపంలో రాజకీయ నాయకుల విగ్రహాలు ప్రతిష్ఠించడంపై గతంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు. యాదవుల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలకు పాలక పక్ష నేతలు సైతం వెనకడుగు వేసినా, ప్రస్తుతం కుట్రపూరితంగా మళ్లీ తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా యాదవుల మధ్యే విభేదాలు సృష్టించి, ఉద్యమాన్ని నీరుగార్చేలా గాజువాకలోని యాదవ కాలనీల్లోనే ఈ విగ్రహాలను ఏర్పాటు చేయాలని చూడటం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ చర్యలను అడ్డుకుంటామని, యాదవ సమాజం ఈ కుట్రలను గమనించాలని ఆయన కోరారు.




## చింతపల్లి నియోజకవర్గం పునరుద్ధరణకు మీడియా పాత్ర కీలకం

- గిరిజన జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ

**గూడెం కొత్తవీధి,ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**



చింతపల్లి నియోజకవర్గం ఏర్పాటు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మీడియా సహకారం ఎంతో అవసరమని గిరిజన జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ అన్నారు. చింతపల్లి నియోజకవర్గం సాధన అంశం రోజురోజుకు బలపడుతూ గ్రామ స్థాయిలో యువత ముందుకు వచ్చి సమావేశాలు నిర్వహిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. వారు నిర్వహిస్తున్న ఈ సమావేశాలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను వాట్సాప్ ద్వారా పంచుకుంటూ ఉద్యమానికి బలం చేకూరుస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో,గ్రామాల్లో చురుకుగా పాల్గొంటున్న యువకుల పేర్లతో పాటు వారి కార్యక్రమాలను వార్తాపత్రికల్లో ప్రచురించగలిగితే,అది వారికి ఎంతో ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు మరింత మంది యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ముఖ్యంగా,చింతపల్లి నియోజకవర్గం ఏర్పాటు సాధ్యమవ్వాలంటే చింతపల్లి,జీ.కే విధి, కొయ్యూరు మండలాల పాత్రికేయులదే కీలక పాత్ర అని మేము నమ్ముతున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే శక్తి మీ కలం ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా పాత్రికేయ మిత్రులు తమ సహకారం అందించి, గ్రామ స్థాయి యువత కృషిని వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా రాజధానిగా అమరావతి

- దీపాలు వెలిగించి సంబరాలు చేసుకొన్న మండలం టీడీపీ అధ్యక్షురాలు సన్యాసమ్మ, పార్టీ నాయకులు

**ముంచంగిపుట్టు ఏప్రిల్ 4, (ప్రభాతవార్త)**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మండల కేంద్రం లో,ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య. ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు దీపాలు వెలిగించి మన రాజధాని. మన అమరావతి అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అమరావతికి దేశ అత్యున్నత వేదికగ పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధతను లభించడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఒకే రాష్ట్రం ఒకే రాజధానిఖి నినాదంతో, అభివృద్ధి వికేంద్రీకరణే ధ్యయంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ లోక్‌సభ లో ఆమోదించినందుకు. పార్లమెంటులో సహకరించిన పార్టీ నాయకులకు, నేతలకు భారత దేశ ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ముంచంగిపుట్టు మండలం టీడీపీ అధ్యక్షులు కిల్లో సన్యాసమ్మ, తో పాటు కార్యదర్శి కొంతేరి జగత్రాయ్, మాజీ మండల అధ్యక్షులు కిల్లో బలరాం, సర్పంచ్ వి లక్ష్మణ్, మండల కోశాధికారి వంతల జగదీష్, సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, టి ఎన్ టి యు అధ్యక్షులు పాంగి హరీష్, కిరసాని కామేష్, బూత్ ఇంచార్జ్ బాబురావు,కిల్లో బిముడు, కిరసాని గిరి, రోతోన్,రోహిణి, రేష్మ తదితరులు పాల్గొన్నారు..

## పాడేరులో 40వ రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీ

- ఎంట్రీలకు 7వ తేదీలోగా చేసుకోవాలి

**పాడేరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

మే,10,11,12 జరగ నున్న పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి రాష్ట్ర స్థాయి జాతర సందర్భంగా పాడేరులో 40వ రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీ. నిర్వహిస్తున్నామని టోర్నీ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ టోర్నీ పాల్గొనే జట్ల నుండి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నారు. విన్నర్స్ జట్టుకు రూ.లక్ష నగదు,షీల్డ్ రన్నర్స్ జట్టు కు రూ. 50వేలు నగదు,షీల్డ్ అందజేయనున్నారు. ఎంట్రీ ఫీజు రూ. 3వేలు చెల్లించాలన్నారు. ఎంట్రీలకు ఈనెల 7వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఆంధ్ర ప్రజల ఆరాధ్య దైవం గిరిజనుల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ తల్లి రాష్ట్రస్థాయి గిరిజన జాతర సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే, ఆలయ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు పాడేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొంటా దుర్గా రావు, మత్స్యరాస ప్రసాద్ రాజు,బాకూరు మహేష్, తాంగుల మహేష్, పిట్టా నరేష్ తెలిపారు.కావునా జాతర సమయ భావం కారణంగా ఈ టోర్నమెంట్ లో కేవలం 48క్రికెట్ జట్లను మాత్రమే ఆహానిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ. 1లక్ష, షిల్డ్, రెండో బహుమతి రూ. 50వేలు షిల్డ్ అందజేస్తామన్నారు. ఈ టోర్నీ లెదర్ పీస్ బాల్ తో నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నిలో పాల్గొనే జట్లు ముందుగానే ఎంట్రీ ఫీజు మొత్తం చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. టీమ్ లు పేర్లు నమోదు చేసుకునేందుకు ఈనెల 7వరకు గడువు ఉందన్నారు. మరిన్ని పూర్తి వివరాల కోసం 8919854104, 8500574489, 9014724691, 9390824178, 9347797008, 8688886845 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ టోర్నమెంట్ ను క్రీడాకారులు, క్రీడాభిమానులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని టోర్నీ నిర్వాహకు కోరారు.

## కంపమానుపాకలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఎం.పీ.టీ.సీ నాగమణి

**గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**



గూడెం కొత్తవీధి మండలం కంపమానుపాకలు గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీకేవీధి ఎంపీటీసీ, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగమణి అన్నారు. శనివారం ఆమె గ్రామంలో పర్యటించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి సిసి రోడ్లు, మరియు మంచి నీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ గ్రామస్తులతో మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ సూచనల మేరకు గ్రామాన్ని సందర్శించటం, సమస్యలను ఇన్చార్జ్ మరియు అధికారుల దృష్టిలో ఉంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## వెలుగుల నీడన అమరావతికి మద్దతు..

- జీకేవీధిలో టీడీపీ శ్రేణుల సంబరాలు

**గూడెం కొత్తవీధి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**



రాజధాని అమరావతి పై పార్లమెంట్ లో చట్టబద్ధత కల్పించడంపై జీకేవిధి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గంటా నళినికృష్ణ ఆధ్వర్యంలో జీకేవీధి లో శనివారం రాత్రి కొవ్వొత్తులతో సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం విభజన తర్వాత రాజధాని అంశాలపై చంద్రబాబు ఆలోచన చేసి ఒక దిశానిర్దేశం చేస్తూ నిర్మాణం ప్రారంభించగా అధికారంలోకి వచ్చిన వైకాపా ఆ నిర్మాణాలకు నిర్లక్ష్యం చేసిందన్నారు. అయితే చంద్రబాబు రాజధాని నిర్మాణం పూర్తి చేసేందుకు వెనకడుగుబేయలేదన్నారు. అందరూ మెచ్చేలా రాజధాని కి చట్టబద్దత కల్పించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ లు కొర్ర రాంబాబు, మొట్టడం రాజబాబు, చక్కా నాగరాజు, కొర్ర సూరిబాబు, కృష్ణా పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆర్‌డిఓ రమణకి వినతి పత్రం

**(రాంబిల్లి ఏప్రిల్ 4 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం జిరాయితీ చింతువా లోవపాలెం గ్రామానికి చెందిన మాజీ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) డైరెక్టర్ గనగల్ల వివేక్ అడ్డరోడ్డు ఆర్డిఓ వివి రమణను రాంబిల్లి తహసిల్దార్ కార్యాలయంలో కలిశారు, ఈ సందర్భంగా ఏపీఐఐసీ వారు తీసుకున్న భూములను 2013 భూ సేకరణ చట్టం అనుసరించి రెవెన్యూ రికార్డులను పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయబద్ధమైన పరిహారం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు, జిరాయితీ చింతువా రెవెన్యూలో అసైన్మెంట్ భూములు, డి పట్టా భూములు, మరియు సాగు హక్కులు కలిగిన భూములు ఉన్నాయని అందులో నివసించిన నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్. చింతువా పంచాయితీలో ఉన్న నాయకులు, నిర్వాసితులు ఉన్నారు.

# భారత్ గ్యాస్ @ 1050

- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు



**అరకు రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ ప్రభావం కారణంగా ఏర్పడిన గ్యాస్ కొరతను గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అరకు లోయకు భారత్ గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించి గోడౌను లేకపోవడంతో వినియోగదారుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. దీనిని ఆసరాగా తీసుకుంటున్న భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అధిక ధరలను వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అరకులోయకు ప్రస్తుతం మైదాన ప్రాంతాలు ఎస్. కోటకు చెందిన శ్రీ లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ, మాడుగులకు చెందిన శ్రీ వెంకట సీతారామ భారత్ గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. గ్యాస్ కొరతతో ఈ రెండు ఏజెన్సీలు సమయపాలన పాటించకుండా తనకు నచ్చిన విధంగా అరకు లోయకు సరఫరా చేస్తుండటమే కాకుండా ఒక డొమెస్టిక్ సిలిండర్ గ్యాస్కు 1050 రూపాయలు వసూలు చేస్తూ, దోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి డొమెస్టిక్ గ్యాస్ సిలిండరు ఆన్లైన్లో బుక్ చేసుకుంటే 920 రూపాయలు చెల్లించాల్సి ఉండగా గ్యాస్ ఏజెన్సీ లో మాత్రం ట్రాన్స్పోర్ట్ పేరుతో 120 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ కొరత తీవ్రంగా ఉండడంతో వినియోగదారులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరను చెల్లించి సిలిండర్లను తీసుకెళ్తున్నారు. కాగా ప్రతిరోజు గ్యాస్ సిలిండర్ల కోసం భారత్ గ్యాస్ వినియోగదారులు బారులు తీరుతున్నారు. గ్యాస్ దోపిడీపై సంబంధిత అధికారులను ఫోన్లో సంప్రదించగా గోడౌను రేటు ప్రకారం మరో 30 రూపాయలు ట్రాన్స్పోర్ట్కు చెల్లిస్తే సరిపోతుందని అలా కాకుండా 1050 రూపాయలు తీసుకుంటే ఆ ఏజెన్సీ లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా మరోవైపు రెండు గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించిన వినియోగదారులు గ్యాస్ సిలిండర్లను ఆన్లైన్లో బుక్ చేసుకుని తీసుకుందామని ఎదురు చూస్తుంటే అదే సమయంలో ముందుగానే డెలివరీ మెసేజ్లు రావడంతో అవాక్కు అవుతున్నారు. గ్యాస్ సిలిండర్లు తీసుకోకుండానే డెలివరీ మెసేజ్ లు రావడంతో ఏం చేయాలో తెలియక గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ఈ రకంగా మైదాన ప్రాంతాలకు చెందిన భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరకు లోయలో భారత్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ ఉండి ఉన్నట్లయితే ఇటువంటి దోపిడీ జరగదని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, పాలకులు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి వినియోగదారులను దోపిడీ చేస్తున్న గ్యాస్ ఏజెన్సీ లపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## హెల్త్ సూపవైజర్ వేధింపులతో ఆరోగ్య కార్యకర్తఆత్మహత్యాయత్నం

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో అత్యవసర చికిత్సలు..
- గిరిజన మహిళా ఉద్యోగిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- యూనియన్ నాయకులు డిమాండ్

**పాడేరు,ఏప్రిల్4, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గర్సింగి సచివాలయం లో ఆరోగ్య కార్యకర్త విధులు నిర్వహిస్తున్న వివాహిత గుజేలి రాజ్యలక్ష్మిపై దేవరాపల్లి పీహెచ్సీ లో పనిచేస్తున్న హెల్త్ సూపవైజర్ పుష్పరాజు వేదింపులకు పాల్పడటంతో వేదింపులకు భరించలేక శుక్రవారం రాత్రి మోతాదుకు మించి మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.భర్త కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా అత్యవసర చికిత్స లు వైద్యులు..సిబ్బంది అందించడంతో ప్రాణాపాయ పరిస్తితి నుంచి ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి బయటపడి ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. గిరిజన మహిళా ఉద్యోగిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి ఎస్టీ ఎట్రాసిటి కేసు నమోదు చేయాలి: అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గర్సింగి సచివాలయం లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్త గుజేలి రాజ్యలక్ష్మిని అక్కడే పని చేస్తున్నా హెల్త్ సూపర్వైజర్ పుష్ప రాజు అనే ఉద్యోగి కులం పేరుతో దూషిస్తూ మానసికంగా, శారీరకంగా, వేధించడంతో తట్టుకోలేని రాజ్యలక్ష్మి శుక్రవారం రాత్రి అందరు నిద్రపోయారని అనుకోని 10 గంటల సమయం లో ఆత్మహత్య ప్రయత్నం చేసింది. వెంటనే గ్రహించిన ఆమె భర్త మరియు కుటుంబం సభ్యులు హుటాహుటిన ఆమెను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు కూడా రాధాకృష్ణ, లింగేరి సుందర్ రావు, శెట్టి నాగరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజ్యలక్ష్మి ను శనివారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలు తన గోడును సంఘాల వారితో చెప్పుకుంటూ నేను పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్ గా పనిచేస్తున్న పుష్పరాజు అనే వ్యక్తి నన్ను వేధింపులకు గురిచేస్తున్నాడని, అసభ్యకరంగా మాట్లాడటం, అసభ్యకరంగా ప్రవర్తించడం బూతు మాటలు ఆడడం, గట్టిగా మాట్లాడితే కొండ దానివి నీకెందుకు ఇక్కడ ఉద్యోగం మీ ఇంటిలో వెళ్లి నువ్వు పని చేసుకుని బ్రతుకు అంటూ కులం పేరుతో దూషిస్తూ ఉద్యోగాలు అవసరం లేదు, మీరు ఉద్యోగాలు చేయలేరు అంటూ తీవ్రమైన పదజాలంతో తోటి ఉద్యోగుల ఎదుట పలుమార్లు అవమానించడం జరిగిందని రాజ్యలక్ష్మి వాపోయింది. ఈ విషయం వైద్యాధికారులకు తెలియజేసిన అతని యొక్క ప్రవర్తనతో భయపడి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, నేను లోకల్ నాకు ఎవరు ఏం చేయలేరు అని అందర్నీ భయపెడుతుంటాడని, అందుకే నాకు అతనివలన హాని ఉందనే భయం, న్యాయం జరగదనే అభిప్రాయనికి వచ్చింది ఆత్మ హత్యకు నాకు నేనుగానే చేసుకున్నానని, బ్రతకాలనీ నాకు లేదని ఆమె నాయకుల ఎదుట బోరున విలపించింది. నాకు న్యాయం జరిగేలాగా, అతనిపై కఠిన చర్యలు తీసుకునే లాగా సహాయం చేయాలని ఆమె నాయకులను విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయం జరిగేలాగా కృషి చేస్తామని ఎస్టీ గిరిజన మహిళా ఉద్యోగిపై అసభ్యకరమైన పదజాలంతో కులం పేరుతో శారీరకంగా మానసికంగా వేధింపులు గురిచేసిన పుష్పరాజును అరెస్టు చేసి ఉద్యోగం నుండి తొలగించే వరకు ఊరుకునేది లేదని ధైర్యంగా ఉండాలని ఆమెకు భరోసా ఇచ్చారు. గిరిజన మహిళా ఉద్యోగిపై కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరంగా మాట్లాడిన పుష్ప రాజు పై ఎస్టీ ఎట్రాసిటి కేసు నమోదు చెయ్యాలని, ఉద్యోగం నుండి తొలగించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని లేనియెడల , గిరిజన సంఘాలతో ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శెట్టి నాగరాజు, కూడా రాధాకృష్ణ, లింగేరి సుందర్ రావు, ఎఐఎస్ఎఫ్ నాయకులు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసిపి శేణులకు దిశ నిర్దేశం..

- దిశా నిర్దేశించిన జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్

**గూడెం కొత్తవీధి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**



మండల కేంద్రం లో జీకే వీధి పంచాయితీ పార్టీ అధ్యక్షులు కొర్ర నూకరాజు అధ్యక్షతన, జీకే వీధి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, గూడెం కొత్తవీధి మండలంలో గల 16 పంచాయితీ ల్లో అత్యధిక సర్పంచులు మరియు ఎం.పీ.టీ.సీ స్థానాలు గెలిపించుకుని పార్టీ అధినేత వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ,మరియు పాడేరు ఎం.ఎల్.ఏ మత్స్యరాస విశ్వేశ్వర రాజు కి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. స్థానిక సంస్థ ల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ప్రతీ కార్యకర్త సిద్ధం గా ఉండాలని, మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పధకాలు గురించి ప్రజలకు వివరించి పార్టీ 2029 సార్వాత్రిక ఎన్నికల్లో మళ్ళీ జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని, కార్యకర్త లే పార్టీ కి పట్టు కొమ్మలని, పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తే పార్టీ ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తుందని, పార్టీ లో ఎవరికీ ఏ కష్టం వచ్చిన తెలియ పరిస్తే ఖచ్చితంగా అందుబాటులో ఉండి సహాయం చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో జీకే వీధి మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఎస్.టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ,మండల యూత్ అధ్యక్షులు కొర్ర బాబి,మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు కొర్ర జాషువా, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కొర్ర రాంబాబు,జీకే వీధి పంచాయితీ పార్టీ అధ్యక్షులు కొర్ర నూకరాజు, జీకే వీధి మాజీ సూపర్ సర్పంచ్ కొర్ర కృపా,సీమన్న, శాంతి రాజు, త్రినాధ్, భగత్, సన్యాసి రావు, గౌతమ్, మరియు పంచాయితీ పరిధిలో గల వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 7న సర్వసభ్య సమావేశం - ఎం.పి.డి.ఓ రమణబాబు

**గూడెం కొత్తవీధి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**



మండలంలోని ఈ నెల 7వ తేదీ మంగళవారం నాడు గూడెం కొత్త వీధి మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పీ.డీ.వో అధ్యక్షతన మండల బాడి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఎం.పీ.డీ.వో రమణబాబు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మాజీ సర్పంచులు ,ఎం.పీ.టీ.సీలు, అధికార ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఎం.పీ.డీ.వో రమణబాబు కోరారు. ఆయన మాట్లాడుతూ తాజాగా సర్పంచ్ పదవి కాలం ముగిసిన సర్పంచులకు సత్కార సభ మరియు నూతనంగా పంచాయతీ ప్రత్యేక అధికారుల పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడండి

- బిఆర్ నాయుడును చైర్మన్ పదవి నుండి తక్షణమే తొలగించాలి
- పాడేరుఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు, మత్స్యరాస విశ్వేశ్వర రాజు

**పాడేరు,ఏప్రిల్ 4, ప్రభాతవార్త**




వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు తిరుమల పవిత్రతను కాపాడే దిశగా టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుని వెంటనే చైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం పాడేరు ఎమ్మెల్యే,వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో మాజీ మంత్రి వర్యులు గాజువాక నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు, వైయస్సార్సీపి నాయకులతో కలిసి ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు శ్రీ.శ్రీ.శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం లాంటి పవిత్రమైన క్షేత్రం పాలక మండలి చైర్మన్ గా ఉండి పరాయి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన బిఆర్ నాయుడుని చైర్మన్ పదవి నుండి తొలగించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనకేసుకు రావడం దారుణమన్నారు. వెంకటేశ్వర స్వామి వారి భక్తులు, ప్రజలంతా బిఆర్ నాయుడు మీద ఎన్ని విమర్శలు చేసినా, ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండటం వ్యతిరేకిస్తున్నా మన్నారు. బిఆర్ నాయుడిని తక్షణమే చైర్మన్ పదవి నుండి తొలగించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ,రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జి మాడుగుల మండల పార్టీ అధ్యక్షులు నుర్మని మత్యకొండం నాయుడు,వైస్ ఎంపీపీలు కుంతురు కనకాలమ్మ, కుడుముల సత్యనారాయణ, మాజీ ఎఎంసి చైర్మన్ లకే రామసత్యవతి, జి.మాడుగుల మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, వివిధ పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## గిరిజనుల గొప్ప నాయకుడు కిడారి - ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**పాడేరు,ఏప్రిల్ 4, ప్రభాతవార్త**





అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలోని కిడారి ఘాట్ వద్ద మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కీ.శే. కిడారి సర్వేశ్వరరావు 54వ జయంతి సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, కీ.శే. కిడారి సర్వేశ్వరరావు గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడని ఆయన కొనియాడారు. గిరిజనుల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేసిన నాయకుడని శ్రావణ్ పేర్కొన్నారు. ప్రజా సేవలో ఉంటూనే ప్రాణాలు కోల్పోయిన ఆయన త్యాగం చిరస్మరణీయమని అన్నారు.కిడారి సర్వేశ్వరరావు ఆశయ సాధన కోసం మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని చైర్మన్ పిలుపునిచ్చారు. ఆయన లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిదని, కానీ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించవచ్చని శ్రావణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు,మాజీ జి సి సి చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, అడికటియ తిరుపతిరావు, మాజీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గూడా సర్పంచ్ జ్ఞానప్రకాష్ సరోజ, రూడకోట సర్పంచ్ సురేష్ కుమార్, ఎంపీటీసీ కొమ్మ రమ, లక్ష్మిపేట సర్పంచ్ లకే అశోక్, గన్నేరుపుట్ సర్పంచ్ కృష్ణరావు, చీకుమద్దుల సర్పంచ్ బొంజన్న దొర, మాజీ ఎంపీపీ ఉమా మహేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ బొంజు బాబు, మండల ప్రధాన కార్యదర్శి సిర్గం సూర్యకాంతం, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు ఆనంద్, కనీస వేతనాల డైరెక్టర్ తుడుము సుబ్బారావు, మాజీ ఎంపీపీ కొర్ర దాన్నేరావు, పి.ఏ.సి.ఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్, సామల బాబూజీ, అరకు పార్లమెంట్ టి.ఎన్.టి.యు.సి ప్రధాన కార్యదర్శి మండ్యాగురు స్వామి, మాజీ సర్పంచులు రామలింగం, వంతల పూర్ణ, వెంకటరావు, సూరిబాబు, టీడీపీ యువ నాయకులు త్రినాధ్ మహేష్, మహేశ్వరి ద్రౌపతి, రమేష్ రామలింగం, అప్పలనాయుడు, మురళి, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి వ్యాపారం చేస్తూ పలు కేసుల్లో ఉన్న నిందితుడు

- ఆస్తులు భవనం..వాహనం సీజ్..ఫ్రీజ్

**పాడేరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం డి. గొందురు పంచాయతీ పాలమామిడిశంఖ గ్రామానికి చెందిన డుంబేరి సతీష్ కుమార్ అనే వ్యక్తి గంజాయి వ్యాపారం చేస్తూ పలుమార్లు పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని పాడేరు డీఎస్పీ అభిషేక్ పేర్కొన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. డుంబేరి సతీష్ కుమార్ పై నాలుగు కేసులు నమోదు అయి ఉన్నాయని అందులో ఒక కేసు పాడేరులో నమోదు అయి ఉందన్నారు. డుంబేరి సతీష్ కుమార్ గంజాయి బిజినెస్ చేస్తూ ఆస్తులు సంపాదించారన్నారు. ఆ సమాచారం పైన పాడేరు పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ దీనబందు ఫైనాన్షియల్ ఇన్విస్టిగేషన్ అతని ఆస్తులపై దర్యాప్తు చేసి గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించడం జరిగిందన్నారు.గంజాయి వ్యాపారి డుంబేరి సతీష్ కుమార్ ఆస్తులు ఒకటి ఒక బిల్డింగు మరియు ఒక ఫోర్ వీలర్ వాహనం ను గంజాయి వ్యాపారం చేస్తూ సంపాదించినట్లు గుర్తించాలన్నారు.దీంతో వాటిని సీజ్..ఫ్రీజ్ చేస్తూ ఆర్డర్స్ ని కాంపిటెంట్ అథారిటీ చెన్నై వారికీ కి పంపించటం జరిగిందనీ డీఎస్పీ అభిషేక్ తెలిపారు. దానిని కాంపిటెంట్ అథారిటీ వారు క్షుణ్ణంగా పరిశీలించి కన్ఫర్మేషన్ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రస్తుతం డుంబేరి సతీష్ కుమార్ ఆస్తులు రూ/ 34 లక్షల 93 వేల 031 రూపాయలను స్లాబ్ హౌస్,ఫోర్ వీలర్ వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందని డీఎస్పీ అభిషేక్ వెల్లడించారు.కావునా ఎవరు ఆ ఆస్తులను కొనుగోలు చేయరాదని డీఎస్పీ స్పష్టం చేసారు.ఇలా ఎవరైనా గంజాయి వ్యాపారం చేస్తున్నా వారి ఆస్తులపై నిఘా ఉంచి వారి ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని డీఎస్పీ అభిషేక్ హెచ్చరించారు.ఈ సమావేశంలో పాడేరు సిఐ పీ.దీనబంధు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్‌కి ఘన వీడ్కోలు

## - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసల జల్లు

**అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):**
అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీగా విశేష సేవలు అందించి, ఎస్పీగా పదోన్నతిపై సీఐడీ కి బదిలీ అయిన ఎం.దేవ ప్రసాద్ కి జిల్లా పోలీసు యంత్రాంగం శనివారం ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేవ ప్రసాద్ తన 37 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో గడించిన అనుభవంతో జిల్లా పోలీసు శాఖకు వెన్నెముకలా నిలిచారని కొనియాడారు. ఆయన వయసుతో సంబంధం లేకుండా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన ఉంటుందన్నారు. ఇది యువ అధికారులకు ఎంతో స్ఫూర్తిదాయకం. ముఖ్యంగా ఎన్.డి.పి.ఎస్ కేసుల దర్యాప్తులో ఆయన చూపిన చొరవ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆయన చూపిన ఆసక్తి అభినందనీయం అని ఎస్పీ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఎంతో ప్రశాంతంగా ఉంటూ సరైన నిర్ణయాలు తీసుకోవడం, క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం



చేయడంలో ఆయన అనుభవం జిల్లాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, ముఖ్యంగా వి.ఐ.పి పర్యటనల సమయంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడంలో ఆయన అందించిన వ్యూహాలు అద్భుతమని ఎస్పీ ప్రశంసించారు. అనంతరం దేవ ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఎస్పీ నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఎస్ఐ స్థాయి నుండి ఎస్పీ స్థాయి వరకు వివిధ హోదాల్లో ఎదుర్కొన్న సవాళ్లను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణలో , డి.పి.ఓ కార్యాలయ పనుల్లో తనకు సహకరించిన ప్రతి అధికారికి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఎస్పీ నేతృత్వంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఇతర అధికారులు కలిసి శ్రీ దేవ ప్రసాద్ ని ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వారి భావి జీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, డీఎస్పీలు ఇ.శ్రీనివాసులు, బి.మోహనరావు, పి.శ్రీనివాసరావు, ఏవో సి.హెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మీ, ఇతర జిల్లా సీఐలు, ఎస్ఐలు డి.పి.ఓ సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖకు దీటుగా అనాకాపల్లి అభివృద్ధి: ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి ఏప్రిల్ 4 ;(ప్రభాతవార్త)**
విశాఖకు దీటుగా వ్యాపారంగంలో అనకాపల్లి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి పట్టణం రావు గోపాల్రావు కళాక్షేత్రం వద్ద నూతనంగా నెలకొల్పిన విజేత సూపర్ మార్కెట్ 152 బ్రాంచ్‌ను ఆయన శనివారం



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి. ఇప్పటి వరకు మనకి డిమార్ట్ అనేది ఒకటి ఉంది. మోర్ అని ఒకటి ఉంది. ఇప్పుడు విజేత అనేటువంటి 152 బ్రాంచెస్ ఈ రాష్ట్రం, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నటువంటి పెద్ద సంస్థ ఇది. ఈ సంస్థ మీకు పబ్లిక్ సెక్టార్ మాల్స్ ని తట్టుకొని నిలబడే 152 చైన్ ఆఫ్ మాల్స్ రన్ చేయడం అనేది చిన్న విషయం కాదన్నారు. ఒక ప్రైవేట్ సెక్టారు పైగా హోరిజన్, మన ఆంధ్ర హరిశ్చంద్రులు అయినటువంటి వ్యక్తులు చేయడం అనేది చాలా గొప్ప విషయం. వారికి అన్ని రకాలుగా ప్రోత్సహించాలి. మరిన్ని బ్రాంచెస్ పెట్టే విధంగా భగవంతుడు వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో మంచి వ్యాపార అభివృద్ధి సాధించుకునే విధంగా వారికి సహకరించాలని కోరుకుంటున్నాను అని యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## గొలుగొండ పాఠశాల 78వ వార్షికోత్సవం

**గొలుగొండ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**




మండల కేంద్రం లో ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలలో 78 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే విధంగా తాము చదువుకునే పాఠశాలకు వార్షికోత్సవం జరిపించడం పూర్వ విద్యార్థులకు ప్రస్తుత విద్యార్థులు రాబోయే విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలవాలని ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పిటిసి సభ్యులు సుర్ల గిరిబాబు, మాజీ ఎంపీపీ కె లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, నాగేశ్వరరావు, జోగంపేట ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, చిరంజీవి,, పి రమేష్, జి శ్రీరామ్ మూర్తి మరియు స్కూల్ కమిటీ చైర్మన్ మణికంత, విద్యార్థుల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు సుబ్బారావు, కే అప్పారావు, రాజబాబు, పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఆటపాటలతో థింసా తో సభ ప్రాంగణం అంతా కోలాహలంగా సందడి చేశారు.

## గెడ్డ పాలెం గ్రామంలో దౌర్జన్యం

**(ఎస్ రాయవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త)**
మండలంలో గెడ్డపాలెం గ్రామంలో దౌర్జన్యం. స్వామిజీకి చెందిన 3.48 ఎకరాల భూమిలోకి దౌర్జన్యంగా దిగిన గ్రామస్తులు. కొవ్వూరు సుబ్బరాజు రామరాజుకు సంబంధించిన జిరాయితీ భూమి. 3.48 ఎకరాల భూమి గ్రామానికి చెందినది అంటున్న తన్నీరు ఎరకయ్య, తన్నీరు సతీష్ ఆయన బ్రతికుండగానే మాకు రాసినవీలు నామా కొవ్వూరు సుబ్బరాజురామరాజు రాసారు అంటూ క్రి




సుబ్బన్న. ఆరోపించారు. కోర్టులో రిట్ ఉండగా భూమిలోకి దౌర్జన్యంగా దిగిన ఎరకయ్య,సతీశ్, అతని అనుచరులు. అడ్డుకోడానికి ప్రయత్నించన సుబ్బన్న కుటుంబం. సభ్యులను సుబ్బన్న కూతురిని ఒక మహిళను కూడా చూడకుండా అతి గోరాతి ఘోరంగా దుర్భాశలు ఆడిన తన్నీరు సతీష్. ఆడారని పోలీసులకు ఫిర్యాదు చేసిన సుబ్బన్న కుటుంబ సభ్యులు ఫిర్యాదును స్వీకరించకుండా ఎరకయ్యకు,సతీష్ మరియు అనుచరులకు కొమ్ము కాస్తున్న పోలీసులు. రాజకీయ అండతోనే ఈ దౌర్జన్యం చేస్తున్నారని అంటున్న సుబ్బన్న కుటుంబం. మాకు న్యాయం జరిగే వరకూ పోరాడతాము. అంటూ దీని విషయంలో ఎంత దూరమైనా మేము వెళ్తామంటూ ఆయన బ్రతికుండగా ఆయన మంచి చెడ్డలు అన్ని దగ్గరుండి నేను చూసుకోవడం జరిగిందంటూ సుబ్బన్న తెలియజేశారు. మేము చేసిన సేవలను గుర్తించి నాకు వారసులు లేని కారణంగా ఈ భూమిని మీరు సాగు చేసుకోండి అంటూ ఆయన వీలునామాను మాకు రాశారంటూ ఆయన రాసిన వీలునామా ను పత్రికా ముఖంగా చూపించడం జరిగింది. దీనికి సంబంధించి 1971 నుంచి మేము భూమిలో సాగులో ఉన్నామంటూ అప్పటినుంచి ఎవరు రాలేని వారు ఇప్పుడు మా మీదకు దౌర్జన్యంగా వచ్చి మమ్మల్ని దుర్భాషల తో వాహనాలతో వచ్చి మమ్మల్ని భయభ్రాంతుల గురిచేస్తున్నారు అంటూ వారు బోరున విలపించారు. దీనిపై చర్యలు తీసుకోవలసిన పోలీసులే మాకు రక్షణగా లేరంటే దీనిపై పై ఉన్న అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు .

## పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**(ఎస్ రాయవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త )**
మండలంలో ధర్మవరం అగ్రహారం సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి వారి వద్ద నుండి 8500,/ నగదు స్వాధీనం చేసుకున్నామని ఏ ఎస్ ఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.ఇద్దరు ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఆయన అన్నారు.

## జబర్ జస్త్ ఫేమ్ హైపర్ ఆదికి ఘనసత్కారం

**అనకాపల్లి, ఏప్రిల్ 4:( ప్రభాత వార్త)**
ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి రాష్ట్ర మహోత్సవాలు 18 రోజు అనకాపల్లి పట్టణంలో స్థానిక ఎన్టీఆర్ మైదానంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కి పర్యవేక్షణలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు . శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జబర్దస్త్ ఫ్రేమ్ హైపర్ ఆది పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు ఈ సందర్భంగా హైపర్ ఆదిని ఎమ్మెల్యే కొణతాల ఘనంగా





సత్కరించారు.హైపర్ ఆది అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంతటి మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఎన్నికల్లో ప్రచారం చేసినప్పుడు జనసేన పార్టీ తరఫున అనకాపల్లి వచ్చానని మళ్లీ ఇప్పుడు రావడం పట్ల చాలా ఉత్సాహంగా ఉందని పేర్కొన్నారు ఎన్నికల్లో వచ్చిన హామీలు అమలు చేసిన ఘనత జనసేన పార్టీకే దక్కుతుందని జబర్దస్త్ ఫ్రమ్ హైపర్ ఆది పేర్కొన్నారు కొణతాల అంటే అభివృద్ధి అభివృద్ధి అంటే కొణతాల అనే పేరులోనే ఉందని హైపర్ ఆది అన్నారు అనంతరం విశాఖపట్నం వారిచే నిర్వహించిన వాళ్ళు సంస్కృత కార్యక్రమాలు చిన్నారుల నృత్య గీతాలు తిలకించి చిన్నారులను అభినందించారు

## నేడు అల్లూరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నిశాంతి

**పాడేరు,ఏప్రిల్4, ప్రభాతవార్త:**



అల్లూరిసీతారామ రాజు జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా ఐ.ఏ.ఎస్. నిశాంతి.టి ఈ నెల5వ తేదీ(ఆదివారం)బాధ్యతలు స్వీకరించనున్నారు. అల్లూరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడానికి శనివారం రాత్రి పాడేరు కొత్త కలెక్టర్ నిశాంతి చేరుకున్నారు. 2017 ఐ ఏ ఎస్ కు చెందిన నిశాంతి.టి.డాక్టర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న టి.నిశాంతి జిల్లా కలెక్టర్ గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా బదిలీ చేసారు. దీంతో కలెక్టర్ గా నేడు బాధ్యతలు చేపట్టనున్నారు.తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లాకు చెందిన టి. నిశాంతి బిటెక్,ఏం.బి ఏ చేసి 2017 లో ఐఏఎస్ సాధించి ప్రకాశం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా శిక్షణ పొంది పెనుగొండ సబ్ కలెక్టర్ గా అనంతపురం నంద్యాల జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ గా అలాగే రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జాయింట్ సెక్రటరీగా చేసి 2024 లో డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ గా పదోన్నతి పొంది నేడు నూతన జిల్లా కలెక్టర్ గా టి.నిశాంతి బాధ్యతలు స్వీకరించనున్నారు.జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ ఎస్ దినేష్ కుమార్ ను ఏపీఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ గా బదిలీ చేయడంతోకల్లేకటే గా రిలీవ్ అయ్యారు.ఏం డి గా దినేష్ కుమార్ ఆదివారం విజయవాడలో బాధ్యతలు చేపట్ట నున్నారు.

## జిల్లాలో నీటిభద్రత సాగునీటి సంఘాల బలోపేతమే లక్ష్యం

### - వంద రోజులు ప్రణాళికలు సిద్ధం చేయాలి
### - జిల్లా ఇంచార్జ్ జేసి, పాడేరు ఐటిడిఏ పివో తిరుమాని శ్రీ పూజ

**పాడేరు,ఏప్రిల్4, ప్రభాతవార్త:**



జిల్లాలో నీటి భద్రత, సాగునీటి సంఘాల బలోపేతమే లక్ష్యంగా అధికారులందరూ 100 రోజుల ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటీడీఏ పీవో తిరుమాని శ్రీ పూజ ఆదేశించారు. శనివారం పాడేరు ఐటిడిఏ పివో కార్యాలయం నుండి అధికారులతో వర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ తేదీ : 06.04.2026 న రాష్ట్ర వ్యాప్తంగా పనులు చేపట్టుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చేతుల మీదుగా నీటి భద్రత, సాగునీటి సంఘాల బలోపేతం, చెరువులను నింపడమే లక్ష్యంగా 100 రోజులు ప్రణాళికలో భాగంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలు సమన్వయంతో పాల్గొని , కార్యక్రమాల అమలు విజయవంతమవుటకు సమన్వయం చేసుకోవాలన్నారు. మొదటి వారంలో 6 రోజులు పనుల ఎంపిక చేయడం , మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా నిధుల సర్దుబాటు, పనులు ఎక్కడ చేపట్టాలనేది 100 రోజుల్లో నిర్ణయించడం, తదుపరి ఐదు రోజుల్లో పనులకు అనుమతులను మంజూరు చేయడం, ఆనంతరం 80 రోజుల్లో పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల జలగణన శాఖ, పశుసంవర్ధక శాఖల ఉమ్మడి భాగస్వామ్యంతో ఈ కార్యక్రమ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విద్యాసాగర్ రావు, జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బిఎస్ నందు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, జిల్లా భూగర్భ జల మరియు జలగణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సేవలు మరువలేనివి..

### - వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మీ సేవలు చాలా అవసరం..
### - పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నందుకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినా..
### - శాసన సభ్యులు వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు

**పాడేరు,ఏప్రిల్ 4, ప్రభాతవార్త**




రాజ్యాంగబద్ధమైన ప్రజలుచేతా ఎన్నుకోబడి ఐదేళ్ల పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు చేసిన సేవలు ఎనలేనివని పాడేరు ఎమ్మెల్యే వైయస్సార్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. పాడేరు నియోజకవర్గం లోని పాడేరు, జి.మడుగుల మండలాలు చెందిన సర్పంచులను ఈరోజు తన క్యాంపు కార్యాలయంలో ఆహ్వానించి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. శాసన సభ్యులు మాట్లాడుతూ ఐదేళ్లపాటు పంచాయితీ సర్పంచులు గా విశేష సేవలందించి. కరోనా కష్టకాలంలో కూడా సర్పంచులు చేసినా సేవలు మరువలేమని అన్నారు. గ్రామ స్థాయిలో వైఎస్ఆర్సీపీ బలోపేతానికి సర్పంచులు ఎంతగానో కృషి చేశారన్నారు. మీ సేవలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని రాబోయే రోజుల్లో భవిష్యత్ లో కూడా మంచి మేలు జరుగుతుందని అన్నారు, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిపిన అందరు కట్టుబడి ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించారని స్పష్టం చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఓటమి భయంతో ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన వైఎస్ఆర్సిపి అభ్యర్థులు గెలవటం ఖాయమని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు గాజువాక నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు గారు,జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జి మాడుగుల మండల పార్టీ అధ్యక్షులు సుర్మని మత్యకొండం నాయుడు,వైస్ ఎంపీపీలు కుంతురు కనకాలమ్మ, కుడుముల సత్యనారాయణ, మాజీ తిలీది చైర్మన్ లకే రామసత్యవతి, జి మాడుగుల మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, మరియు వివిధ పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,




## నూకాంబికను దర్శించుకున్న జబర్దస్త్ ప్రేమ్ హైపర్ ఆది

**అనకాపల్లి ఏప్రిల్ 4 :(ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో కొత్త అమావాస్య రాష్ట్ర జాతర మహోత్సవ లో భాగంగా శనివారం ప్రముఖ సినీనటుడు జబర్దస్త్ ప్రేమ్ హైపర్ ఆది అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల నిర్వహించారు. ఆయనను అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, బి జోగు నాయుడు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగి పై దాడి ఘటన : కేసు నమోదు

**(రాంబిల్లి ఏప్రిల్ 4 ప్రభాతవార్త)**




రాంబిల్లి మండలం గజ రెడ్డిపాలెం గ్రామంలో ప్రభుత్వ పనులను అడ్డుకోవడం మరియు ప్రభుత్వ ఉద్యోగి పై దాడి చేసిన సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు, ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) లో రెన్యు ఫోటో వోల్టాయిక్ (సోలార్ కడ్డీ వేపర్) పరిశ్రమకు ఏపీఐఐసీ వారు కేటాయించిన భూముల్లో పనులు జరుగుతుండగా జిరాయితీ చింతువా పంచాయితీ వెంకయ్య పాలెం గ్రామానికి చెందిన చింతకాయల కాశీ రావు అనే వ్యక్తి ప్రభుత్వ పనులను అడ్డుకొని విధుల్లో ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుడు గాలి పైడి రాజు పై దాడి చేసి అవమానకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు, ఈ ఘటన శుక్రవారం సాయంత్రం సుమారు 5:30 గంటల ప్రాంతంలో జరిగిందని శనివారం స్థానిక తహసిల్దార్ పి. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక సీఐ సిహెచ్. నర్సింగరావు తెలిపారు, ప్రభుత్వ పనులను అడ్డుకోవడం మరియు ఉద్యోగులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు మరియు అధికారులు హెచ్చరించారు.

## వృక్షానికి ప్రాణం పోసిన కొణతాల..

**అనకాపల్లి, ఏప్రిల్ 4:(ప్రభాతవార్త)**
ఈరోజుల్లో చాలామంది మొక్కలు విలువ తెలియక ఎక్కడికక్కడ నరికేస్తున్నారు అలాంటి సమయంలో అనకాపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణకు పోయే చోటులో ఒక వృక్షం నెలకొంది. ఆ వృక్షాన్ని మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రోత్సలంతో అనకాపల్లి కొత్తూరు ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో నాటించారు. ఆయన మాట్లాడుతూ వృక్షాలను పెంచడంతో అనేక ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు.



ఒక వృక్షం ఉంటే చెట్టు కింద చాలామంది నీడనిస్తుందని, అలాంటి వృక్షాలు నరికేయడం పర్యావరణానికి ఆటంకమని పేర్కొన్నారు.

## ఆర్.ఈ.సి.ఎస్. పాలిటెక్నిక్లో ఉచిత పాలీసెట్ శిక్షణా తరగతులు

**కసింకోట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**




పదవ తరగతి పరీక్షలు రాసి, పాలిటెక్నిక్లో అడ్మిషన్ కొరకు పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కాబోతున్న విద్యార్థులకు ఈ నెల 6వ తేదీ అనగా సోమవారం నుండి ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు శిక్షణ ఉంటుంది అని కళాశాల ప్రిన్సిపల్ బి. ఉమాశంకర్ తెలిపారు, హాజరు అయిన విద్యార్థులకు ఉచితం గా స్టడీ మెటీరియల్ కూడా పంపిణి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలియ చేశారు. అనకాపల్లి జిల్లాలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అభిలాషించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపాల్ కె. శివ, విభాగాధిపతులు గణేష్ , రమణ కుమార్, ఆఫీస్ సూపరింటెండెట్ కె. శివరాం లు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలు

**(ఎస్‌రాయవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త)**



తుని నుండి ఎలమంచిలి వైపు వెళ్తున్న ఆటోను అదే మార్గంలో వెళ్తున్న కారు అదుపుతప్పి ఆటో కారు ఢీకొన్నాయి , జాతీయ రహదారి గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఏపి .39/టి.ఎఫ్ 1335 నెంబరు గలఆటో ను ఢీకొన్న కారునుజ్జు నుజ్జు అయిన ఆటో. ఆటో డ్రైవర్ కు స్వల్ప గాయాలు.కాగా దగ్గరలో ఉన్న నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. బట్టల మూటలతో తుని వైపు నుండి ఎలమంచిలి వైపు వెళ్తున్న కొప్పిశెట్టి తాతారావు తండ్రి సత్య రావు వయసు 50 సం. ఉప్మాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గా గుర్తించారు. ఆటో వెనకాల వస్తూ ఢీ కొన్న కారులో హైదరాబాదు నుంచి చోడవరం వెళుతుండగా టీ ఎస్ .08/జే ఎం/43 48 గల కారు ఆటోని ఢీ కొట్టిందని స్థానికులు పేర్కొన్నారు కారులో నలుగురు వ్యక్తుల ప్రయాణం చేస్తుండగా అందులో ఉన్న ఒక మహిళకు స్వల్ప గాయాలు కాగా వీరిని 108 లో నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## 23కేజీల గంజాయి స్వాధీనంఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**మాకవరపాలెం ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



మాకోడ్ పాలెం మండలం పైడిపాల జంక్షన్ వద్ద 23 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు దానికి ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం అయినా స్థానిక విలేకరులకు ఇచ్చిన సమాచారం మేరకు మండలంలోని పైడిపాలి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై గోలి సంచిలో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. తన సిబ్బంది సహకారంతో ఇద్దరు నిందితులను అభివృద్ధి తీసుకొని 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పై తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో నడిపింటి సతీష్( నర్సీపట్నం మండలం నీలంపేటకు), కోలా రామకృష్ణ ( గొలుగొండ మండలం చోద్యం పంచాయతీ) వీరు నుంచి లక్ష 15 వేల విలువ చేసే 23 కేజీలు గంజాయి, పల్సర్ బైకు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై,తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు : ఎమ్మెల్యే అశోక్



కవిటి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : సీఎంఆర్ఎఫ్‌తో పేద రోగులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శనివారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు సుమారు 13 లక్షల రూపాయల చెక్కులను పేద రోగులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పేదలందరికీ ఆరోగ్య సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పొందల కృష్ణారావు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి పుల్లట సంతోష్‌తో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**క్రీడాకారులకు భరోసాగా నిలిచిన ప్రభుత్వ విప్**

క్రీడాకారులకు భరోసాగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ నిలుస్తున్నారు. త్వరలో శ్రీలంకలో క్రీడల్లో పాల్గొంటున్న అంతర్జాతీయ క్రీడాకారుడు దేవేంద్రకు ఆర్థికలేమి వెంటాడు తుందని తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ దేవేంద్రకు ఆర్థిక సహకారం అందించి భరోసా నిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు మాజీ సర్పంచ్ ఆరంగి మధు, తెలుగుదేశం నాయకులు బెందాళం తిరుమలరావు, వజ్జ రంగారావు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కంచిలి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం 3,23,614 రూపాయల చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అశోక్ బాబు చేతుల మీదుగా క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. శాసనం గ్రామానికి చెందిన గోరకల జస్వంత్ 57,125, ఆముదాలపుట్టుగ కుమారి సాహు 41,084, కత్తివరం జాయ్ శాంతమూర్తి 33,192, కొక్కిలిపుట్టుగ నిరంజన్ బిసై 23,400, గొల్లపుట్టుగ బంగారు హైమావతికి 22,000 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహాయాలు అందజేసే ప్రభుత్వమన్నారు. బంగారు కురయ్య, బొడ్డ హరిబాబు, పైల రామారావు, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



పాతపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: విద్యార్థుల భద్రత, వసతుల కల్పనలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను హెచ్చరించారు. శనివారం పాతపట్నం మండలంలో పర్యటించిన ఆయన ఇటీవల ఏడవ తరగతి విద్యార్థిని పూజిత మెట్లపై నుండి జారిపడి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పర్యటించిన కలెక్టర్ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని, మెట్లను, టెర్రస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థిని ఎక్కడ పడిపోయింది? ఎలా పడిపోయింది? అన్న విషయాలపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు ఆరా తీశారు. విద్యార్థులపై సరైన నిఘా లేకపోవడం వల్లే ఇటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ ప్రిన్సిపాల్ పద్మావతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా మెట్ల వద్ద మెష్ లేదా ప్రత్యామ్నాయ రక్షణ ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## రహదారుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నిమ్మక



సీతంపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రహదారులను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రారంభోత్సవం చేశారు. సీతంపేట మండలం హడ్డుబంగి తారు రోడ్ నుండి సోమగండి గ్రామానికి 60 లక్షల రూపాయలతో చేపట్టే రహదారి పనులు ప్రారంభోత్సవం చేయగా నౌగాడా గ్రామానికి 80 లక్షలు రూపాయలతో మంజూరైన బిటి రోడ్డును ప్రారంభోత్సవం చేసారు. సీతంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం సమీపంలో ప్రయాణికులు సౌకర్యార్థం కీ.శే గొర్లె సుభద్రమ్మ కీ.శే శాసపు చిన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఇమరక పవన్ ఆర్థిక సహాయంతో నూతన బస్ షెల్టర్‌ను నిర్మించారు. దీనిని ప్రారంభోత్సవం చేసి ప్రయాణికులకు ప్రజలకు ఎమ్మెల్యే అంకితం చేశారు. కార్యక్రమంలో ఇమరక పవన్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణరావు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింధుజ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వేశారు.. మట్టి తీయడం మరిచారు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: సంతబొమ్మాళి ప్రధాన రహదారిపై ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించకపోవడంతో దుమ్మురేగుతుంది. రహదారి నిర్మాణం జరిగి దాదాపు మూడు నెలలు పూర్తి అవుతున్నా సిమెంట్ రోడ్డు కూలింగ్ కోసం వేసిన మట్టి గుత్తేదారుడు తొలగించలేదు. దీనితో ఆటోలు బస్సులు, టిప్పర్లు తిరుగుతుంటే దుమ్ము రేగి వెనుక వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మట్టి తీయించండని పలు మార్లు చెప్పిన రోడ్డు కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సంతబొమ్మాళి-కోటబొమ్మాళి రహదారి గ్రామ పరిసరాలలో కొన్ని చోట్ల సిమ్మెంట్ రోడ్డు నిర్మించారు. సంతబొమ్మాళి, పోలీస్ స్టేషన్ ముందు, తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నుంచి గ్రామ సచివాలయం వరకు అలాగే కాలింగ వీధి జంక్షన్ నుంచి ప్రైవేట్ పాఠశాల వరకు సిమ్మెంట్ రహదారి వేశారు. మిగతా చోట్ల తారు రోడ్డు వేశారు. అయితే పోలీస్ స్టేషన్ ముందు, తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు సిమ్మెంట్ రోడ్డుపై మట్టిని పూర్తిగా తొలగించి మిగతా చోట్ల వదిలేసారు. సిమ్మెంట్ రోడ్డు వేసిన ఈ దుమ్ము ధూళి సమస్య ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపించాలని గ్రామస్తులు, వాహనాలు చోదకులు కోరుతున్నారు.

## కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: స్థానిక రామిరెడ్డి పెట్రోల్ బంక్ దగ్గరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ అతి వేగంతో బైకును ఢీకొనగా బైక్ పై ఉన్న కవిటికి చెందిన వ్యక్తి ఉమాకాంత బెహరా అనే అతనికి తలకు, కాలుకు బలమైన గాయాలయ్యాయి. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం జాయిన్ చేసారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అట్టహాసంగా రాములోరి ఊరేగింపు

కంచిలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : స్థానిక సోంపేట రైల్వే స్టేషన్ ఆవరణలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగియ దంతో కమిటీ సభ్యులు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపులో శ్రీరామ భక్తులు కంచిలి పంచాయతీ ప్రజలు గ్రామస్తులు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాలకొండలో మంత్రి నారాయణ పర్యటన

సీతంపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రి పి.నారాయణ ఆదివారం పాలకొండ రానున్నారు. మన్యం జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం 9:30 గంటలకు పాలకొండ చేరుకొని 12:30 గంటల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం పార్వతీపురం వెళ్ళనున్నారు. దీనికి సంబంధించి కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## కాలం చెల్లిన వస్తువులు అమ్మితే కఠిన చర్యలు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : దుకాణాల్లో కాలం చెల్లిన వస్తువులు, శీతల పానీయాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కే.ఫణీంద్ర కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శనివారం మండల కేంద్రంలోని పలు డైరీ షాపులు, ఫ్రూట్స్, స్వీట్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్, బాదం మిల్క్, మజ్జిగ వంటి డైరీ ఉత్పత్తుల అమ్మకూడదని ఆయన షాపు యజ మానులను హెచ్చరించారు. అలాగే స్థానికంగా ఎటువంటి బ్రాండ్ పేరు గడువు తేదీలు ముద్రించని బాదం మిల్క్ ఇతర ఉత్పత్తులు విక్రయించరా దన్నారు. అనంతరం డాక్టర్ రుషి బ్రాండ్ ప్లాంట్‌ను సందర్శించి రికార్డులు, తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి చింతడ సన్యాసిరావు, సిబ్బంది ఉన్నారు.

## చాపరలో ద్విచక్ర వాహనం చోరీ

మెళియాపుట్టి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : చాపర గ్రామ పంచాయతీకి చెందిన కిల్లంశెట్టి జగదీశ్వరరావు ద్విచక్ర వాహనం శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలు చోరీకి ప్రయత్నిస్తున్న ఒక సిసి ఫుటేజీ వెలుగులోకి వచ్చింది.

## ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సీతంపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉపాధి కూలీల పని వేతనాలు పెంచాలని పని ప్రదేశంలో త్రాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి దావల రామారావు. భాస్కరరావు, శ్రీరాములు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మెమోరాండాన్ని అందజేశారు.

## వైసీపీ నాయకుల పరామర్శ



సంతబొమ్మాళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: తాళ్లవలస పంచాయతీ చిల్లపేటలో ఇటవల అనారోగ్యంతో మరణించిన శంకర్ వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర జాయింట్ కార్య దర్శి కెళ్ళి జగన్నాయకులు (గోవింద్) శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శంకర్ మరణానికి సంబంధించి వివరాలు అడిగి వారిని ఓదార్చారు. పరామర్శలో గోవింద్‌తో పాటు ఎంపీపీ ప్రతినిధి మెరుగు అప్పారావు, దండుగోపాలపురం సర్పంచ్ ప్రతినిధి మార్పు నాఘభూషణ్, టెక్కలి విద్యార్ది విభాగం అధ్యక్షులు నక్కిట్ల నరేష్, ఆర్‌టిఐ అధ్యక్షులు ముద్దపు ఆనందరావు, బాలక రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా టార్చ్ బేరర్స్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం



పాతపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ, విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టార్చ్ బేరర్స్ సర్టిఫికేట్లు పంపిణీ కార్యక్రమం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. విద్యార్థులలో కేవలం చదువు మాత్రమే కాకుండా, అన్నిరంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో విద్యా ప్రతిభ, అందమైన చేతిరాత, సంపూర్ణ హాజరు, పుస్తకాల నిర్వహణ, క్రమశిక్షణ తదితర విభాగాల్లో సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా విలేజ్ సర్వేయర్ ఎం.రుక్వేంద్ర హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి గుర్తింపులు విద్యార్థులలో మరింత ఉత్సాహాన్ని, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. గురువుల మార్గనిర్దేశంలో విద్యార్థులు ఉన్నత విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామయ్యపేటకు రహదారి



కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : మండలం కురుడు పంచాయతీ రామయ్యపేట గ్రామానికి రూ.1.20 కోట్లుతో కిలోమీటరు మేర సీసీ రహదారి వేశారు. గతంలో రోడ్డు మరమ్మతులకు గురి కాగా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల కూటమి ప్రభుత్వంలో గ్రామానికి రోడ్డు వేయటంతో గ్రామస్తులంతా అనందం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వీరంతా కతజ్ఞతలు తెలిపారు. కురుడు శివాలయం దగ్గర నుంచి రామయ్యపేట గ్రామం శివరి వరకు ఈ సదుపాయం కలిగింది. అటు టెక్కలి వైపు వెళ్ళాలి అనుకున్న ద్విచక్ర వాహనదారులకు చలమయ్యపేట వరకు సుమారు 6 కిలోమీటర్లు తగ్గుతుంది.

## పంచాయతీల ప్రత్యేక అధికారులు వీరే..

కోటబొమ్మాళి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : పంచాయతీల సర్పంచ్ పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలు జరిగేంత వరకు ప్రత్యేక అధికారులు నియమించింది. దుప్పిలపాడు, జర్జంగి, కొత్తపేట, కురుడు పంచాయతీలకు తహసీల్దార్ సీహెచ్.ప్రసాధరావును, చిన్నబమ్మిడి, తర్లిపేటకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ టి.గౌతమి, సౌడాం, రామేశ్వరానికి పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్‌ను, దంత, హరిశ్చంద్రపురం, మాసాహెబ్‌పేట, నారాయణవలస పంచాయతీలకు పంచాయతీ రాజ్ ఏఈ కె.అంజిత్ కుమార్‌ను, కస్తురిపాడు, సరియాబొడ్డపాడు, శ్రీజగన్నాథపురం, ఎత్తురాళ్ళపాడుకు మండలపరిషత్ ఏవో కె.నారాయణరావుకు, జీయన్నపేట, కోటబొమ్మాళి, లఖందిడ్డి, యలమంచిలిలకు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌ను, కిష్టపురం, వాంద్రాడకు ఏయుపీఐయు ఎల్.సౌజన్యకు, చిన్నసాన, సరియాపల్లికు పశువైద్యాధికారి ప్రజ్ఞచైతన్యను, పెద్దబమ్మిడి, కన్నేవలస, రేగులపాడులకు సీడీపీవో ఎస్. హైమావతి, గంగరాం, నిమ్మాడ, తిలారు పంచాయతీలకు ఆరఅండ్‌బి ఏఈ పి.హరినాధరావు, నీలం పేట, తర్లిపేట, విశ్వనాథపురంకు వ్యవసాయశాఖ ఏవో ఎస్.గోవిందరావు, పట్టుపురం, చీపుర్లపాడుకు సీఎస్‌డీటి టి. రామచంద్ర, అక్కయ్యవలస, చిట్టేవలస, కొత్తపల్లిలకు డిప్యూటి ఎంపీడీవో టి.వి.లీలారాజును పంచాయతీ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి.

## రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



సంతకవిటి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: గారన్నాయుడుపేట చిత్తారపురం పంచాయతీ టీడీపీ నాయులు రాకోటి సత్యమూర్తి అధ్వర్యంలో హెచ్‌డిటి ఆర్.మధు, ఆర్ఎస్‌డిటి జి.జయబాబు, వీఆర్వో అన్నారావు, పంచాయతీ మాజీ సర్పంచ్ బూరాడ సూర్యనారాయణ, గారన్నాయుడుపేట టీడీపీ నాయకులతో కలిసి రాకోటి సత్యమూర్తి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో లోలుగు లక్షున్నాయుడు పంచాయతీ నాయకులు గారన్నాయుడుపేట గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే



పాతపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : వేసవి కాలం దృష్ట్యా నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్డబ్లుఎస్) , ఐదు మండలాల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న నీటి కొరత పరిస్థితులపై అధికారులతో ఆయన సమగ్రంగా చర్చించారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రతి పాదికన పరిష్కరించాలని సూచించారు. వేసవి తీవ్రత పెరగకముందే ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా పైపులైన్ల లీకేజీలు లేదా బోర్ల మరమ్మతులు ఉంటే వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ఆర్డబ్లుఎస్ అధికారులు, మండల స్థాయి అధికారులు, తెదెపా నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఏకలవ్య పాఠశాల ఎంట్రెన్స్ పరీక్ష



సీతంపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 5, 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. గురుకుల పాఠశాల సీతంపేట, బాలికలు గురుకుల పాఠశాల సీతంపేట బాలురు. గురుకుల పాఠశాల పెద్దమడి బాలురు పరీక్ష కేంద్రంలో ఏకలవ్య ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతి ప్రవేశానికి 262 మంది గాను 48 మంది పరీక్షకు గైర్హాజరు కాగా ఆరో తరగతి ప్రవేశానికి 459 గాను 34 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాలు నిర్వహణలో వాసుదేవ ప్రిన్సిపాల్ సూర్య కుమారి జగత్ జ్యోతి పరిశీలించారు.

## సచివాలయాల పనితీరుపై కలెక్టర్ ఆరా



పాతపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా అందాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శనివారం పాతపట్నం పర్యటనలో భాగంగా ఆయన పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని సచివాలయం 1ను ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయంలోకి ప్రవేశించిన వెంటనే సిబ్బంది హాజరు పట్టీని స్వాధీనం చేసుకున్న కలెక్టర్, ఉద్యోగుల హాజరును స్వయంగా పరిశీలించారు. కొందరు సిబ్బంది ఫీల్డ్ డ్యూటీలో ఉన్నట్లు తెలుసుకున్న ఆయన, వారి కదలికను ధ్రువీకరించేందుకు మూమెంట్ రిజిస్టర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయానికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ వినూత్నంగా స్పందించారు. ఇటీవల పి జి ఆర్ ఎస్ ద్వారా పరిష్కరించబడిన రెండు దరఖాస్తులను యాదృచ్ఛికంగా ఎంచుకుని, నేరుగా ఆ దరఖాస్తుదారులకు ఫోన్ చేశారు. వారికి అందిన సేవల నాణ్యత, సిబ్బంది స్పందనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



కంచిలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : కంచిలి మండలం అర్జునాపురం ఎంపీపీ పాఠశాల వార్షిక పరీక్షలు సందర్భంగా కొత్త ప్రవేశాలు కోసం తల్లిదండ్రులు సమావేశ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ 2 కుంబి చిట్టిబాబు పరీక్షలు, ప్రవేశాలు, వేసవి సెలవులలో విద్యార్థులపై శ్రద్ధ, జాగ్రత్తగా ఉండండని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీఆర్ నాయుడును టీటీడీ ఛైర్మన్‌గా కొనసాగించడం సరికాదు



మెళియాపుట్టి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : మెళియాపుట్టిలో వైసిపి ఎక్స్ఎమ్మెల్యే రెడ్డి శాంతి ర్యాలీ ముందుగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్ నాయుడు మహిళలపై అసభ్య కరమైన పదజాలాలు వాడడం వీడియోలు వంటి మహిళలను ఇబ్బంది పెట్టేవిగా ఉండడం అతనిని మళ్లీ టీటీడీ ఛైర్మన్‌గా కొనసాగించడం సరికాదని అతనిని వెంటనే ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని దేవుని ప్రార్థిస్తూ అక్కడ నుండి ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీగా వైయస్సార్ విగ్రహం దగ్గరకు వచ్చి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం బిఆర్ నాయుడుని ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త): కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారులకు ఆనందం కలుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీలో కొత్తగా మంజూరైన 38 పింఛన్లను శనివారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. నియోజవర్గం అభివృద్ధి తన ధ్యేయమన్నారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, రాష్ట్ర కాలింగా కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, తమ్మినేని సుజాత, నూకరాజు, సిమ్మ మాధవి, తమ్మినేని అమర్నాథ్, కూన ఆంజనేయులు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, కమిషనర్ టి.రవి, ఎంపీడీవో సీపాన రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ నాయుడును పదివి నుంచి తప్పించాలి



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతకు మాయని మచ్చల తయారైన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డిఆధ్వర్యంలో స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, మాజీ వైస్ ఛైర్‌పర్సన్ భారతిదివ్య, కంచిలి మండలం జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, సోంపేట జడ్పీటీసీ ప్రతినిధి తడక జోగారావు, ఆశి పురుషోత్తం, మాజీ డీసీఎంఎస్ ప్రతినిధి చల్ల దేవరాజు, ఇచ్ఛాపురం మండలం ఎంపీపీ బోర పుష్ప, కవిటి మండల పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్, ఇచ్ఛాపురం మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, పిలక దేవరాజు, రౌతు విశ్వనాథం, నీలయ్య, ఆశి కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రాజాం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : రాజాం పట్టణంలో మల్లికార్జున కాలనీలో అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ బంగారమ్మ పరిశీలించారు. శనివారం ఆమె కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, కేంద్రంలో ఉన్న సరుకులను, ప్రీ స్కూల్‌కు పిల్లలు హాజరు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో బాలింతలో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రీస్కూల్ పిల్లలను రోజువారి హోంవర్కులు ఆటపాటలతో కూడిన బోధన సాగించాలని కార్యకర్త ఎం.శ్రీదేవికి సూచించారు. కార్యకర, ఆయా రవణమ్మ ఉన్నారు.

## గొట్టిపల్లిలో ఉచిత వైద్యపరీక్షలు



కొత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మండల పరిధిలోని గొట్టిపల్లి గ్రామ పంచాయతీలో ఆదివాసీ గిరిజన సంఘం, పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పేద ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిమ్స్ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ గోవిందరావు నేతృత్వంలోని వైద్యబృందం ఈ శిబిరంలో పాల్గొని రోగులకు క్షుణ్ణంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.మోహనరావు, కిమ్స్ పి.ఆర్.ఓ మనోజ్, ప్రజా సంఘాల నాయకులు ఎస్.ప్రసాద్, పి.కృష్ణ, పి. రమేష్, ఐలు నాయకులు ఎం.అప్పారావు పాల్గొన్నారు. గిరిజన సంఘం నాయకులు జయరాజు, సుంకయ్యతో పాటు ఆరోగ్య కార్యకర్తలు రమణమ్మ, పార్వతి, బుడిమి, తదితరులు పాల్గొని రోగులకు సేవలందించారు.

## హెూటళ్లల్లో గడువు ముగిసిన నిల్వ పదార్థాలు



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని అన్ని టిఫిన్, హోటల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో వివిధ షాప్‌ల నుంచి గడువు ముగిసిన 2 కీలోల పచ్చళ్ళు, 6 లీ.ల కూల్ డ్రింక్‌లను, 2 లీ. బాదం పాలను, అరకేజీ అప్పడాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసారు. ఈ సందర్భంగా ప్రజలు ఆహారపదార్థాల వస్తువులు కొనే ముందు గడువు తేదీని తప్పనిసరిగా చూసి కొనుగోలు చేయాలని కోరారు. తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

## అనధికార సైలెన్సర్లు వాడితే కఠిన చర్యలు తప్పవు



రాజాం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: రాజాం పోలీస్ స్టేషన్ పరిధిలో బుల్లెట్ ద్విచక్ర వాహనాలకు వాడే కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లు తొలగించి వాటి స్థానంలో అనధికారికంగా వాడుతున్న 16 సైలెన్సర్లను స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద పట్టణ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా ఇటువంటి సైలెన్సర్లను వాడి పట్టుపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిఐ మిగతా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుత్తుమలో పశువైద్యశిబిరం



కంచిలి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: కుత్తుమ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మద్దిల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మెగా ఉచిత పశువైద్య శిభిరం జరిగింది. ఈ సందర్భంగా పశువులకు టీకాలు, మందులు పంపిణీ జరిగినది. ఎఎంసి కార్యదర్శి వాణి ప్రసన్న, సర్పంచ్ సనపల కామేశ్వరరావు, మద్దిల నాగేశ్వరరావు, వెటర్నీ ఏడీ అప్పలస్వామి పశు వైద్యాదికారిణి శిరీష , ఎఎంసి డైరెక్టర్స్ మల్లా బాబురావు, బెల్లాన సుమన్, కొత్తపల్లి లక్ష్మి నాగరాజు, రేవతి, మన్మధరావు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్లేస్మెంట్ సక్సెస్ డే 2026



రాజాం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : జీఎంఆర్ ఐటీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ కెరీర్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ సక్సెస్ డే- 2026ను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా గూగుల్ సంస్థ, బెంగుళూర్‌లో మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి.సౌమ్య విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె తన ప్రసంగంలో కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ భవిష్యత్ ఉద్యోగాలపై ప్రభావాన్ని చూపుతున్నదని, ఏఐ ఉద్యోగాలను తగ్గించడం కాదు, వాటి స్వభావాన్ని మార్చుతూ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా సృష్టికర్తలుగా ఎదగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. వైస్ చాన్సలర్ డా. జె.గిరీష్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, గణితం వంటి మౌలిక అంశాలలో పట్టు సాధించడంతో పాటు సమస్య పరిష్కరణ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. నిరంతర అభ్యాసం, మార్పులకు అనుగుణంగా ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొ న్నారు. రిజిస్ట్రార్ డా. ఎం.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ, పరిశ్రమలతో బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై దృష్టి పెట్టిందని, విద్యార్థులను వారి వృత్తి జీవితంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధం చేస్తూ, భవిష్యత్ పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమకు అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపట్టుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# చెలి

## వేసవిలో చల్ల చల్లగా..

ఎండల్లో మనందరికీ చప్పున గుర్తొచ్చేది కూల్‌డ్రింక్. కానీ అవి ఆరోగ్యానికి అంత మంచివి కావని నిపుణులు చెబుతుండటం తెలిసిందే. అందువల్ల వాటి జోలికి వెళ్లకపోవడం మంచిది. నిజానికి శీతల పానీయాలు ఇంట్లోనే చేసుకోవచ్చు. వీటిల్లో ఏవైనా ప్రయత్నించి చూడండి.



### యాపిల్ ..

**కావలసినవి :** యాపిల్స్-18, పంచదార-పావు కిలో, దాల్చిన చెక్కపొడి- పావు చెంచా

**తయారీ :** యాపిల్స్‌ను కడిగి, గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. చెక్కు తీయనవసరం లేదు. అందులో అరలీటరు నీళ్ల పోసి.. సన్న సెగ మీద 20 నుంచి 25 నిమిషాలు ఉడికించాలి. ఈ రసాన్ని వడకట్టి, పంచదార, దాల్చినచెక్క జతచేసి మరో ఐదు నిమిషాలు తెర్లించాలి. చల్లారాక ఫ్రిజ్‌లో ఉంచి, తాగేటప్పుడు పల్చన చేసుకుంటే సరిపోతుంది.

### నారింజ...



**కావలసినవి :** నారింజపండ్లు-20, పంచదార- మూడు కప్పులు.

**తయారీ :** నారింజపండ్ల తొక్క, గింజలూ కూడా తీసేయాలి. తొనలను గ్రైండ్ చేసి రసాన్ని వడకట్టాలి. నాలుగు కప్పుల నీళ్లలో పంచదార వేసి మరిగించాలి. అందులో నారింజ రసం వేసి ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి చల్లారనివ్వాలి. దీన్ని గాలి చొరబడని సీసాలో పోసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. ఒక వంతు పానీయానికి రెండొంతులు నీళ్లు, రెండు మూడు ఐస్ క్యూబ్స్ జోడించి, చల్లని నారింజరసాన్ని ఆస్వాదించండి.

### పుచ్చకాయ

**కావలసినవి :** పుచ్చకాయ- ఒకటి, పంచదార-2 కప్పులు, నిమ్మరసం-2 స్పూన్లు , యాపిల్ గుజ్జు-అర కప్పు, రేగుపండ్లు - పావు కప్పు.



**తయారీ :** పచ్చకాయను సగానికి కోసి విత్తనాలు తీసేసి స్పూన్‌తో ఎర్రటి గుజ్జును తీయాలి. రేగుపండ్లు కడిగి, గింజలుర తీసేయాలి. వీటికి యాపిల్ గుజ్జు చేర్చాలి. ఈ మూడు రకాల పండ్లనూ మందపాటి గిన్నెలో వేసి, మునిగే వరకూ నీళ్లు పోయాలి. అందులో పంచదార వేసి.. సన్నసెగ మీద సుమారు పావు గంట సేపు ఉడికించాలి. చల్లారిన తర్వాత నిమ్మరసం కలిపి, ఫ్రిజ్‌లో భద్రం చేసుకోవాలి. ఒక వంతుకు మూడొంతుల నీళ్లు కలిపి తియ్యతియ్యగా ఆస్వాదించండి.

### మామిడి



**కావలసినవి :** మామిడిపండ్లు పెద్దవి-6, పంచదార-రెండు కప్పు, నిమ్మరసం-రెండు చెంచాలు

**తయారీ :** మామిడిపండ్లు చెక్కు తీసి ముక్కలు కోసి, గ్రైండ్ చేయాలి. మందపాటి గిన్నెలో 4 కప్పుల నీళ్లు. పంచదార వేసి.. సన్నసెగ మీద తెర్లించి, దించేయాలి. చల్లారిన తర్వాత మామిడిపండ్ల గుజ్జు, నిమ్మరసం వేసి కలపాలి. ఈ చిక్కటి రసాన్ని శుభ్రమైన సీసాలో పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. గ్లాసులో ఒక వంతు పానీయానికి మూడొంతుల నీళ్లు కలిపి తాగితే.. ఏ కూల్‌డ్రింకూ సాటిరాదనిపిస్తుంది.

### ద్రాక్ష

**కావలసినవి :** గింజల్లేని నల్ల ద్రాక్షపండ్లు-14 కప్పులు, పంచదార-కప్పున్నర

**తయారీ :** నల్ల ద్రాక్షపండ్లను కడిగి, రెండు కప్పుల నీళ్లు పోసి సన్న సెగ మీద సుమారు అర గంట సేపు ఉడికించాలి. చల్లారాక వడకట్టి, ఒక రోజంతా ఫ్రిజ్‌లో ఉంచాలి. బయటకు తీసి పంచదార కలిపి పది నిమిషాలు ఉడికించాలి. కాస్త చిక్కబడ్డాక దించేయాలి. చల్లారిన తర్వాత తడి లేని, గాలి చొరబడని సీసాల్లో నింపి ఫ్రిజ్‌లో ఉంచితే ఎప్పటికప్పుడు పల్చన చేసుకుని తాగొచ్చు.



## రవి కిరణాల్ని ఒడిసిపట్టి ఇంధనంగా..

**సూర్యుణ్ణి చూస్తే ఏమనిపిస్తుంది... చలికాలంలో హాయిగా, వేసవిలో చిరగ్గా... అంతేగా! ఆమెకు మాత్రం ఆ రవి కిరణాల్ని ఒడిసిపట్టి ఇంధనంగా మార్చాలనిపిస్తుంది... అనంత సౌరశక్తిని దేశ ప్రగతికి చోదకశక్తిగా మళ్లించాలని. మిత్రులతో కలిసి 'సన్ వర్క్స్ ఎనర్జీ'ని అందుకే. రాజ్యలక్ష్మి కోల, ఆంత్రప్రెన్యూర్గా తన జర్నీని తెలుసుకుందాం..**



తాతయ్య రఘు వెంకయ్య, నానమ్మ రాజ్యలక్ష్మి ... ఇద్దరూ ప్రఖ్యాత వైద్యులు, ప్రొఫెసర్లు, తిరుపతి దగ్గర్లోని ఓ పల్లె నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. నాన్న రవీంద్రనాథ్ బిజినెస్మేన్, అమ్మ కనకదుర్గ గృహిణి నేను పుట్టి హైదరాబాద్ లోనే, భారతీయ విద్యా భవన్ స్కూల్లో చదువుకున్నా. ఐఐటీ మద్రాస్ నుంచి 2007లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. ఇంటర్న్ ఐటీసీలో ఓ పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేశా అది ఈ రంగంలోనే కొనసాగాలనుకుంటున్న తర్వాత అమెరికాలోని వర్జీనియా టెక్ యూనివర్సిటీ నుంచి కన్ స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ ఎం.ఎస్. చేశా. తిరిగొచ్చి ఎస్ఈడబ్ల్యూ ఇన్ ఫ్రా సంస్థలో చేరి...విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాల్లో భాగమవుతూనే ఉంది. నేర్చుకున్నా దేశంలో పుష్కలంగా లభించే సౌరశక్తిని ఇంధనంగా మార్చాలనే లక్ష్యంతో ఎలియోస్ సోలార్‌లో చేరిన ప్రాజెక్టు మేనేజర్‌గా సైట్‌కు వెళ్లి పనులను పర్యవేక్షించడం. ఆ అనుభవంతో సొంత సంస్థ పెట్టాలనుకున్నా. అర్జున్ స్కూల్లో క్లాస్మేట్, సందీప్ ఐఐటీలో సీనియర్... వాళ్లూ ఆ సంస్థలోనే పనిచేసేవారు. ముగ్గురం 2015లో సన్ వర్క్స్ ఎనర్జీని స్థాపించాం. కంపెనీ పెడుతున్నా అనగానే మా మేనత్త నిర్మల రూ.5లక్షలు చెక్ రాసిచ్చి.. వాళ్లింటిమీద సోలార్ ప్యానల్స్ పెట్టమన్నారు. తర్వాత రెండు గృహ నిర్మాణ సంస్థల నుంచి 20కెవి. 100కెవి ప్రాజెక్టులు వచ్చాయి. ఆపై అమరరాజా బ్యాటరీస్ తిరుపతిలో పట్టిన 1 మెగా వాట్ ప్రాజెక్టుకు డిజైనింగ్, టెక్నికల్ అంశాల్లో కన్సల్టెన్సీ సేవలు అందించాం.

**నాలుగేళ్లకే లాభాలు...** తర్వాత చిన్నా పెద్ద ప్రాజెక్టులెన్నో చేసుకుంటూ వచ్చాం. ఆ ప్రయాణంలో ఒడుదొడుకుల్ని ఎదుర్కొన్నాం. కేంద్రం స్మార్ట్ సిటీ ప్రాజెక్టు తెచ్చినప్పుడు తిరుపతి కార్పొరేషన్ స్కూళ్లు, ప్రభుత్వ స్థలాలు, రిజర్వాయర్లపైన సోలార్ ప్యానెల్స్‌కు డిజైన్లు ఇచ్చాం. ఆ ప్రాజెక్టుకు అవార్డులు వచ్చాయి. నేను చదివిన స్కూల్లో సోలార్ ప్రాజెక్టునీ చేపట్టాం. పీఎం కుసుమ్‌యోజనలో భాగంగా తాజాగా కర్ణాటక, మహారాష్ట్రల్లో రైతుల కోసం కొన్ని ప్రాజెక్టులు చేశాం. సూర్యఘర్లో భాగమవుతూ మన్యం పార్వతీపురం జిల్లాలో పనిచేస్తున్నాం. భారీ సోలార్ ప్రాజెక్టులకూ డిజైన్ సర్వీసెస్ కన్సల్టెన్సీ సేవలు అందిస్తాం. బ్యాటరీ, పవన విద్యుత్ రంగాల్లో అడుగు పెట్టాలనేది మా ఆలోచన కొవిడ్ తర్వాత దేశంలో ఇంధన స్వయం ప్రతిపత్తి దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. 15 ఏళ్లలో జరిగిన మార్పుల్ని, రానున్న మూడేళ్లలో తీసుకురావాలనేది ప్రభుత్వ ప్రయత్నం. ఆ దిశగా పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఇప్పటికీ మనం పెద్దమొత్తంలో ఆయిల్, గ్యాస్, బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాం. పూర్తిగా పునరుత్పాదక ఇంధనం వాడాలంటే విద్యుచ్ఛక్తిని బ్యాటరీల్లో నిల్వ చేయాలి. ఇది ఖరీదైన ప్రక్రియ. ఇప్పుడిప్పుడే మన దగ్గర సోలార్ సెల్స్, ప్యానెల్స్, బ్యాటరీల తయారీ ఊపందుకుంటున్నాయి. పదేళ్లలో లక్ష్యాన్ని చేరుకుంటాం. అప్పటిదాకా మాత్రం హైబ్రిడ్ విధానం మేలు. □

## హ్యాపీ 'ఈస్టర్'

'ఆదివారమున తెల్లవారుచుండగా (ఆ స్త్రీలు) తాము సిద్ధపరచిన సుగంధ ద్రవ్యములను తీసికొని సమాధి యొద్దకు వచ్చి! సమాధిముందర ఉండిన రాయి దొరలింపబడియుండుట చూచి లోపలికి వెళ్లిరి గాని! ప్రభువైన యేసు దేహము వారికి కనబడలేదు.. సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదుకుచున్నారు? ఆయన ఇక్కడలేడు, ఆయన లేచియున్నాడు..'(లూకా 24:1,6). 'గుడ్‌ఫ్రైడే' నాడు యేసుక్రీస్తు సిలువలో సర్వమానవాళి పాపం కోసం మరణిస్తే, మూడవరోజు ఆదివారం ఆయన సమాధిలో నుంచి మృత్యుంజయుడిగా లేచాడు. ఇదే ప్రపంచ క్రైస్తవులకు గొప్ప నిరీక్షణ. యేసుక్రీస్తు మరణించకముందే తాను మరణిస్తానని, మూడవ రోజు తిరిగి లేస్తానని



చెప్పారు. ఆయన పుట్టుకముందు అనేక వందల సంవత్సరాలక్రితమే ఆయన జన్మ, మరణ, భూస్థాపం గురించి ప్రవక్తలు, భక్తులు తమ గ్రంథాల్లో లిఖించారు. 'యేసు పునరుత్థానమును జీవమును నేనే, నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును' (యోహాను 11:25). ప్రభువు తాను ఇంకా మరణించకముందే తానే జీవం, పునరుత్థానమని చెప్పారు. కాబట్టి గుడ్‌ఫ్రైడే నాడు ప్రభువు మరణించాడని అదొక సంతాపసభగా దుఃఖపడాల్సిన అవసరం లేదు, పునరుత్థానం (ఈస్టర్)నాడు తిరిగి లేచాడని ఆర్భాటంతో ఉత్సవాలు జరుపుకోవడం కాదుకానీ, ఆయన త్యాగాన్ని గుర్తించి, తమ కోసమే ప్రభువు మరణించాడని, తిరిగి లేచాడని గ్రహించి, ఆయనను క్షమాపణ వేడుకుని, సొంత రక్షకుడిగా అంగీకరించడమే నిజమైన ఈస్టర్ ఆనందాన్ని అనుభవిస్తారు. లేకపోతే ప్రతిసంవత్సరం పండుగలు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ మనలో ఎలాంటి మార్పు లేకపోతే మనకోసం నిత్య నరకాగ్ని కాచుకుని ఉందనే సత్యాన్ని తెలుసుకుని, మారుమనసు పొందడమే ప్రభువు మననుంచి కోరుతున్నాడు.

**-పి.వాణిపుష్ప**

అంతర్వాణి

## వేడి నీటి స్నానంతో లాభం..

ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా స్నానం చేయడం దాదాపు అందరికీ అలవాటు. కొందరు వేడి నీటితో, మరికొందరు చల్లటి నీటితో స్నానం చేస్తారు. కానీ వేడి నీటి ( మరీ వేడి నీళ్ల కాదు) స్నానంతో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాస్తవానికి సీజన్ ఏదైనా వామ్ వాటర్‌తో స్నానంతో శరీరం, మనస్సు సేద తీరుతాయి. మరివేడి నీటి స్నానంతో ఇంకా ఎలాంటి ప్రయోజనాలు న్నాయో తెలుసుకుందాం.. చలికాలంలో వేడి స్నానం చేయడం కామన్. కానీ వేసవిలో కూడా వేడి నీటి స్నానం చేయడం ఆరోగ్యానికి మంచిదే. అన్ని సీజన్లలో వేడి స్నానం చేయడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. అయితే గుండెజబ్బులు, అధిక బిపి ఉన్న వారు కొంచెం అప్రమత్తంగా ఉండాలి.

**కండరాల ఒత్తిడిని తగ్గిస్తుంది...** రోజంతా పనిచేసి అలిసిపోయిన శరీరానికి కండరాలకు వేడి నీటి స్నానం హాయినిస్తుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల కండరాలు, కీళ్లకు ఉపశమనం కలుగుతుంది.

**ఒత్తిడిని తగ్గంచడంలో సహాయపడుతుంది...** ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి చాలా కామన్ అయి పోయింది. అందువల్ల, మనస్సు ప్రశాంతంతం, పూర్తిగా రిలాక్స్‌గా ఉండాలంటే వేడి స్నానం ఉత్తమం. ఇందులో ఎప్సమ్ లవణాలు, మంచి సువాసన గల నూనెలు కూడా ఉపయోగించ వచ్చు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. పేరుకుపోయిన మురికి, శరీరం శుభ్రపడి, బ్యాక్టీరియా వ్యాప్తిని నిరోధిస్తుంది.

**చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తుంది..** అందరికీ ఆరోగ్యకరమైన చర్మాన్నే కోరుకుంటారు. ఇందుకోసం కొంతమంది సౌందర్య సాధనాలు



ఆశ్రయిస్తారు. కానీ, రోజువారీ వేడి స్నానంలో రహస్యాన్ని మర్చిపోకూడదు. వేడినీరు చర్మాన్ని హైడ్రేట్ చేసి, చర్మ కణాలలో ఆక్సిజన్ ప్రవాహాన్ని ప్రేరేపిస్తుంది. ఫలితంగా మృదువైన స్కిన్ సొంతమవుతుంది ఏర్పడుతుంది. □

## పరీక్ష హాల్‌లో..

పరీక్షల సమయంలో ఎప్పటికప్పుడు సమయం చాలా తక్కువగా ఉన్నట్లే అనిపిస్తుంది. ఎవరికైనా అది సహజమే! అందుకే ఒక ఆన్సర్ తర్వాత మరొక ఆన్సర్ వేగంగా రాసుకుంటూ వెళుతుంటారు. ఒక రకంగా అది అవసరం కూడా! కాకపోతే, ఈ క్రమంలో మనసు ఎంతో కొంత ఉద్వేగానికి లోనవుతూ ఉంటుంది. అందువల్ల.. ఒక ఆన్సర్ రాయడం పూర్తయిన తర్వాత ఒకటి రెండు నిమిసాలు ఖాళీగా రిలాక్స్ కావడం అవసరం. అలా ఖాళీగా ఉండడం వల్ల రెండు నిమిషాల సమయం వృథా అవుతుంది కదా అనిపించవచ్చు. కానీ, అలా ఓ రెండు నిమిషాలు ఆగి ఆలోచించడం వల్ల పదింతల లాభం కలుగుతుంది. మౌనంగా ఉండే ఆ రెండు నిమిషాలు మనసు పూర్తిగా స్తబ్ధంగా ఉంటుందనేమీ కాదు. ఆ తర్వాత రాయబోయే ప్రశ్నను పరిశీలిస్తూ ఉంటుంది. ఆన్సర్‌లోని అంశాల గురించి మనసు ఆలోచించుకుంది. ఆలోచనా క్రమంలో ఏదైనా తేడా



ఉంటే సరిచేసుకుంటుంది. ఆ ఒకటి రెండు నిమిషాల విరామం వల్ల కలిగే మరో ప్రయోజనం కూడా ఉంది. అదేమిటంటే, అంత బాగా రాయలేని వాటిని స్పష్టంగా గుర్తించి, బాగా రాయగలిగే వాటిని ఎంచుకోవడం ఆ విరామంలో సాధ్యమవుతుంది. ఆన్సర్‌కూ ఆన్సర్‌కూ మధ్య తీసుకునే ఆ స్వల్ప విరామం వల్ల మనసు తేలిక పడుతుంది. ఆ తర్వాత రాయబోయే ఆన్సర్‌ను మరింత ప్రభావవంతంగా రాసే శక్తి కలుగుతుంది. వీలైతే, ఆ విరామ సమయంలో బలంగా శ్వాస తీసుకుని వదిలితే మరింత మంచిది. అలా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, పరీక్షల్ని మరింత ఉత్సాహంగా రాయగలిగే మనోబలం ఏర్పడుతుంది. □

# తెర

## 'రణబాలి' అనంతపూర్‌లో షెడ్యూల్ కంప్లీట్



'రణబాలి' మూవీ అనంతపూర్ షెడ్యూల్ కంప్లీట్, సీమ వాసుల అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన హీరో విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీ "రణబాలి". ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. "రణబాలి" సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. తాజాగా ఈ సినిమా అనంతపూర్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. అనంతపూర్ లో షూటింగ్ సందర్భంగా అక్కడి స్థానికులు, రౌడీ ఫ్యాన్స్ విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంట మీద ఎంతో ప్రేమాభిమానాలు చూపించారు. అభిమానులు బైక్ ర్యాలీలతో విజయ్ పట్ల ప్రేమను చాటుకున్నారు. విజయ్ దేవరకొండ తన రాయలసీమ అభిమానులను ఫ్యాన్స్ మీట్ లో కలుసుకున్నారు. రాయలసీమకు ఎప్పుడు షూటింగ్‌కు వచ్చినా తన సొంతూరుకు వచ్చినట్లు అనిపిస్తుందని, తనలోపల సీమ ఫీల్ ఉందని విజయ్ దేవరకొండ అన్నారు. ఇలా ఎన్నో ఎమోషనల్ మూవ్ మెంట్స్ తో "రణబాలి" అనంతపూర్ షెడ్యూల్ పూర్తయ్యింది.

## 'ది లెజెండ్ ఆఫ్ హనుమాన్' భక్తి, వినోదం చిత్రం



హనుమాన్ జయంతి సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికత, విజువల్ గ్రాండ్యూర్‌తో కూడిన ఉత్తమ వినోదాన్ని అందించే యానిమేటెడ్ సిరీస్ కోసం చూస్తున్న ప్రేక్షకులకు ది లెజెండ్ ఆఫ్ హనుమాన్ ఒక అద్భుతమైన కథగా నిలుస్తోంది. గ్రాఫిక్ ఇండియా నిర్మాణంలో, శరద్ దేవరాజన్ మరియు జీవన్. జె కాంగ్ సృష్టించిన ఈ సిరీస్, భారతీయ ఇతిహాసాల్లో ఒక ముఖ్యమైన పాత్ర అయిన హనుమాన్ మహిమను ఆధునిక యానిమేషన్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. ఆరు సీజన్లుగా ఈ సిరీస్ హనుమంతుడి బాల్యం నుండి ప్రారంభమై, తన దివ్య శక్తులను మరిచిపోయిన స్థితి నుంచి మళ్లీ అవగాహన పొందే ప్రయాణాన్ని హృదయానికి హత్తుకునేలా చూపిస్తుంది. ఈ ప్రయాణం తర్వాత ఆయన రాముడు తో కలసి ధర్మం కోసం చేసే యుద్ధంలో కీలక పాత్ర పోషించడం, లంక యుద్ధం వంటి మహత్తర ఘట్టాలు సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ప్రత్యేకంగా సంజీవని కోసం హనుమంతుడు చేసిన ప్రస్థానం, లక్ష్మణుని రక్షించేందుకు చూపిన ధైర్యం, భక్తి - ఇవన్నీ ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. కథలో ప్రతి దశలో భావోద్వేగం, యాక్షన్, ఆధ్యాత్మికత సమపాళ్లలో కలిసి ఉంటాయి. హనుమంతుడి ఆత్మసాక్షాత్కారం, తన దివ్య శక్తులను గుర్తించుకునే ప్రయాణం అత్యంత ప్రభావవంతంగా చిత్రీకరించబడిది. ప్రతి సీజన్‌తో కథ మరింత ఉత్కంఠభరితంగా, విస్తృతంగా మారుతుంది.

## 'వీరభద్రుడు' మే 14న వరల్డ్ వైడ్ రిలీజ్



సూర్య, ఆర్‌జె బాలాజీ, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ మాగ్నమ్ ఓపస్ కరుప్పు తెలుగు టైటిల్ 'వీరభద్రుడు' మే 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ శికరుప్పుఖి కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ భారీ అంచనాలని సృష్టించింది. తాజాగా ఈ చిత్రానికి తెలుగులో వీరభద్రుడు అనే టైటిల్ పెట్టారు. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

## 'రాయవలస' ఫస్ట్ లుక్‌ను విడుదల



RAYSUN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై గోపీ కృష్ణ నిర్మాణంలో, రాధిక జయంతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాయవలస" సినిమా నుంచి నవ యువ కథానాయకుడు కార్తిక్ జయంతి ఇంటెన్స్ ఫస్ట్ లుక్ రిలీజ్. RAYSUN తమ తొలి చిత్రమైన "రాయవలస" ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఊరి జీవితం, నిజ సంఘటనల ఆధారంగా మనసును తాకే కథతో వస్తున్న ఈ చిత్రం తెలుగు సినీ రంగంలో ఓ తొలి ప్రయత్నంగా నిలుస్తోంది. గోపీ కృష్ణ జె నిర్మించిన ఈ సినిమా, కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆయన విజన్‌కు నిదర్శనం. డెబ్యూ ప్రొడ్యూసర్ అయినప్పటికీ, గోపీ కృష్ణ తన నిబద్ధత, ప్రణాళికా సామర్థం, మరియు కట్టుబాటుతో మొత్తం ప్రొడక్షన్‌ను సజావుగా నడిపారు. అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ మహిళా దర్శకురాలు రాధిక , చిన్న గ్రామీణ కథలు, ఊరి జీవితం, మనుషుల మధ్య భావోద్వేగాలను ప్రతిబింబించే కథను తెచ్చే లక్ష్యంతో భారతదేశానికి వచ్చి సినిమా తీర్చిదిద్దారు.

## 'బైకర్' బంపర్ బ్లాక్ బస్టర్



'బైకర్'కు బంపర్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్స్. తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునే సినిమా బైకర్. ఇది నా బెస్ట్ ఫిల్మ్: చార్మింగ్ స్టార్ శర్వా. చార్మింగ్ స్టార్ శర్వా లేటెస్ట్ బంపర్ బ్లాక్ బస్టర్ బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక బ్యానర్ గీజు క్రియేషన్స్ నిర్మాణంలో భారతదేశపు మొట్టమొదటి కంప్లీట్ మోటో క్రాస్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రీమియర్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. . చార్మింగ్ స్టార్ శర్వా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ముందుగా ప్రభాస్ అన్నకి థాంక్స్ చెప్పాలి. మా ట్రైలర్ రిలీజ్ కి ట్వీట్ వేశారు. అలాగే సినిమా రిలీజ్‌కు ముందు ఒక చిన్న యాడ్ చేసి సపోర్ట్ ఇచ్చారు. సీనియర్ హీరో రాజశేఖర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడం, మంచి పేరు తెచ్చుకోవడానికి ఒక ముఖ్య కారణం డైరెక్టర్ అభిలాష్ రెడ్డి గారు. ఆయన ఈ సినిమాను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్ది ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. జీవిత రాజశేఖర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బైకర్ సినిమాతో నేను డే వన్ నుంచే ట్రావెల్ అవుతున్నాను. ఈ టీమ్ మొత్తం పడిన ప్రతి కష్టం నేను దగ్గరగా చూసాను. సంపత్ నంది మాట్లాడుతూ.."బైకర్" ప్రీమియర్స్ చూసినప్పటి నుంచి బైక్ సౌండ్ ఇంకా చెవుల్లో మోగుతూనే ఉంది. హీరోయిన్ మాళవిక నాయర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ మూమెంట్ చాలా ఎమోషనల్‌గా ఉంది. సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా గౌరవంగా ఫీల్ అవుతున్నాను. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సినిమా ప్రీమియర్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ తర్వాత అది మరింత పెరిగింది.

## 10న 'డైమండ్ డెకాయిట్ 'మూవీ విడుదల



టాలీవుడ్ తెరపైకి ఎమోషనల్ రివెంజ్ డ్రామా హీరో పార్థ గోపాల్ స్వీయనిర్మాణంలో సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుంది: డైరెక్టర్ సూర్య జి. యాదవ్ తెలుగు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌కు తెర లేపుతూ, పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి. యాదవ్ రూపొందిస్తున్న మూవీ"డైమండ్ డెకాయిట్" (దీ।తిలీవీవిదీ దీతిదిపీ।గి). ఈ సినిమా చిత్ర ట్రైలర్‌ను ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ ట్రైలర్‌ను వీక్షించిన స్పీకర్ చిత్రయూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వాకడ అప్పారావు, శివాజీరాజా, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత శిరీష్ రెడ్డి ఈ టీమ్ మంచి కంటెంట్‌తో వచ్చారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుంది," అని తెలిపారు.

## 'కామాఖ్య' 'సఖీ' సాంగ్ రిలీజ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వం లో రూపొందు తున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీ నాథ్, యశ్వంత్‌రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ కామాఖ్య మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఫస్ట్ సింగిల్ సఖీ పాటని రిలీజ్ చేశారు. ట్యాలెంటెడ్ కంప్జర్ జ్యానీ ఈ పాటని ఎప్పటికీ నిలిచిపోయే ఫ్రెండ్షిఫ్ సాంగ్‌గా స్వరపరిచారు. అనంత శ్రీరాం రాసిన లిరిక్స్ మనసుని హత్తుకునేలా వున్నాయి. లక్ష్మీ మేఘన వాయిస్ పాటకు మరింత మాధుర్యాన్ని జోడించింది. లిరికల్ వీడియో ఆకట్టుకునే భావోద్వేగా లను, మ్యూజికల్ ట్రీట్ ని అందిస్తుంది. ఈ చిత్రానికి రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీ, వరప్రసాద్ ఎడిటర్.

5vzm15:5vzm15.qxd 04-04-2026 23:20 Page 1



## రామతులసి రైస్ మిల్లుపై విజిలెన్స్ తనిఖీలు



గరివిడి ఏప్రిల్,4 ప్రభాత వార్త : అర్థమూరు కోనూరు గ్రామాల సరిహద్దులో గల సూర్యనారాయణకి చెందిన రామ తులసి నాగమణి అనే రైస్ మిల్లుని జిల్లా విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలతో పాటు పలు అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఆపై , జిల్లా కలెక్టర్‌కి పిర్యాదు అందిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లా విజిలెన్స్ అధికారి, పౌర సంబంధాల శాఖ డెప్యూటీ కలెక్టర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో నలుగురు పౌర సంబంధాల ఉప తహశీల్దార్‌లతో కలసి మిల్లుని తనిఖీలు చేపట్టారు. మిల్లు సిబ్బందికి తనిఖీ అధికారులు పలు ప్రశ్నలు వేశారు. అన్ని విభాగా ల్లోను క్షుణ్ణంగా పరిశీలించారు. తూనిక యంత్రాలు పరిశీలించి, స్టాక్ పాయింట్ లను పరిశోధించారు. తనిఖీలో ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోలేదని, అలాగే పి డి ఎస్ బియ్యం నిల్వలు లేవని విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో వెల్లడైంది. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ కలెక్టర్ అరుణ కుమారి ప్రభాత వార్తతో మాట్లాడుతూ మిల్లు ని తనిఖీ చేశామని ఎటువంటి అక్రమ బియ్యం నిల్వలు లేవన్నారు. జిల్లా కలెక్టర్‌కి నివేదిక సమర్పిస్తామని ఆమె పేర్కొన్నారు. కాగా ఇదే మిల్లు పై గతంలో పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో కొందరు కలెక్టర్‌కి పిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారులు మిల్లు తనిఖీ ల్లో గరివిడి ఆర్ఐ అచ్చుత రావు కూడా పాల్గొన్నారు.

## బీఆర్ నాయుడును వెంటనే తొలగించండి : కడుబండి



శృంగవరపుకోట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : తితిదే ఛైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ముందుగా ఎస్.కోట దేవి గుడిలో దుర్గాదేవి అమ్మవారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా ఉన్న బి.ఆర్.నాయుడు అనైతిక కార్యకలాపాలు ఆయన ఉపయోగిస్తున్న భాష తిరుమల పవిత్రతను రోజురోజుకీ దిగజార్చుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఏమి లేనట్లుగా వ్యవహరిస్తూ తిరుమలలో కార్యక్రమాలు నిర్వహించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల పవిత్రతను కాపాడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోరపల్లి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రవికుమార్, జడ్పీటీసీ ఎం. వెంకటలక్ష్మి, మండలపార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యన్నారాయణ, ఎం. జగన్నాథం, నియోజకవర్గం పంచాయితీ రాజ్ అధ్యక్షుడు కూనిరెడ్డి వెంకటరావు, మాజీ ఫోక్ కల్చురల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాల పంపిణీపై ఎమ్మెల్సీ ఫైర్




శృంగవరపుకోట, ఏప్రిల్4, ప్రభాతవార్త.. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఫైర్ అయ్యారు. శనివారం మండలంలోని పెదఖండేపల్లిలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మీభూమి మీహక్కు అనే కార్యక్రమం పెట్టి రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వలన ప్రభుత్వానికి అనవసరంగా చెడ్డపేరు వస్తోందని ఎమ్మెల్సీ ఆరోపించారు. పీఓటి పేరుతో ఇటు రెవెన్యూ అటు పోలీస్ అధికారులు మాపై దౌర్జన్యం చేస్తున్నారని పలువురు రైతులు ఎమ్మెల్సీకు పిర్యాదు చేసారు. ఫిర్యాదు వివరాలను పరిశీలిస్తే పెదకండేపల్లిలో రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న సుమారు 74.15 ఎకరాల భూమిని 2008లో జిందాల్ కంపెనీకి అక్రమంగా రిజిస్టర్ చేయడంపై ఎమ్మెల్సీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భూమిపై రైతులు సాగులో ఉన్నప్పటికీ వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఈప్రక్రియ జరగడం అన్యాయమని ఎమ్మెల్సీ తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న సాగు రశీదులను ఇంటి పన్నులను పట్టాలను ఎమ్మెల్సీకి చూపించారు. రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈవిషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళతానని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనువాసరావు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాణి, సర్పంచ్ యాళ్ళ రమణ, ఎంపీటీసీ దేవుడు రైతులు పాల్గొన్నారు.

## టీటీడీ ఛైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి : మాజీ ఎమ్మెల్యే



నెల్లిమర్ల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భ్రష్టు పట్టించిన ఛైర్మన్ బిఆర్. నాయుడును తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి వి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) డిమాండ్ చేశారు. తిరుమలలో ఛైర్మన్ నాయుడు రాసలీలలపై వచ్చిన వీడియోలను దృష్టిలో పెట్టుకొని వైసీపీ ఆధ్వర్యంలో మండలంలోని మొయిద గ్రామంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత ఆ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్ల కార్డులు ప్రదర్శించి నిరసన నినాదాలు ఇచ్చారు. మొయిదలోని డాక్టర్ సురేష్ బాబు స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సురేష్ బాబుతో కలిసి బడ్డుకొండ మాట్లాడారు. ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబుతో పాటు పార్టీ నాయకులు, జెడ్.పి.టి.సి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారికి వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

## కస్పా గదబవలసలో..



కురుపాం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : కస్పా గదబవలసలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సన్నిధిలో మొదటిగా మాజి ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శతృచర్ల పరీక్షత్ రాజ్ శనివారం పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవికి బిఆర్ నాయుడు అపవిత్రం చేశారంటూ కనుక వెంటనే అతనిని తొలగించాలని ప్లే కార్డులను పట్టుకొని వైసిపి శ్రేణులు నిరసన తెలియజేశారు. అనంతరం మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షత్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పక్క ఆధారా లతో బయటకు వచ్చినప్పటికీ ముఖ్యమంత్రి ఆయనను వెనుక వేసుకుని రావడము సిగ్గుచేటని విమర్శించారు.

## మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్



రామభద్రపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : మండలంలో మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజురఫీజాన్ హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మైనింగ్, పోలీసు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా జేసీబీ, ట్రాక్టర్లతో విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. చెరువుల్లో మట్టిని ఎక్కువగా తరలించడం వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిపై విఆర్వోలు ఎందకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో ప్రతీరోజూ ఈ మట్టి తవ్వకాలు ఎక్కువవుతున్నాయని, వీటిని నియంత్రించాల్సి న అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మైనింగ్ శాఖ, పోలీసు శాఖాధికారులు వీటిపై దాడులు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూములు ఆక్రమణలు చేసేవారిపై కూడా చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో పోలీసు, మైనింగ్ శాఖాధికారులు పాల్గొన్నారు.

## చెరువును ధారాదత్తం చేయొద్దు



లక్కవరపుకోట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: మండలంలోని రెల్లిగవిరమ్మపేట వద్దనున్న మా మహమాయ ఇండస్ట్రీస్ పరిశ్రమకు ఎలినేషన్ పేరుతో మల్లివీడు రెవిన్యూ పరిధిలో గల జమ్మాదేవిపేట గ్రామంలోని సర్వే నంబర్ 212లో గల సుమారు 12ఎకరాల (ప్రభుత్వ చెరువు) చవిటి చెరువును అధికారులు దారాదత్తం చేయొద్దంటూ జమ్మాదేవిపేట గ్రామ రైతులు వేడుకుంటున్నారు. శనివారం తమ గ్రామంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.రామసుందర్ రెడ్డి వస్తారు.. అనే ప్రచారంతో రైతులు ప్రస్తుత తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్ణయించారు. ఇటీవల ఇక్కడ మా మహమాయ పరిశ్రమ యాజమాన్యం దౌర్జన్యంగా ప్రభుత్వచెరువు కబ్జాకు పాల్పడ్డ అంశంతో పాటూ ఎలినేషన్ పేరుతో సుమారు 12 ఎకరాల చవిటి చెరువు (ప్రభుత్వ చెరువు)ను పరిశ్రమకు ఇవ్వొద్దని.. ఏ విధమైన రైతుల ఆమోదం లేకుండానే.. రెవిన్యూ యంత్రాంగం చెబుతున్నట్లు ఎలినేషన్ ప్రోసెస్ ఏమైనా ఉంటే తక్షణమే నిలిపివేయాలని, ఈ అంశంపై ఇప్పటికే గ్రామ పంచాయతీలో రైతులంతా ఏకమై వ్యతిరేకించామని, ఈ 12ఎకరాల ప్రభుత్వచెరువు నుంచే దిగువన మరో 2 చెరువులకు జలాధారమని.. సుమారు 200 ఎకరాల పంట భూములకు సాగునీరందించే నీటి వనరులను కాపాడాల్సి న భాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రభుత్వ చెరువును పరిరక్షించాలని లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్ కు విన్నవించేందుకు రైతులు సుధీర్ఘ సమయం గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద నిరీక్షించారు. కలెక్టర్ ఆ ప్రయివేటు కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ లో తమ సమస్యపై లేఖను సమర్పిస్తామని రైతులు స్పష్టం చేశారు.

## ప్రైవేట్ స్కూల్ యాజమన్యాంపై తల్లిదండ్రుల ఆగ్రహం

బొండపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మండలంలోని గోడ సింగిపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తిరుపట్ల పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థులు బస్సు ఫీజులు బకాయిలు ఉన్నాయని ఆ కారణంగా విద్యార్థులను ఎండలో నిలబెట్టినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

## బీఆర్ నాయుడును తక్షణమే పదవి నుంచి తొలగించాలి



బొబ్బిలి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న బిఆర్ నాయుడు వెంటనే ఆ పదవి నుంచి తప్పించి నైతిక విలువలు ఉన్న వ్యక్తిని ఛైర్మన్గా చేయాలని బొబ్బిలి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ఎస్ వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో నియోజకవర్గ మాజీ ప్రజా ప్రతినిధులతో కార్యకర్తలతో ముందుగా స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించి టిటిడి ఛైర్మన్ పదవి నుంచి పవిత్రతను కాపాడుకున్న వ్యక్తిని నియమించాలని ఉన్న బిఆర్ నాయుడు తొలగించాలని దేవునికి అర్చన చేయించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ఛైర్మన్‌గా కల్తీ నెయ్యి, తదితర అంశాలపై ఆ ప్రభుత్వమే అనేక అవకతవకలకు పాల్పడి చేస్తున్న వ్యక్తికి టీటీడీ పదవి ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచిది కాదని అన్నారు. ఈయనపై ఎంత అవకతవకలు ఉన్న కనీసం చంద్రబాబు నాయుడు పట్టించుకోకుండా ఆయన వెనకేస్తూ సస్పెండ్ చేయకుండా ఆయన వెంట తిప్పుకుంటారని ఇది ఎంతవరకు సమంజసం అని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని వీటిని పరిశీలనలో తీసుకొని ఛైర్మన్ తొలగించి ఉన్నత భావాలు ఉన్న వ్యక్తిని ఛైర్మన్గా నియమిస్తే మంచిదని వారు ఆరోపించారు. మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో మేమంతా గుడులు గోపురాల వద్దకు వెళ్లి టీటీడీ ఛైర్మన్ పై మాద్దైన శైలిలో నిరసన తెలియజేస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ వేణుగోపాల్ నాయుడు. తెలుగు మండలాలకు చెందిన సర్పంచులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ ఇంటికి గోపాలరావు. సావు వెంకట మురళీకృష్ణ రావు. తమ్మిరెడ్డి దామోదర్‌రావు పాల్గొన్నారు.

## గరివిడిలో వైసీపీ నేతల భారీ ర్యాలీ




గరివిడి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుని తక్షణమే పదవినుంచి తొలగించి, తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ గరివిడిలో వైకాపా నాయకులు భారీ ర్యాలీ చేశారు. బి ఆర్ నాయుడు చేష్టలతో తిరుమల పవిత్రత కు తీవ్ర భంగం వాటిల్లిందని నిరశన కారులైన వైఎస్ఆర్‌సిపి నేతలు మండిపడ్డారు. శృంగార చేష్టలతో తిరుమల పవిత్రతను నాయుడు అపపవిత్రం చేశారని వారు ఆక్షేపించారు. జిల్లా వైకాపా అధ్యక్షుడు, జెడ్పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల విశ్వేశ్వర రావు, కెవి సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, మీసాల వరహాల నాయుడు, కొనిసి కృష్ణం నాయుడు, పి.కుమార్, ముల్లు రాంబాబు, బొంపల్లి వెంకట రావు, పల్లి జగదీశ్వరరావు, బమ్మిడి కార్తీక్, బూడి శ్రీరాములు నాయుడు, తోట తిరుపతి రావు, గుడివాడ శ్రీరాములు నాయుడు, శివుకు కాంతారావు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయం నుండి గరివిడి ప్రధాన రహదారి మీదుగా మండే ఎండలో ..ర్యాలీ నిర్వహించిన వైకాపా నేతలు టీటీడీ ఛైర్మన్ నాయుడు శృంగార క్రీడ పైన, కూటమి ప్రభుత్వం వ్యవహార శైలి పైనవారు నిప్పులు చెరిగారు. ర్యాలీ గా వెళ్లిన వారు గరివిడి శ్రీ వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. తిరుమల పవిత్రతను కాపాడాలని వారు వెంకన్న స్వామిని వేడుకొన్నారు. కార్యక్రమంలోపెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు





నెల్లిమర్ల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ఉన్న బకాయి ల్లో మెడికల్ రియంబర్స్మెంట్ గ్రూప్ ఇన్సూరెన్స్, జిపిఎఫ్ తదితర 7 వేల కోట్ల రూపాయల బకాయి బిల్లులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయు డుకు ఏ పి ఎన్ జి జి ఓ నెల్లిమర్ల తాలూకా యూనిట్ నాయకులు ధనుంజయ్, మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. వారు శనివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్స్, సరెండర్ లీవ్ బకాయిలు కూడా త్వరితగతులు విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల శ్రేయస్సు పై నిరంతరం పోరాడుతున్న తమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాగర్, ప్రధాన కార్యదర్శి రమణ బకాయిల విడుదలకు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తాలూకా యూనిట్ అధ్యక్షులు ధనుంజయ్, కార్యదర్శి మోహన్, కోశాధికారి వాసుదేవరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తవుడు, మాధవి, నారాయణ రావు, సురేష్, చందన, మహిత, తదితరులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## యాప్ కష్టాలతో ఉపాధి పనులకు వేతనదారులు దూరం

(గరుగుబిల్లి), ఏప్రిల్ 4, ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల హాజరుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నూత నంగా ప్రవేశపెట్టిన ఐరిష్ విధానం కష్టజీవులకు చుక్కలు చూపిస్తోంది. ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు ప్రతిరోజు ఐరిష్ నమోదు తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం జరిగింది. అయితే నూతనంగా ప్రవేశపెట్టిన ఐరిష్ విధానం యాప్ లో సాంకేతిక సమస్యలతో వేతన దారులు పనులకు దూరమవుతుం డడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి జాతీయ మొబైల్ పర్యవేక్షణ విధానం (ఎన్.ఎం. ఎం. ఎస్) లో కొత్తగా తీసుకు వచ్చిన యాప్‌లో వేతన దారుల ముఖ ఆధారిత హాజరు ప్రస్తుతం పెద్ద సమస్యగా తయా రైంది. క్షేత్రసహాయకులు తమ చరవాణిలో యాప్ ఓపెన్ చేసి వేతనదారుల ఫోటో తీసినప్పుడు కనురెప్పలు మూసి తెరవాలి. ఇలా ఐదు నుంచి ఆరుసార్లు కనురెప్పలు మూసి తెరవాలి. ఈప్రక్రియను ప్రస్తుతం నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ సరిగ్గా గుర్తించడం లేదు. దీంతో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల్లో చాలామంది యాప్ కష్టాలు కారణంగా పనులకు దూరం అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వేతనదారుల వివరాలతో ఉపాధి హామీ పథకం సిబ్బంది గత నెలలో ఈకేవైసీ చేయించారు. ఈ నేపథ్యంలో ఆధార్ కార్డులో ఉన్న వివరాలతో పాటు వేతన దారుల ఫోటోలు తీసి క్షేత్ర సహాయకులు యాప్లో అప్లోడ్ చేశారు. ఈకెవైసీ డేటా ఆధారంగా పనులు జరుగుతున్న ప్రదేశంలో వేతనదారులు ఐరిస్ తీసుకుంటున్నారు. అయితే ఏ వేతన దారుల వివరాలతో సిబ్బంది ఈకెవైసీ చేయించారో అదే వేతన దారుల ఐరిస్ సరిపోకపోవడం, మిస్ మ్యాచ్ కావడంతో ఇటు పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు అటు ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయ కులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ హాజరుకు సంబంధించిన యాప్ సక్రమంగా పని చేస్తే పని చేసేందుకు వీలుగా ఉంటుందని పనుల్లో పాల్గొంటున్నప్పటికీ ముఖ హాజరు పడకపోవడంతో వేతనదారులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ హాజరు యాప్ మార్పులు చేసి సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని వేతనదారులు కోరుతున్నారు.

## కోటియా గ్రామాల్లో డ్రై డేపై అవగాహన




సాలూరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త :సాలూరు మండలం కోటియా పరిధిలో ఉన్న గంజాయి భద్ర గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించాలి. ఆరోజు సెలవు కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శనివారం ప్రత్యేక అధికారి రమణమూర్తి ఇంకా ఎంపీడీవో పార్వతి అక్కడ గ్రామ ప్రజలకు డ్రై డే అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతు గిరిజన గ్రామాల్లో ఆరునెలల నుండి మలేరియా జ్వరాలు తగ్గుముఖం పట్టాయని గిరిజనులు తెలియజేసారన్నారు. అలాగే గిరిజనులు నిరక్షరాస్యత కారణంగా ఒరిస్సా పిహెచ్సికు వైద్య సేవలకు వెళుతున్నారని, సాలూరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభించారని అవగాహన కల్పించి గిరిజనులు ఏరియా ఆసుపత్రులు వైద్య సేవలు వినియోగించుకోవాలని పలు సూచనలు చేసారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతు గ్రామాల్లో ఉన్న కాలువలు ఇంటి ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజన ప్రజలకు అవగాహన కల్పించాలని క్లారిటీ ఇచ్చారు.

## హెూమియో వైద్యంతో రోగ నివారణ



నెల్లిమర్ల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త రసాయన మందులు ద్వారా పండించే ఆహార పదార్థాలను తినడం ద్వారా రోగ నిరోధక శక్తి, శరీరదృఢత్వం తగ్గుతున్న తరుణంలో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు హోమియో వైద్యం సరైనదని డాక్టర్ పి. సురేష్ అన్నారు. విజయనగరం గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ, నెల్లిమర్ల సత్య దేవా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మిమ్స్ హోమియో వైద్య కళాశాల వారి సౌజన్యంతో కొత్తపేట సత్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో శనివారం మెగా హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఏడిద వీర్రాజు, వైద్యులు టీ. సాయికుమార్, మల్లికార్జున్, లక్ష్మి, చేతన, సంఘ సభ్యులు చంద్రశేఖర్ , బి. వి. రమణ రావు, వి ఎల్ ఎన్ మూర్తి, సర్వేశ్వరావు కుమార్, తదితరులు పాల్గున్నారు.

## హెల్మెట్‌ధారణపై వాహనదారులకు అవగాహన




పార్వతీపురం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్పీ మనీషా రెడ్డి సూచనలతో పట్టణ సిఐ వెంకట్రావు వారి సిబ్బందితో కలిసి ప్లకార్డులతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ పట్ల నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై సురక్షితంగా ప్రయాణం సాగించేందుకు ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త 25

## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ



రామభద్రపురం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ క్రికెట్ బెట్టింగు నిర్వహించినా లేదా పాల్గొన్నా కఠినంగా వ్యవహరిస్తాం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ లో క్రికెట్ బెట్టింగులు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదుచేసి, రౌడీ షీటులు తెరుస్తామని హెచ్చరించిన బొబ్బిలి రూరల్ సీఐ శ్రీనివాస్ బెట్టింగులతో ఆర్థికంగా నష్టపోవడం, అప్పులుపాలవడం తప్పదన్న పోలీస్ వారు హెచ్చరికలు చేస్తున్నారు. ఎవరైనా బెట్టిం గులకు పాల్పడితే సమాచారాన్ని డయల్ 112/100 లేదా స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం అందించాలని తెలియచేశారు. క్రికెట్ బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు రామభద్రపురం పోలీస్ వారు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగుల జోలికి పోవద్దని ప్రజలు, యువతను పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ బెట్టింగులకు పాల్పడడం వలన ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగిస్తాయని, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమైన చర్య అని, ఇందులో పాల్గొనే వారు, నిర్వహించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, బుకీలపై అనుమానాస్పద ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ నిరంతరం నిఘా పెట్టామ న్నారు. క్రికెట్‌ను ఆస్వాదించాలి తప్ప ఇటువంటి చట్ట వ్యతిరేక బెట్టింగులకు పాల్పడకూడదని రామ భద్రపురం పోలీసులు తెలిపారు. తల్లితండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ ఉం డాలన్నారు. ఈ తరహా బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవన్నారు. కావున, ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు జోలికి పోవద్దన్నారు. బెట్టింగులతో డబ్బులు సంపాదించవచ్చు అనే అత్యాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాదించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ప్రత్యేకాధికారి



పాచిపెంట ఏప్రిల్,4 ప్రభాతవార్త : ఫ్రైడే డ్రై డే సందర్భంగా శుక్రవారం సెలవు దినం కావడంతో శనివారం మండల కేంద్రమైన పాచిపెంట పలు వీధుల్లో పారిశుధ్య పనులు మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ ఎంపీడీవో బివిజే పాత్రో పారిశుధ్య కార్మికులతో నిర్వహించారు. ఈ క్రమం ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో సచివాలయం పంచాయితీ కార్యదర్శి దీపక్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు వీధుల్లో కాలువలలో పూడికతీతలు తీయించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మేధర వీధి జంక్షన్లో పాఠశాల విద్యార్థుల అవగాహన కల్పించారు. తమ తమ ఇల్లులో చెత్తను వీధి కాలువల్లో పార వేయకుండా చెత్త బుట్టలో వేసి చెత్త బండ్లు వచ్చినప్పుడు చెత్తను వేయించే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీధి కాలువలు పరిశుభ్రంగా ఉంచి తమ తమ ఆరోగ్యాలు కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నినాదాలు చేయించారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు నివారించవచ్చని ఆయన అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఎంపీడీవో బి వి జె పాత్రో మాట్లాడుతూ చెత్త ఎక్కడ పెడితే అక్కడ చెత్త వేయకుండా చూడా లని ఆయన కోరారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రంగా పరిసర ప్రాంతాలు ఉంచు కోవాల్సి న బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. ఆరోగ్య సిబ్బంది సచివాలయం సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

## వైభవంగా శ్రీరాముడి కల్యాణ పట్టాభిషేకం



మెరకముడిదాం, ఏప్రిల్4 : మండలంలో బాడాం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీరామచంద్రమూర్తి కళ్యాణ పట్టాభిషేకం కనుల పండగగా శనివారం విశేష భక్తుజన సందోహం మధ్య అంగ రంగ వైభవంగా జరిగింది. లోకకళ్యాణార్థం గ్రామ సుభిక్షం కోసం గ్రామస్తులందరూ ఏకమై నిర్వహించారు. శ్రీరామచంద్రమూర్తి కార్యక్ర మం అత్యంత స్తోత్రయుతంగా జరిగింది. ఈ మహత్తర పుణ్య కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త, గ్రామ పెద్దల సమక్షంలో గెద్ద అప్పలనాయుడు దంపతులు కుటుంబ సభ్యులు కర్తలుగా వ్యవహరిస్తారు. మంగళ వాయిద్యాలతో, రవళి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించడమైనది. ఈ వేడుకను పురస్కరించుకొని బాడాం పూర వీధిలన్నీ భక్తి కీర్తనలతో ప్రతిధ్వ నించాయి. గ్రామ రక్షణకై జరిగిన ఒక దివ్య యజ్ఞం అని గ్రామానికి ఎటువంటి అరిష్టలు కలగకూడదని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు శ్రీ కోదండ రాముడిని వేడుకొన్నారు. వేద పండితులు రేజేటి శ్రీను బాబు సిద్ధాంతి పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు : ఎస్ఐ



బొండపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : మైనర్లు వాహనాలు నడిపినట్లు అయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొండపల్లి ఎస్సై యు. మహేష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకుని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని లేకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఇన్సూరెన్స్ తదితర పేపర్లు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశారు.

## వార్డు మెంబర్లకు సత్కారం

బలిజపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : రంగాపురం గ్రామంలో గ్రామ సచివాలయం పరిధిలో గల వార్డు మెంబర్లకు మరియు సర్పంచ్ కి ఆ గ్రామ ఎంపీటీసీ గులుపల్లి మురళి గ్రామ సర్పంచులకు వార్డు మెంబర్లకు ఈనెల 2వ తేదీ నుంచి పదవీకాలం ముగియడంతో వారు చేసిన సేవలకు గ్రామ ఎంపీటీసీ గులుపల్లి మురళి శాలువాతో సత్కరించి చిరుకానుక బహుమతిగా బహుకరించారు ధన్యవాదాలు తెలిపారు సర్పంచులు మరియు వార్డు సభ్యుల మీరు గ్రామానికి ఎన్నో సేవలు చేసినందుకు ఈ సత్కారం చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ముగ్గులు, దీపాలతో అమరావతికి సంఘీభావం



లక్కవరపుకోట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : ఆంధ్ర ప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభలు చట్టబద్ధత కల్పించడం పట్ల తెలుగు ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు అని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది అని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ఎల్.కోటలోని తన క్యాంప్ కార్యాలయం ఎమ్మెల్యే లలిత కుమారి రాంప్రసాద్ దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. అమరావతికి సంఘీభావంగా కార్యాలయం ప్రాంగణంలో దీపాలు వెలిగించి, "జై అమరావతి" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని "జై అమరావతి.. జై ఆంధ్రప్రదేశ్" నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇ ఇంటి ముందు దీపాలు వెలిగించి ప్రజలు తమ మద్దతును తెలియజేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాణ కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామ్ ప్రసాద్, ఎల్ కోట మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామ కృష్ణ, ఏ ఏం సి డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, ఎల్ కోట తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్ రాజేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దత్తిరాజేరు, ఏప్రిల్ 4, ప్రభాత వార్త : మండలంలోని గడసాం గ్రామానికి చెందిన బి ఆదినారాయణ కూలి పని కోసం కాకినాడ జిల్లాకు వలస వెళ్లిమూడు నెలల అయింది. కూలి పని కోసం నడుచుకుంటూ వలస పాకలి సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా వెనక నుండి వచ్చి లారీ గట్టిగా డీ కొట్టడంతో ఆదినారాయణ (42) అక్కడికక్కడ మృతి చెందాడు. శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది మృతుడికి భార్య గౌరీ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు భర్త మృతి చెందడంతో పిల్లలను ఎలా పోషించికోవాలని భార్య కన్నీరు మున్నేరే బోరున ఏడ్చింది సర్పవరం ఏఎస్ఐ నారాయణ రావు కేసు నమోదు చేశారు విజయనగరం జిల్లా దత్తరాజేరు మండలం గడసాంగ్రామానికి మృతదేహాన్ని అప్పజెప్పారు.

05-04pg10exHMNWJQEBPRCKLT.qxdo/p:05-04pg10exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 6:31 AM Page 1






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.